

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 21 | మంగళవారం | 17-12-2024 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00


## భుజంగరావు మధ్యంతర బెయిల్ పొడిగింపు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన అదనపు మాజీ ఎస్పీ ఎన్. భుజంగరావుకు హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను పొడిగించింది. అనారోగ్య కారణాల వల్ల కింది కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఆ తర్వాత పొడిగింపు చేయలేదు. దీంతో హైకోర్టు ద్వారా గతంలో పొందిన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను సోమవారం మరోసారి పొందారు. కింది కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం 3వ నిందితుడు భుజంగరావు పిటిషన్ వేశారు.

## సంక్రాంతి నుంచే రైతు భరోసా అమలు



### మరో ఐదు బిల్లులకు క్యాబినేట్ ఓకే

ప్రజాపక్షం / హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిన 'రైతు భరోసా'ను సంక్రాంతి నుంచి అమలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదు బిల్లులను మంత్రివర్గం ఆమోదించింది. మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగింది. ముఖ్యంగా రైతు భరోసా మంత్రివర్గంలో కీలకంగా చర్చించినట్లు సమాచారం. రైతు భరోసాను ఎట్టి పరిస్థితుల్లో అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎంరేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భూమి లేని నిరుపేదలకు రూ.12 వేల చెల్లింపు, అందులో మొదటి దఫాలో జనవరిలో రూ.6 వేల చెల్లింపు, కొత్త రేషన్ కార్డుల జారీ, రికార్డ్స్ ఆఫ్ రెవెన్యూ (ఆర్‌ఓఆర్) చట్టంపై మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. ఓఆర్‌ఆర్ పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలను ఇచ్చే విషయాన్ని సమావేశం చర్చించింది. దీని ద్వారా సుమారు 15 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని, ఇందుకు సంబంధించి రూ.1000 కోట్లు విడుదల చేసే విషయంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## వారం పాటు అసెంబ్లీ సమావేశాలు!

### బిఎసి సూత్రప్రాయ నిర్ణయం... నేడు సభలో స్పీకర్ ప్రకటన



ప్రజాపక్షం /హైదరాబాద్

శాసనసభ శీతాకాల సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని సభా వ్యవహారాల సలహా కమిటీ (బిఎసి) నిర్ణయించినట్లు సమాచారం. శాసనసభను ఎన్ని రోజులు నిర్వహించనున్నారు. చర్చించే అంశాల వివరాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం సభలో ప్రకటించే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బిఎసి సమావేశం సోమవారం ఆయన ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశానికి సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. విపక్షాల నుంచి సిపిఐ శాసనసభా పక్షం నాయకులు నుంచి కూనంనేని సాంబశివరావు , బిఆర్‌ఎస్ సభ్యులు తరపున టి.హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బిజెపి నుంచి పాయల్ శంకర్, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ తరువాయి 2లో

## ఏ జిల్లానూ రద్దు చేయం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వానికి పాత జిల్లాలను రద్దు చేసే ఆలోచనే లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం శాసన మండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యులు కల్వకుంట్ల కవిత, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బదులిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లాను కూడా రద్దు చేయబోదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేంద్ర మంత్రులను కలిసేందుకు పలు సార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని కె.కవిత అడగ్గా, స్పందించిన మంత్రి రాష్ట్ర ప్రభుత్వమేదైనా నిధుల కోసం కేంద్రం వద్దకు వెళ్లడం హక్కు అని, అయితే వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని సభ్యులు గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అవిర్భావం తర్వాత 10ఏళ్ల పాటు అధికారం చెలాయించిన బిఆర్‌ఎస్ వారి హయాంలో కేంద్రం నుంచి తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకువచ్చారో అందరికీ తెలుసని విమర్శించారు. తమది పేదల ప్రభుత్వమని, పేదల కోసం తరువాయి 2లో

## సభా మర్యాదలు దెబ్బతీయొద్దు



- బిఆర్‌ఎస్ సభ్యులపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అసంతృప్తి
- సభలో ప్లకార్డులు ప్రదర్శించడంపై ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ సభ్యులు ప్లకార్డుల ప్రదర్శన, నినాదాల మధ్య శాసనసభ మంగళవారం ఉదయం వాయి దా పడింది. లగచర్ల ఘటనపై చర్చకు పట్టుపడుతూ బిఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులనుప్రదర్శించారు. దీంతో సభామర్యాదలు దెబ్బతీసేలా సభ్యులు వ్యవహరిస్తున్నారని, ఇది మంచి ప్రాక్టీస్ కాదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్లకార్డులను తీసివేసి తమ తమ స్థానాల్లో కూర్చోవాలని, హరీశ్ రావుకు మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తామని స్పీకర్ పదే పదే చెప్పినా బిఆర్‌ఎస్ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించడంతో శాసనసభను మంగళవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అంతకుముందుకు విరామం తర్వాత సమావేశాలు ప్రారంభమవ్వగా 'తెలంగాణ తరువాయి 2లో

### ఆర్థిక స్థితిని దిగజార్చారు : జూపల్లి



ఉపాధి అవకాశాలు, ఆదాయం పెంచే పర్యాటక పాలసీపైన చర్చ జరగకుండా సభను అడ్డుకోవడం దుర్మార్గమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. శాసనసభలో 'తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక విధానం''పై జరిగిన చర్చలో మంత్రి జూపల్లి కృష్ణారావు మా ట్లాడుతూ గడచిన పదేళ్ల కాలంలో ఉద్యోగాలు, ఉపాధి పెంచాలనే ఆలోచన గతంలో రాలేదని, తాము పర్యాటక పాలసీ తీసుకొచ్చి, ఉపాధి తరువాయి 2లో

### సంక్రాంతి తరువాత కొత్త రేషన్ కార్డులు జారీ



సంక్రాంతి తర్వాత కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీ చేయనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో ప్రొఫెసర్ ఎం. కోదండరామరెడ్డి, మిర్జా రియాజుల్ హసన్ ఏఫెండి, మిర్జా రహమత్ బేగ్, జీవన్ రెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తరువాయి 12లో

### నోటిఫికేషన్లు జారీ చేస్తే ఉద్యోగాలు భర్తీ అయినట్లా?



ఉద్యోగాల భర్తీకి సంబంధించి కేవలం నోటిఫికేషన్ ఇచ్చినంత మాత్రన ఉద్యోగాలు ఇచ్చినట్లు కాదని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలకు చురకలు అంటించారు. సోమవారం శాసనమండలిలో వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీకి సంబంధించి కాంగ్రెస్, సభ్యులు డాక్టర్ బల్మూర్ వెంకట్ నర్సింగ్ రావు, తరువాయి 2లో



## మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు

### ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్ సోమవారం విడుదలైంది. 2025 మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు ఇంటర్‌బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. జనవరి 29న ఇంటర్ ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 30న పర్యావరణ పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరువాయి 2లో



## నెహ్రూ లేఖ... మోదీ వక్రీకరణ

- ప్రధాని బహిరంగ క్షమాపణ చెప్పాలి
- రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున ఖర్గే డిమాండ్

**న్యూఢిల్లీ** : రిజర్వేషన్లపై రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ రాసిన (1961 జూన్ 27) లేఖ గురించిన వాస్తవాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వక్రీకరించారనీ, దేశాన్ని తప్పుతోవ పట్టించారని రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే విమర్శించారు. మోదీ వెంటనే ఈ విషయంపై క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. 75 సంవత్సరాల భారత రాజ్యాంగ మహోన్నత ప్రస్థానంపై రాజ్యసభలో సోమవారంనాడు చర్చ ప్రారంభమైంది. ఈ చర్చలో పాల్గొన్న ఖర్గే 79 నిమిషాలసేపు ప్రసంగించారు. రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమనీ, అందుకే కులగణనను ఆ పార్టీ వ్యతిరేకిస్తోందనీ విమర్శించారు. బిజెపి ఇచ్చిన వాగ్దానాలన్నీ వట్టి బూటకాలేనని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యపోరాటంలో భాగస్వామ్యంలేనివారికి దేశ స్వేచ్ఛ, దేశ రాజ్యాంగం ప్రాధాన్యత ఏం తెలుస్తుందని ఆయన ప్రశ్నించారు. నెహ్రూ,గాంధీ, ఇతరనాయకులకు సంబంధించిన వాస్తవాలను, మంచి విషయాలను బిజెపి మరుగుపరుస్తోందని విమర్శించారు. దేశ రాజ్యాంగం మనుస్మృతిపై ఆధారపడిలేదుగనుకనే ఆనాడు ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రాజ్యాంగాన్ని వ్యతిరేకించారనీ, 1949 నవంబరు 30వ తేదీన ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' ఈ విషయాన్ని ప్రచురించిందని ఖర్గే గుర్తుచేశారు. వయోజన ఓటింగ్‌ను 'ఆర్గనైజర్' వ్యతిరేకిస్తూ 1951–52లో వ్యాసాలు రాసిందనీ, ఈనాడు బిజెపి నాయకులు వయోజన ఓటింగ్ గురించి పాఠాలు వల్లెవేస్తున్నారని విమర్శించారు. ఎమర్జెన్సీ గురించి ప్రస్తావిస్తూ, ఎమర్జెన్సీ ఒక తప్పిదని, ఆ తర్వాత 1980లో ఇందిరాగాంధీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి రావడంతో ఆ తప్పుకు దిద్దుబాటు జరిగిందని అన్నారు. ఇడి, సిబిఐ బెదిరింపుల వల్లనే కాంగ్రెస్‌వారు భయపడి బిజెపిలో చేరారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ దేశాన్ని ఐక్యంగా ఉంచిందని, దేశంలో ఉన్న 500 రాజాస్థానాలను దేశంలో వల్లభాయ్‌పటేల్ విలీనం చేశారని గుర్తుచేశారు. బిజెపి నాయకులు మోదీపట్ల భక్తిప్రపత్తులు ప్రదర్శిస్తున్నారని, ఈ విధమైన భక్తి అంతిమంగా దేశంలో నియంతృత్వానికి దారితీస్తుందని హెచ్చరించారు. దేశంలో కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాలు అమలు చేసిన విధానాలే మహిళా రిజర్వేషన్ చట్టరూపం దాల్చడానికి కారణమని, కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకారణంగానే మహిళా రిజర్వేషన్ స్వప్నం ఈనాడు సాకారమైందని, కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండి ఉంటే పార్లమెంటులో, శాసనసభలలో మహిళా రిజర్వేషన్లను బిజెపి కంటే ఇంకా చాలా వేగంగా అమలులోకి తీసుకువచ్చి ఉండేదని ఖర్గే ఉద్ఘాటించారు. దేశంలో ప్రతీవ్యక్తి బ్యాంకు అకౌంటులోనూ రూ.15 లక్షలు జమచేస్తామని అధికారంలోకి రాకముందు బిజెపి వాగ్దానం చేసిందనీ, ప్రతి సంవత్సరం రెండు తరువాయి 12లో

### కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి

#### ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ విమర్శ

కాంగ్రెస్‌పార్టీ మహిళా వ్యతిరేకి అని రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విమర్శించారు. 75 సంవత్సరాల రాజ్యాంగ ప్రస్థానంపై రాజ్యసభలో తొలుత ఆమె చర్చను ప్రారంభించారు. కాంగ్రెస్ కుటుంబానికి మేలుచేసేవిధంగా ఆ పార్టీ రాజ్యాంగానికి సవరణలు చేసిందని విమర్శించారు. మహిళా వ్యతిరేకి గనుకనే యుపిఎ పాలనలో కూట మి పార్టీల ఒత్తిడి కారణంగా తన కుర్చీ కాపాడుకునేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించలేదని ఆరోపించారు. అదేవిధంగా 426 మంది ఎంపీల భారీ బలం ఉన్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వం కూడా మహిళారిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు ఏమాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మహిళా వ్యతిరేకి అని చెప్పడానికి షా బానో కేసు ఒక పెద్ద ఉదాహరణ అని నిర్మలాసీతారామన్ అన్నారు. కాంగ్రెస్‌పార్టీ 50 సంవత్సరాలపాటు అనుసరించిన ఆర్థిక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ రాజ్యాంగానికి చేసిన ఏ ఒక్క సవరణా కూడా దేశ ఆర్థిక,సామాజిక పురోగతికి దోహదపడలేదని, దేశ ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయలేదని విమర్శించారు.

## 'నేడు' లోక్‌సభ ముందుకు 'జమిలి ఎన్నికల బిల్లు'

### విస్తృత సంప్రదింపుల కోసం జెపిసికి పంపించాలని సిఫారసు అవకాశాలు

### లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అభ్యర్థించనున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్



**న్యూఢిల్లీ :** లోక్‌సభ, రాష్ట్రాలఅసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ఒకే దేశంఒకే ఎన్నిక (వన్ నేషన్‌వన్ ఎలక్షన్) ప్రణాళిక ఎట్టకేలకు మంగళవారం నాడు (డిసెంబరు 17) పార్లమెంట్ ముందుకు రానుంది. అందుకు రంగం సిద్ధమైంది. దీనికోసం 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లు 'వన్ నేషన్‌వన్ ఎలక్షన్'(ఒఎన్‌ఒఇ)ను కేంద్రం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నది. అనంతరం ఉభయ సభల సంయుక్త కమిటీకి దీనిని పంపించాలని కేంద్రం సిఫారసు చేసే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ అధికార వర్గాలు వెల్లడించాయి. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న బిల్లులో పార్లమెంట్‌తో అసెంబ్లీకి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితులకు సంబంధించిన నిబంధన ఉంది. రాజ్యాంగ సవరణ బిల్లు మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.అయితే లోక్‌సభతో ఎన్నికలకు వెళ్లలేని అసెంబ్లీ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేయడానికి రాష్ట్రపతి తరువాయి 12లో



## మూసీ, హైడ్రాపై సిపిఐ వాయిదా తీర్మానం

### లగచర్లపై బిఆర్‌ఎస్ వాయిదా తీర్మానం తిరస్కరించిన స్పీకర్ ప్రసాద్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ ప్రక్షాళన, హైడ్రా అంశాలపై చర్చించేందుకు శాసనసభలో సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఇండ్ల కూల్చివేతతో నిర్వాసితులుగా మారుతున్న స్థానికులు, వారికి ప్రత్యామ్నాయ వసతి సౌకర్యాల కల్పన, నష్టపరిహారం చెల్లింపుపై చర్చించడంతో పాటు హైడ్రాతో ఇండ్ల తరువాయి 2లో

## చట్టప్రకారమే దర్యాప్తు

### ఇ - కార్ రేస్‌లో అవినీతిపై మాజీ మంత్రి కెటిఆర్‌ను విచారించేందుకు గవర్నర్ ఆమోదం

### 'నేడు' ఎసిబికి చేరనున్న దస్త్రం

### సంచలన అంశాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకోనుంది. ఫార్ములా ఇ–కార్ రేసులో అవినీతి ఆరోపణల నేపథ్యంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటి. రామారావును విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. సంబంధిత ఫైల్ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. ఈ విషయాన్ని సోమవారం అసెంబ్లీ కమిటీహాల్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. మంత్రివర్గ సమావే శం అనంతరం రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సంచలన అంశాలు వెల్లడించారు. 'ఫార్ములా కార్‌రేస్ సంబంధించిన అంశానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతి ఇచ్చారు. ఇక చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుంది. ఈ వ్యవహారంలో చట్టం ప్రకారమే దర్యాప్తు కొనసాగుతోంది. కెటిఆర్‌ను విచారించేందుకు అనుమతి ఇప్పటికే లభించిందని, తరువాయి 2లో

## భారత్–శ్రీలంకల బంధం మరింత బలోపేతం

- ఇరు దేశాల మధ్య త్వరలోరక్షణ, విద్యుత్, వ్యాపార ఒప్పందాలు
- జాలర్ల అంశంలో మానవత్వంతో వ్యవహరించాలి
- రామేశ్వరం, తలైమన్నార్ మధ్య ఫెర్రీ సర్వీసులు
- భారత ప్రధాని మోదీ, శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకెల నిర్ణయం



**న్యూఢిల్లీ :** రక్షణ, విద్యుత్, వ్యాపారం బంధాన్ని మరింత పెంపొందించుకోవాలని భారత్, శ్రీలంక దేశాలు నిర్ణయించాయి. ఉభయ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసుకోవాలని, త్వరలోనే రక్షణ సహకార ఒప్పందాన్ని పూర్తి చేసుకోవాలని, విద్యుత్ గ్రిడ్ అనుసంధానత ద్వారా విద్యుత్ బంధాన్ని మరింత పెంపొందించుకోవాలని, బహుళ ఉత్పత్తుల పెట్రోలియం పైప్‌లైన్‌లను పెంచుకోవాలని నిర్ణయించాయి. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, శ్రీలంక దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకల మధ్య జరిగిన విస్తృత స్థాయి చర్చల్లో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఇరుపక్షాల మధ్య పెట్టుబడి ఆధారిత వృద్ధి గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నొక్కి చెబుతూ భారత్–శ్రీలంక ఆర్థిక భ్యాగస్వామ్యానికి తరువాయి 12లో

# బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు ఓ సవాల్

వీలైతే వచ్చే ఏడాది డిసెంబరులోనే పోలింగ్

బంగ్లా విజయోత్సవ సందేశంలో యూనస్



**ఢాకా :** బంగ్లాదేశ్ పార్లమెంటుకు వచ్చే ఏడాది చివరిలో లేదా 2026 ప్రారంభంలో ఎన్నికలు జరుగుతాయి. మహ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం సోమవారంనాడు ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. డిసెంబరు 16వ తేదీ సోమవారంనాడు బంగ్లాదేశ్ 54వ విముక్తి దినోత్సవం సందర్భంగా టీవీ ఛానల్‌లో జాతిని ఉద్దేశించి ప్రసంగించిన యూనస్ ఈ విషయం ప్రకటించారు. ఎన్నికల ఏర్పాట్లకు ముందుగానే సంబంధిత సంస్కరణల ప్రక్రియను పూర్తిచేస్తామని ఆయన ప్రకటించారు. గడచిన 15 సంవత్సరాలుగా దేశంలో ఓటర్ల జాబితాలను సంస్కరించలేదని, అంతా తప్పుల తడకగా వ్యవహారం నడిచిందని, నకిలీ ఓటర్లతో చెలామణీలో ఉన్నాయని, అందువల్ల ఇప్పుడు ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితా సవరణ ఒక పెద్ద సవాలుగా మారిందని ఆయన తన సందేశంలో చెప్పారు. పార్లమెంటుకు ఈసారి ఎన్నికల్లో నూటికి నూరుశాతం ఓటర్లు ఓటు హక్కు ఉపయోగించుకునేలా చేయాలనేదే తన స్వప్నమని యూనస్ అన్నారు. ఈ స్వప్నం గనుక నెరవేరితే ఇక బంగ్లాదేశ్‌లో ఓటర్ల హక్కులను ఎవ్వరూ దోచుకోలేరని ఆయన అన్నారు. షేక్ హసీనా ప్రభుత్వాన్ని వెళ్ళగొట్టిన తర్వాత ఈ విజయోత్సవ వేడుకలు దేశానికి ఎంతో ప్రత్యేకమైనవిగా ఆయన అభివర్ణించారు. గడచిన ఆగస్టు నెలలో విద్యార్థుల ఉద్యమం కారణంగా పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనా స్థానంలో తాత్కాలిక దేశాధినేతగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ యూనస్ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. దేశానికి ఒక ప్రధాన సలహాదారుణ్ణి నియమించాలని ఆయనపై తీవ్రమైన ఒత్తిడి వస్తున్నది. అమెరికా పెంపిపోషించిన ఆ దేశ అనుకూల నాయకుడుగా ముద్రపడిన యూనస్ 84 ఏళ్ళ వయసులో దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలను పునరుద్ధరించేవిషయంలో తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాజకీయ ఏకాభిప్రాయం కుదిరితే కనీస సంస్కరణలతో కొత్త ఓటర్ల జాబితాను రూపొందించడం ద్వారా 2025 సంవత్సరం ఆఖరునాటికి లేదా 2026 ఆరంభంనాటికి దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తామని యూనస్ ప్రకటించారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేదీ సరైన తేదీలను 2025 సంవత్సరం ఆఖరులో నిర్ణయిస్తామని ఆయన తన టీవీ సందేశంలో చెప్పారు. బంగ్లాదేశ్ భాషలో ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. పాకిస్తాన్‌పై విజయం సాధించిన సందర్భంగా 1971 డిసెంబరు 16న బంగ్లాదేశ్‌లో విజయోత్సవ వేడుకలు మొదటిసారి జరిగాయి. అప్పటినుంచీ ప్రతి ఏడాదీ ఈ విజయోత్సవ వేడుకలు చేసుకుంటున్నారు.

**చరిత్రను అణచివేస్తున్న యూనస్**
**షేక్ హసీనా ఎదురుదాడి**

పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనా, ఆ దేశ తాత్కాలిక నాయకుడు, నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ మధ్య బంగ్లాదేశ్ విముక్తి దినోత్సవం సందర్భంగా మాటలయుద్ధం జరిగింది. బంగ్లాదేశ్ ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టించారని హసీనాపై యూనస్ ఆరోపణలు చేశారు. దీంతో షేక్ హసీనా ఆయనపై ఎదురుదాడి చేశారు. యూనస్ బంగ్లాదేశ్ చరిత్రను అణచివేస్తున్నారని, దేశంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. గడచిన ఆగస్టునెలలో దేశం నుండి భారత్‌కు వచ్చిన గద్దె తెలియని ప్రదేశంలో నివసిస్తున్న హసీనా బంగ్లాదేశ్ విముక్తి దినోత్సవం సందర్భంగా మరోసారి గళం విప్పారు. బంగ్లాదేశ్ విముక్తి దినోత్సవానికి అనేక విధాలుగా ప్రాధాన్యం ఉందని,ఆ ప్రాధాన్యతను యూనస్ మరుగుపరుస్తున్నారని, అసత్య ప్రచారం చేస్తున్నారని హసీనా విమర్శించారు.ఇదిలా ఉండగా షేక్ హసీనా ప్రభుత్వహయాంలో అనేకమంది బంగ్లాదేశ్‌లో అదృశ్యమయ్యారని ఇందుకు ఆమే ప్రధాన కారణమని ఒక మధ్యంతర నివేదిక వివరించింది. యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం ఐదుగురు న్యాయమూర్తులతో ఏర్పాటు చేసిన ఒక కమిటీ 'ద అన్‌ఫోల్డింగ్ ట్రూత్' పేరుతో మధ్యంతర నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం, షేక్‌హసీనా పరిపాలనాకాలంలో ఆమెకు అడ్డుగా ఉన్న 3,500 మంది అనేక విధాలుగాఅదృశ్యమయ్యారు. వీరిలో చాలామంది జైళ్ళలో బందీలుగా ఉండగా వందలమంది జాడ తెలియరాలేదని నివేదిక పేర్కొంది.




# బిట్‌కాయిన్‌కు మహర్దశ



**న్యూయార్క్ :** బిట్‌కాయిన్ కరెన్సీకి మహర్దశ పట్టింది. చరిత్రలో ఎన్నడూలేనిరీతిలో బిట్‌కాయిన్ కరెన్సీ విలువ సగటానికి సగం మేరకు పెరిగింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డోనాల్డ్‌ట్రంప్ ఓటర్లకు చేసిన వాగ్దానం మేరకు సోమవారం నాడు ఒకసానుకూల ప్రకటన చేయడంతో బిట్‌కాయిన్‌కు చరిత్రలో ఎన్నడూలేనివిధంగా మహర్దశ పట్టింది. క్రిప్టో కరెన్సీకి అనుకూలంగా ట్రంప్ ఒక ప్రకటన చేయడంతో బిట్‌కాయిన్ విలువ 1,06,000 డాలర్లకు పెరిగింది. ఆయిల్ రిజర్వుల తరహాలోనే బిట్‌కాయిన్ రిజర్వులను కూడా ఉంచుతామని ట్రంప్ సోమవారం చెప్పడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రపంచంలో అత్యుత్తమమైన బెస్ట్ నోన్ క్రిప్టో కరెన్సీగా బిట్‌కాయిన్ ముద్రవేసుకుంది. ట్రేడింగ్‌లో తాము బ్లూ స్కై లో ఉన్నామని సంబంధిత వర్గాలు చెప్పాయి. గడచిన జులైనెలలో నాష్విల్లీ, టెన్నెసీలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో "మీ బిట్ కాయిన్‌ను అమ్ముకోకండి, మీ దగ్గరే ఉంచుకోండి, దానికి మహర్దశపట్టిస్తాను, ఆయిల్ రిజర్వుల తరహాలోనే" అని అమెరికా ఓటర్లకు ట్రంప్ హామీలు కురిపించారు. అందుకు అనుగుణంగానే సోమవారంనాడు ఆయన చేసిన ప్రకటనతో బిట్ కాయిన్‌కు మహర్దశ పట్టింది.

## చట్టప్రకారమే దర్యాప్తు (మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ అనుమతి ఇస్తూ జారీ చేసిన దస్త్రాన్ని సోమవారం రాత్రి, లేదా మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏసిబికి పంపిస్తారు. చట్టం ప్రకారం ఏసిబి దర్యాప్తు కొనసాగుతోంది'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇ – కార్‌రేస్ వ్యవహారంలో డబ్బులు చేతులు మారాయని, ఇ – కార్‌రేస్‌లో జరిగిన దోపిడీ వారి స్వలాభం కోసం చేసిన పనులపై మంత్రివర్గంలో చర్చించామని తెలిపారు. కెటిఆర్ అరెస్టుపై తానేమీ చెప్పలేనని, చట్టం తన పని తాను చేస్తుందని, ఆయన ఏసిబి వద్ద సమాధానం చెప్పుకోవాలన్నారు. తీగలాగితే డొంక కదులుతోందని, తాము చెప్పేటివన్నీ తుస్సు బాంబులు అయితే వారు ఎందుకు బయపడుతున్నారని, ఢిల్లీ చుట్టూ ప్రదక్షణలు ఎందుకు చేశారని మంత్రి ప్రశ్నించారు. జైలు తరువాత పాదయాత్ర చేస్తారా?, మొకాళ్ల యాత్ర చేస్తారా? వారిష్టమని వ్యాఖ్యనించారు. ఇ – కార్ రేస్‌లో ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు ప్రభుత్వం అనుమతిచిందన్నారు. ఈ విషయంలో మొదటి విడతలో ముగ్గురు నుండి నాలుగురు ఉన్నారని, ఏజెన్సీలపై కూడా కేసులు అవుతాయని ఆయన చెప్పారు.

**నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు..**

బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేసింగ్‌లో భారీ స్కాం జరిగినట్లు రేవంత్ రెడ్డి సర్కార్ గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా నిధుల చెల్లింపులు జరిగాయని విచారణలో బయటపడింది. రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేకుండానే విదేశీ కంపెనీతో ఒప్పందం, చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే గత ప్రభుత్వం చెల్లింపులు చేసిందని, నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థలకు నిధులు మళ్లింపులు జరిగాయి. ఫార్ములా ఈరేసింగ్‌లో అడ్డగోలుగా వ్యవహారం జరిగిందని రేవంత్ రెడ్డి సర్కార్ గుర్తించింది. దీంతో ఫార్ములా ఈ రేసింగ్ వ్యవహారంపై దర్యాప్తు ఏసిబికి ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. 2023లో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించింది.

**ఏసిబికి ఫిర్యాదు చేసిన మున్సిపల్ శాఖ..**

ట్యాంక్ బండ్ వద్ద మూడు కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించ లేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించింది. ఆర్థిక శాఖ అనుమతులు లేకుండానే ఎమ్ఏయుడి నుంచి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు చెల్లింపులు జరిగాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించడం లేదని విదేశీ సంస్థలు ప్రకటించాయి. దీంతో అంతర్గత దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో దర్యాప్తుతో ఫార్ములా ఈ కార్ రేసింగ్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గత అధికారుల నుంచి ప్రభుత్వం వివరణ కోరింది. ఈ విచారణలో కెటిఆర్ సూచనలతోనే చెల్లింపులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో కెటిఆర్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఏసిబి లేఖ రాసింది. కెటిఆర్ విచారణకు అనుమతి ఇవ్వాలంటూ రెండు నెలల క్రితం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. న్యాయ నిపుణులతో చర్చల అనంతరం కెటిఆర్ విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. అప్పటి నుంచి చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారం తాజాగా గవర్నర్ ఆమోదంతో కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది.

**ఫార్ములా–ఈ రేసులో ఏం జరిగింది?**

హైదరాబాద్‌లో నాలుగు సంవత్సరాలపాటు ఫార్ములా ఈ రేస్ నిర్వహణకు సంబంధించి ఎస్ఈఓ, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి పురపాలక శాఖ 2022 అక్టోబర్ 25న త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నిర్వహించిన మొదటి ఫార్ములాఈ కార్ రేస్ (సెషన్ 9)కు దేశవ్యాప్తంగా అభిమానులు వచ్చినా, ప్రమోటర్ ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ ఆశించిన మేరకు ఆదాయం సమకూరలేదు. దీంతో ప్రమోటర్ తప్పుకొన్నారు. 2024 ఫిబ్రవరి 10న నిర్వహించాల్సిన రెండో దఫా (సెషన్10) ఈకార్ రేస్ నుంచి హైదరాబాద్ పేరును ఎఫ్ఐఓ తొలగించింది. కానీ అప్పటి మంత్రి కెటిఆర్ ఫార్ములాఈ నిర్వహణ హైదరాబాద్‌కు తలమానికంగా ఉంటుందని, 2024 ఫిబ్రవరిలో కూడా హైదరాబాద్‌లోనే కార్ రేస్‌ను నిర్వహించాలని కోరారు. ప్రమోటర్ నిర్వహించే బాధ్యతలను నోడల్ ఏజెన్సీగా హెచ్ఎండిఏ చూసుకుంటుందని ఎస్ఈఓకు స్పష్టం చేశారు. ఈ మేరకు రెండో దఫా ఈ కార్ రేస్ కోసం 2023 అక్టోబర్‌లో ఎఫ్ఈఓతో పురపాలక సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రేస్ నిర్వహణకోసం రూ.100 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం హెచ్ఎండిఏ రూ.55 కోట్లను ఎస్ఈఓకు చెల్లించింది.

# జర్మనీ పార్లమెంటుకు వచ్చే ఏడాది ఎన్నికలు?



**బెర్లిన్ :** జర్మనీలో ఆకస్మికంగా ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ సోమవారంనాడు అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటున్నారు. ఆయన తన పదవి కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనివల్ల వచ్చే ఏడాది ఆరంభంలో జర్మనీలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంచనావేశారు. షుల్జ్ తనకు తానుగానే విశ్వాస ఓటును ఆశ్రయించారు. ఒకవేళ ఆయన విశ్వాసం కోల్పోతే పార్లమెంటుకు తాజాగా ఎన్నికలు జరపాలని జర్మనీ అధ్యక్షుడికి షుల్జ్ విజ్ఞప్తి చేసేఅవకాశాలున్నాయి. ఆయన పార్లమెంటు విశ్వాసం కోల్పోయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సెంటర్ లెఫ్ట్ సోషల్ డెమోక్రాట్స్ (ఎస్‌పిడి) ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న షుల్జ్ ఫిబ్రవరి 23న ఫెడరల్ ఎలక్షన్స్ జరిపిస్తానని ప్రతిపక్షాలతో ఒక ఒప్పందం చేసుకున్నారు. ఫ్రీ డెమోక్రటిక్‌పార్టీకి చెందిన నాయకుడు క్రిస్టియన్ ఓల్ఫ్ గ్యాంగ్ లిండ్నర్ 2021 నుండి 2024 నవంబరు 7వ తేదీ వరకూ జర్మనీ ఫెడరల్ కూటమి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా కొనసాగారు. కూటమి ప్రభుత్వంలో పొరపొచ్చాల కారణంగా షుల్జ్ ఆయనను ఆర్థికమంత్రి పదవి నుండి తొలగించారు. అప్పటినుండి షుల్జ్ ప్రభుత్వం మైనారిటీలో పడింది. 2025 జనవరి 15వ తేదీన తాను పార్లమెంటులో విశ్వాసపరీక్షకు సిద్ధంగా ఉన్నానని షుల్జ్ ఇంతకుముందే ప్రకటించారు. కానీ మితవాద సెంటర్–రైట్ క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ మాత్రం షుల్జ్‌పై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో సోమవారంనాడు ఆయన విశ్వాసపరీక్షకు సిద్ధపడ్డారు. కడపటి వార్తలు అందేసరికి ఆయన ప్రభుత్వం మనుగడసాగించలేని పరిస్థితుల్లో ఊగిసలాడుతున్నది. జర్మనీలో ఓలాఫ్ షుల్జ్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. జర్మనీ ప్రస్తుతం పీకలోతు ఆర్థిక సమస్యల్లో ఇరుక్కుని ఉంది. ప్రస్తుతం జర్మనీలో పోల్‌స్టర్స్ అంచనాల ప్రకారం, క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సిడియు)పార్టీ 31 శాతం ఓట్లతో ఆధిక్యంలో ఉంది. మితవాద 'ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి)పార్టీ 18 శాతం ఓట్లతో రెండోస్థానంలో ఉండగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఓలాఫ్ షుల్జ్ పార్టీ ఎస్‌పిడి 16 శాతం ఓట్లతో, గ్రీన్‌పార్టీ 12 శాతం ఓట్లతో వరుసస్థానాల్లో ఉన్నాయి.

# గెలుపే లక్ష్యం
## ట్రంప్‌కు చెప్పిన నేతన్యాహూ



45వేలకు చేరిన గాజా మృతులు

**టెల్‌అవీవ్ :** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ అమెరికా కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ఫోన్‌లో భేటీ అయ్యారు. సోమవారంనాడు ఆయన ఈ విషయం ధృవీకరించారు. ఐతే ఇరాన్‌పై తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, ఇరాన్‌పైన, ఇరాన్ తరపున తమపై పోరాడుతున్న శక్తుల పైన,వాటి స్థావరాలపైన యుద్ధం ఆపేదిలేదని పునరుద్ఘాటించారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారంనాడు ట్రంప్‌తో తాను ఫోన్ భేటీ వేసినట్లు నేతన్యాహూ ధృవీకరించారు. పశ్చిమ ఆసియాలో పూర్తి విజయం సాధించడమే తమ లక్ష్యమని ట్రంప్‌కు తాను ఉద్ఘాటించి చెప్పానన్నారు. గాజా నుండి బందీలను వెనక్కు తీసుకువచ్చే ఉపాయాల గురించి కూడా ఆయనతో మాట్లాడినట్లు నేతన్యాహూ చెప్పారు. ఇదిలా ఉండగా గడచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ ఐడిఎఫ్ గాజాలో చేసిన దాడుల్లో 52 మంది మరణించారు. దీంతో గడచిన 14 నెలలుగా గాజాలో జరుగుతున్న యుద్ధంలో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 45,000 కు చేరుకుంది. ఉత్తర బెయిట్ హనూన్‌లో జరిగిన దాడుల్లో 43 మంది మరణించారు. వీరిలో అల్ జజీరాకు చెందిన ఫోటో జర్నలిస్టు అహ్మద్ అల్ లోహ్ సహా మరో నలుగురు సహాయక సిబ్బంది మరణించారు. ఈ దాడులవల్ల గాయపడినవారి సంఖ్య 1,06,962 కు చేరుకుంది.

**సిరియాపై ఇజ్రాయెల్ దాడులు**

సిరియాపై కూడా ఇజ్రాయెల్ తన దాడులు కొనసాగిస్తున్నది. సోమవారంనాడు కూడా ఈ దాడులు కొనసాగాయి. 2012 తర్వాత అంతటిభారీస్థాయిలో దాడులు జరగడం మళ్ళీ ఇదేనని ఐడిఎఫ్ తెలియజేసింది. సిరియా అధ్యక్షుడు బషీర్ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత ఇజ్రాయెల్ తన దాడులను ఉద్ధృతం చేసింది. 1974లో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది.

## ఆర్థిక స్థితిని దిగజార్చారు : జూపల్లి
(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలను పెంచాలని చూస్తుంటే,తమ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఏ అంశంపైన కూడా బిఆర్‌ఎస్‌కు మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. రాష్ట్ర నిరుద్యోగుల యువత కోసం, ఉద్యోగాల కల్పన కోసం అందరూ సహకరించాలని ఆయన కోరారు.'మీరు చేయలేని పనిని.తాము చేస్తున్నామని, ఏమైనా కోపం ఉంటే తమను తిట్టాలని, కానీ సభను అడ్డుకోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిని గత ప్రభుత్వం దిగజార్చిందని ఆరోపించారు. బంగారు పల్లెంలో అధికారన్ని అప్పగించామని హరీశ్‌రావు చెబుతున్నారని, కానీ తమకు అప్పుల కుప్ప చిప్పను తమ చేతికి ఇచ్చారని, ఆ పరిస్థితి నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని తాము ప్రయత్నిస్తున్నామని జూపల్లి కృష్ణారావు తెలిపారు.

## వారం పాటు అసెంబ్లీ సమావేశాలు! (మొదటి పేజీ తరువాయి)

ఒవైసీ పాల్గొన్నారు. కాగా బిఎసి సమావేశం నుంచి బిఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశాయి. అసెంబ్లీ పని దినాలపై స్పష్టతను ఇవ్వలేదని, అందుకే బిఎసి సమావేశం నుంచి వాకౌట్ చేశామని అనంతరం హరీశ్ రావు చెప్పారు. బిఎసిసమావేశం అనంతరం అసెంబ్లీ లాబీల్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ బిఎసి సమావేశంలో అసెంబ్లీలో చర్చించే అంశాలపై వివిధ పార్టీల నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాల ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని, మంగళవారం సభలో ప్రకటన చేస్తారన్నారు. క్రిస్మస్ సెలవులు, రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సమావేశాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. స్పీకర్ పట్ల బిఆర్‌ఎస్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. బిఆర్‌ఎస్ నాయకులకు అనుగుణంగా స్పీకర్ ఉండాలనుకోవడం తగదన్నారు. గత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో సభలోని అన్ని పార్టీల సభ్యులు వారి అభిప్రాయాలు చెప్పారని, తుది నిర్ణయం స్పీకర్ తీసుకున్నారని, ఇప్పుడు కూడా అదే విధంగా జరుగుతుందన్నారు.

## ఉద్యోగాలు భర్తీ అయినట్లా?
(మొదటి పేజీ తరువాయి)

టి.జివన్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమాధానమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 55,172 ఉద్యోగాలు భర్తీ చేశామని ఇందులో 54,573 మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. గత పది సంవత్సరాలపాటు ఉద్యోగ నియామకాలు లేక యువకులు అల్లాడిపోయారని.. ఉద్యోగాల కోసం యువత ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అయితే బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి తాత మధుసూధన్ మాట్లాడుతూ ప్రస్తుతం భర్తీ చేసిన ఉద్యోగాలకు సంబంధించి ఎప్పుడెప్పుడు నోటిఫికేషన్లు ఇచ్చారు, ఎప్పుడు పరీక్షలు నిర్వహించారో మంత్రి సమాధానం చెప్పాలన్నారు. దీంతో డిప్యూటీ సిఎం స్పందిస్తూ కేవలం నోటిఫికేషన్లు ఇవ్వడం, పరీక్షలు నిర్వహించినంత మాత్రన ఉద్యోగాలు భర్తీ చేసినట్లు కాదని, మొత్తం ప్రక్రియను పూర్తి చేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చినప్పుడే పూర్తి అవుతుదన్న విషయం గుర్తుంచుకోవాలని చురకలు అంటించారు. తమ ప్రభుత్వం ఉద్యోగ నియామక పరీక్షలన్నీ పారదర్శకంగా, ప్రశ్నాపత్రం లీక్ వంటివి లేకుండా చూసుకుంటూ ఖాళీలను భర్తీ చేసుకుంటూ పోతున్నామని వివరించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ప్రకారం దశలవారీగా భర్తీ చేసుకుంటూ ముందుకు పోతున్నామని చెప్పారు. ఉర్దూ మీడియంలో బ్యాక్లాగ్ పోస్టుల భర్తీకి డీ రిజర్వేషన్ విధానం పరిశీలించాలని కొందరు సభ్యులు కోరాగా అందుకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

# సభా మర్యాదలు దెబ్బతీయొద్దు
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో పర్యాటక, విధానం'పై స్వల్ప కాలిక చర్చ ను ప్రారంభించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పర్యాటక శాఖ మంత్రిజూపల్లి కృష్ణారావును సూచించారు. మంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించగానే "గిరిజన రైతులకు బేడీలా?' అంటూ బిఆర్‌ఎస్ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిలబడి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని, ప్లకార్డులను ప్రదర్శించొద్దని, ఇది మంచి సంప్రదాయం కాదని, నినాదాలు చేయకుండా తమ తమ స్థానాల్లో కూర్చుంటే మాట్లాడే అవకాశం కల్పిస్తామని ఆయన పదే పదే హరీశ్‌రావును, బిఆర్‌ఎస్ సభ్యులను కోరారు. అయినా వారు నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఆ తర్వాత మరోసారి స్పీకర్ జోక్యం చేసుకుని ప్లకార్డులను మార్షల్స్‌కు ఇస్తే, మాట్లాడే అవకాశమిస్తామని స్పీకర్ సూచించినా, వారు ప్లకార్డులను ప్రదర్శిస్తూ అలాగే నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మరోసారి స్పందిస్తూ 'హరీశ్‌రావు కూర్చొవాలి.. సభ మర్యాదలను కాపాడాలి..నినాదాలు చేయవద్దని..సభకు ప్లకార్డులు తీసుకురావొద్దనే విషయం మీకు తెలుసు' .. అందరూ కలిసే సభ రూల్ బుక్'ను రూపొందించామని తెలిపారు. ఇది మంచి ప్రాక్టీస్ కాదని, సభ సాంప్రదాయాలను దెబ్బతిసేలా ఉన్నాయని, కొత్త సభ్యులకు ఏం నేర్పిస్తున్నారని స్పీకర్ ప్రశ్నించారు. అయినా బిఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. " ఇదేం రాజ్యం..ఇదేమీ రాజ్యం..రైతులకు బేడీలు సిగ్గు సిగ్గు' అంటూ నినాదాలు చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జోక్యం చేసుకున్నప్పటికీ బిఆర్‌ఎస్ సభ్యులు అలాగే నినాదాలను కొనసాగించగా, స్పీకర్ స్పందిస్తూ సభ్యుల నుంచి ప్లకార్డులను తీసుకోవాలని మార్షల్స్‌కు సూచించారు. ఈ క్రమంలో బిఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకురాగా, వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. పోడియం వద్దనే ప్లకార్డులను ప్రదర్శిస్తూ బిఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. స్పీకర్ పదే పదే విజ్ఞప్తి చేసినా బిఆర్‌ఎస్ సభ్యులు తమ తమ స్థానాల్లో వెళ్లకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

**సభా సమయం వృథా చేసే ప్రయత్నం : మంత్రి శ్రీధర్‌బాబు**

శాసనసభలో బిఆర్‌ఎస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడాన్ని మంత్రి శ్రీధర్ బాబు తప్పుపట్టారు.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్లకార్డులను ప్రదర్శించడం సభ సాంప్రదాయాలను గౌరవించ కపోవడం, స్పీకర్ ఆదేశాలను పక్కన పెట్టడం మంచిది కాదని సూచించారు. ప్రస్తావించిన ప్రతి అంశానికి తాము సమాధానం చెబుతామన్నారు. ప్రభుత్వం తరపున ప్రజల పక్షాన తమకు బాధ్యత ఉన్నదని ప్రతి అంశానికి సమాధానం చెబుతామన్నారు. సభా సమయాన్ని వృదా చేసేందుకు, అడ్డు తగిలేందుకు, సభను నడవకూడదనేది సరైన సాంప్రదాయం కాదని, ప్లకార్డులను ఉపసంహరించుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు బిఆర్‌ఎస్ సభ్యులను కోరారు.

**సభా మర్యాదలను తీస్తున్నారు...నడిరోడ్డులో నినాదాలు చేసినట్టు వ్యవహరిస్తున్నారు..: భట్టి**

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ శాసనసభ, స్పీకర్‌పైన గౌరవ, మర్యాదలు ఉండాలని సూచించారు. సభలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ సభా మర్యాదలను తీస్తున్నారని, నడిరోడ్డులో నినాదాలు ఇచ్చినట్టు సభలో వ్యవహారిస్తున్నారని మండిపడ్డారు. సభలో అలా మాట్లాడడం మంచిపద్ధతి కాదని సూచించారు. శాసనసభ రూల్స్ బుక్‌లోని పలు నిబంధనలను భట్టి చదివి వినిపించారు. నిబంధనల ప్రకారం సభలో నినాదాలు చేయవద్దని, ప్లకార్డులను ప్రదర్శించొద్దని తెలిపారు. శాసనసభ, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న వారు ఇలా వ్యవహారించడం మంచిది కాదని భట్టి సూచించారు. స్పీకర్ అనుమతి లేకుండా ప్లకార్డులను, ప్రదర్శి ంచొద్దని ఆయన సూచించారు.

# ఏ జిల్లానూ రద్దు చేయం
(మొదటి పేజీ తరువాయి)

అనునిత్యం పని చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

**బిసి వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది : మంత్రి పొన్నం ప్రభాకర్**

బిసి వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం శాసనమండలిలో ప్రతి జిల్లా కేంద్రంలో బిసి భవనాల నిర్మాణ ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా అని సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ కుల భవనాల విషయంలో గతం ప్రభుత్వం ఆర్భాటం చేసింది తప్ప నిర్మాణాలు మాత్రం చేపట్టలేదన్నారు. పేరుకు గత ప్రభుత్వం రూ.95 కోట్లు కేటాయించినా, రూ.10 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. అదేవిధంగా బలహీన వర్గాలకు గత ప్రభుత్వం బడ్జెట్ లో రూ.8 వేల కోట్లు కేటాయించి రూ.2 వేల కోట్లు మంజూరు చేసి ఖర్చు చేసింది మాత్రమే కేవలంరూ. 800 కోట్లు మాత్రమేనని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి మండలంలో నవోదయ విద్యాలయాల మాదిరిగా కొత్తగా బిసి, గురుకులాలు, కొత్త డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఏదైనా ఉందా అని సభ్యులు ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర స్పందిస్తూ రాష్ట్రంలో కొత్తగా 216 ఇంటిగ్రేటేడ్ మోడల్ స్కూల్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం బిఆర్‌ఎస్ నాయకుల భవనాలకు అద్దె కల్పించే ఉద్దేశంతో ఎక్కడ పడితే అక్కడ గురుకులా పాఠశాలలను ఏర్పాటు చేసింది తప్ప ఎక్కడా కనీసం పక్కా భవనం నిర్మించకపోవడం శోచనీయమన్నారు. తమ ప్రభుత్వం అలా కాకుండా శాశ్వత ప్రతిపాదికన పక్కా భవనాలతో మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు.

**తిరుమల తిరుపతి దేవస్థానంలో రాష్ట్ర ప్రజా–ప్రతినిధులు సిపార్సు లేఖలు చెల్లుబాటుకు చర్యలు :మంత్రి కొండా సురేఖ**

తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రత్యేక దర్శనానికి తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిపార్సు లేఖలను అనుమతించాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాసినట్లు దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసన మండలిలో సోమవారం తెలంగాణలో టిటిడి ఆధీనంలోని దేవాలయాలు, వాటి ఆస్తుల వివరాలను తెలపాలని సభ్యులు ఎవిఎన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ టిటిడికి సంబంధించి తెలంగాణలోని 9 జిల్లాల్లో 36 కళ్యాణ మండపాలు, హైదరాబాద్‌లో రెండు దేవాలయాలు, ఖమ్మంలో గెస్ట్ హౌజ్ ఉన్నాయి. అయితే వెంకటేశ్వర స్వామితో దర్శనానికి సంబంధించి తెలంగాణ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లుతుండడం ఇక్కడి నుంచే అధిక మొత్తం ఆదాయం కూడ సమకూరుతున్ననేపథ్యంలో దర్శనానికి సంబంధించి రాష్ట్ర ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇప్పటికే ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేయడం జరిగిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇందుకు సంబంధించి మరోసారి ఎపి ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సభ్యులకు హామి ఇచ్చారు. అదేవిధంగా ఎపిలో ప్రభుత్వంలో బిజెపి భాగస్వామ్యం ఉన్న నేపథ్యంలో అక్కడి బిజెపి నేతల ఒత్తిడి తీసుకురావాలని బిజెపి ఎంఎల్‌సి ఎవిఎన్ రెడ్డికి మంత్రి సూచించారు. రాష్ట్రంలో టైగర్ రిజర్వుల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటాని సభ్యులు టి. జీవన్‌రెడ్డి, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కొండా సురేఖ సమాధానమిస్తూ కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టును ఇప్పటికే కన్వరేటివ్ రిజర్వు ఫారెస్టుగా డిక్లేర్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం చలికాలం అయినందున ఫారెస్టు ఏరియాలో ఉండే అక్కడ వన్య ప్రాణులు సంచరించడం పెరగడంతో అక్కడ ఉండే ప్రాంతాల్లో గిరిజన, చెంచు ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని,మరోవైపు వన్య ప్రాణాలకు కూడా ఇబ్బందులు జరగకుండా ఫారెస్టు ఏరియాలో ఉన్న కొన్ని గ్రామాలను తరలించడం జరిగిందన్నారు.

**మాజీ ఎంఎల్‌సి ఎస్.ఇంద్రసేన్‌రెడ్డికి శాసన–మండలి సంతాపం :** మాజీ ఎంఎల్‌సి ఎస్.ఇంద్రసేన్‌రెడ్డికి శాసనమండలి నివాళు అర్పించింది. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఇంద్రసేన్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సభ్యులు ఇంద్రసేన్ రెడ్డి మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు.

## వాయిదా తీర్మానం (మొదటి పేజీ తరువాయి)

నిర్మాణాలపై నెలకొన్న అనుమానాలు భయాందోళనలపై చర్చించడానికి ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని కూనంనేని సాంబశివ రావు ఇచ్చారు. ఈ తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీరస్కరించారు. అలాగే వికారాబాద్ జిల్లా లగచర్ల రైతుల అంశంపై చర్చించేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, విజేయుడు, మర్రి రాజశేఖర్ రెడ్డిలు వాయిదా తీర్మానం ఇచ్చారు. కాగా బిఆర్‌ఎస్ లగచర్ల ఘటనపై చర్చించేందుకు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

## ఇంటర్ పరీక్షలు (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ ఫస్టియర్ విద్యార్థులకు జనవరి 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1న జరుగుతుంది.

పరీక్ష షెడ్యూల్...

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల షెడ్యూల్ :

| | |
|---|---|
| 2025, మార్చి 5 | పార్ట్ 2 సెకండ్ లాంగ్వేజ్ |
| మార్చి 7 | పార్ట్ 1 ఇంగ్లిష్ పేపర్ 1 |
| మార్చి 11 | పార్ట్ 3 , మ్యాథ్స్ పేపర్ 1, బోటనీ పేపర్ 1, పొలిటికల్ సైన్స్ 1 |
| మార్చి 13 | మ్యాథ్స్ పేపర్ 1బి, జువలాజీ పేపర్ 1, హిస్టరీ పేపర్ 1 |
| మార్చి 17 | ఫిజిక్స్ పేపర్ 1, ఎకనామిక్స్ పేపర్ 1 |
| మార్చి 19 | కెమిస్ట్రీ పేపర్ 1, కామర్స్ పేపర్ 1 |
| మార్చి 21 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ 1,బ్రిడ్జీ కోర్స్ మ్యాథ్స్ పేపర్ 1( బైపిసి విద్యార్థులకు ) |
| మార్చి 24 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 1, జియోగ్రఫీ పేపర్ 1 |

..........

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల షెడ్యూల్ :

| | |
|---|---|
| 2025, మార్చి 6 | పార్ట్ 2, సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 2 |
| మార్చి 10 | పార్ట్ 1 ఇంగ్లిష్ పేపర్ 2 |
| మార్చి 12 | పార్ట్ 3 , మ్యాథ్స్ పేపర్ 2ఎ, బోటనీ పేపర్ 2, పొలిటికల్ సైన్స్2 |
| మార్చి 15 | మ్యాథ్స్ పేపర్ 2బి, జువలాజీ పేపర్ 2, హిస్టరీ పేపర్ 2 |
| మార్చి 18 | ఫిజిక్స్ పేపర్ 2, ఎకనామిక్స్ పేపర్ 2 |
| మార్చి 20 | కెమిస్ట్రీ పేపర్ 2, కామర్స్ పేపర్ 2 |
| మార్చి 22 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ 2, బ్రిడ్జీ కోర్స్ మ్యాథ్స్ పేపర్ 2( బైపిసి విద్యార్థులకు ) |
| మార్చి 25 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 2, జియోగ్రఫీ పేపర్ 2 |

# సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు ..

# బిఆర్ఎస్ ఇచ్చిన వారసత్వ అప్పులు

మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు, అప్పులను బిఆర్ఎస్ ప్రభుత్వం తమకు వారసత్వంగా ఇచ్చిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆ రోజే ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఒక సంతకం పెడితే రూ.600 కోట్లు వచ్చేవి కదా? అని మంత్రి ప్రశ్నించారు. సర్పంచుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సానుభూతితో ఉన్నదని, సకాలంలో పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. బిఆర్ఎస్ అంటేనే బకాయిల రాష్ట్ర సమితి తరహా తమకు అప్పులు, పెండింగ్ బిల్లులను అప్పగించిందని మంత్రి ఎద్దేవా చేశారు. గత బిఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కోవాలక్ష్మి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, బిజెపి సభ్యుడు కాటేపల్లి వెంకటరమణారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి ధనసరి అనుసూయ సీతక్క సమాధానమిచ్చారు. హరీశ్‌రావు గత ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసినప్పుడే ఒక సంకతం పెట్టి ఉంటే అన్ని పెండింగ్ బిల్లులు క్లియర్ అయ్యేవని అన్నారు. 'మన ఊరు మన బడి' కార్యక్రమం కింద గత ప్రభుత్వం రూ.1100కోట్ల పనులు పూర్తిచేస్తే, ఇందులో రూ.800 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పెండింగ్ బిల్లులు, అప్పుల వారసత్వంగా వచ్చిన నేపథ్యంలో ఒక్కొక్కటిగా సర్దుబాటు చేస్తున్నామని, బిల్లులను చెల్లించేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు. ఏడాది కాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల కోసం రూ.740కోట్లను ఇచ్చిందని, ఉపాధి హామీ కింద గతంలో జరిగిన పనులకు రూ.450 కోట్లను మంజూరు చేసిందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కొన్ని నిధులు గ్రామాలకు మంజూరు చేయలేకపోయామన్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయలేదని, దీని ప్రభావం కూడా ఉన్నదన్నారు. సర్పంచ్‌లకు 2014 సంవత్సరం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. 2025 నవంబర్ 1 వరకు రూ.691.93 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని మంత్రి సీతక్క సభకు వివరించారు.

**నాలుగేళ్లలో 17వేల కిలో మీటర్ల రోడ్ల నిర్మాణం**

రానున్న నాలుగేళ్లలో రూ.12వేల కోట్లతో 17వేల కిలో మీటర్ల వరకు రోడ్లను నిర్మించాలని నిర్ణయించామని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క చెప్పారు. ప్రస్తుత ఏడాది సిఆర్ఆర్ కింద రూ.2311కోట్లను మంజూరు చేశామని, 2400 కిలోమీటర్ల నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ఏటూరునాగారం, కవ్వాల్, అచ్చంపేట టైగర్ జోన్ లాంటి ఆదివాసి గూడాలకు ప్రత్యేక అధికారిని నియమించి, రోడ్లు వేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామని హామీనిచ్చారు. శాసనసభలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు చిక్కుడు వంశీకృష్ణ, మల్‌రెడ్డి రంగారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానమిచ్చారు. 12వేల కిలోమీటర్లకు కొత్త రోడ్లకు ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి బిటి రోడ్లను కూడా వేస్తామని, గత నెలలో సిసి రోడ్ల కోసం రూ.324 కోట్లను మంజూరు చేశామని, గత మార్చి నెలలో రూ.600 కోట్లను ఇచ్చామని తెలిపారు. ఎంఆర్ కింద రూ.1150 కోట్లను త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం తమ పదేళ్ల కాలంలో రోడ్ల నిమిత్తం కేవలం రూ.2200 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని గుర్తు చేశారు. మానవ వికాసానికి రహదారులే జీవన రేఖలని మంత్రి అన్నారు. రాష్ట్రంలో 12,941 గ్రామ పంచాయతీలలో 334 గ్రామ పంచాయతీలకు రోడ్డు అనుసంధానం చేయలేదన్నారు. తొలుత సభ్యులు చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాలకు రోడ్లు లేక అస్తవ్యస్తంగా మారిందని, బడ్జెట్‌ను కూడా కేటాయించలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల ప్రకారం 422 గ్రామాలకు రోడ్లు లేవని, 3177 అవాసాలకు బిటి రోడ్లు లేవన్నారు. సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతి నిధులను, సర్పంచ్‌ల హక్కులను గత ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. సర్పంచ్‌లను నామమాత్రం చేశారని, గ్రామ పంచాయతీలను అధోగతి పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు దిష్టిబొమ్మల్లాగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ అధికారాలను తిరిగి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

**బడా కాంట్రాక్టర్లకే బిల్లులు ఇస్తారా? హరీశ్ రావు**

తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ బడా కాంట్రాక్ట్‌లకు బిల్లులు వస్తున్నాయని, చిన్న కాంట్రాక్టులకు బిల్లులు ఇవ్వడంలేదన్నారు. ఏడాది నుంచి సర్పంచ్‌లు, ఎంపిటిసిలను గోస పుచ్చుకుంటున్నారని, ధర్నా చేసే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద నిధులు ఇవ్వలేదని, ఇజిఎస్ నిధులు కేంద్ర నిధులు దారి మళ్లించారని ఆరోపించారు. నవంబర్‌లో బడా కాంట్రాక్టర్లలకు రూ.12వేల కోట్ల బిల్లులను ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పోతే చికెన్‌గున్యా వస్తుందని అమెరికా హెచ్చరించిందని హరీశ్‌రావు అన్నారు. కోవాలక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌లకు గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

కాటేపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మూడేళ్లుగా సర్పంచ్‌లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మన బడి మన ఊరు కార్యక్రమాలు చేపట్టి, వైకుంఠదామాలను నిర్మించారని, కానీ వాటికి ఇప్పటివరకు బిల్లులు ఇవ్వలేదన్నారు. సర్పంచ్‌లకు డబ్బులు ఇవ్వడం లేదని, మహిళా సర్పంచ్ మెడలో కనీసం పుస్తెల తాడు, కాళ్లకు మెట్టెలు కూడా లేని దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంతో సంబంధం లేదకుండా సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**అప్పుడు అప్పుల కుప్ప చేసి .. ఇప్పుడు అడుగుతున్నారా? నాయిని రాజేందర్ రెడ్డి**

నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్ బిల్లులన్నీ కుప్పలు చేసి, ఇప్పుడు ఏమైందని బిఆర్ఎస్ సభ్యులు ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు. వారు అబద్దాలకు అలవాటు పడ్డారని, అధికారం పోయి సంవత్సరం కాకముందే బట్టలు చించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బకాయిలను ఎందుకు చెల్లించలేదని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు వెయ్యి కోట్లకు తక్కువ లేకుండా సంపాదించుకున్నారని ఆరోపించారు. స్థలాలను కబ్జా చేసి బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులన్నీ నిర్మించుకున్నప్పటికీ వారిపైన చర్యలు తీసుకోరా? అని రాజేందర్ ప్రశ్నించారు.

## రూ. 270 కోట్లను చెల్లిస్తే బకాయిలు ఎలా ఉంటాయ్?

మంత్రి శ్రీధర్‌బాబు సూటి ప్రశ్న

బిఆర్ఎస్ వాకౌట్



బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు చెప్పినట్టు ప్రతి నెలా బిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 270 కోట్లను చెల్లిస్తే సర్పంచ్‌లకు, ఇతర బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రశ్నించారు. ఫిబ్రవరి మాసంలో సర్పంచ్‌ల పదవికాలం పూర్తయిందని, బకాయిలను చెల్లించాలని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై మంత్రి సీతక్క బాధ్యతారహితంగా సమాధానం చెప్పారని నిరసిస్తూ బిఆర్ఎస్ వాకౌట్ చేసింది. అంతకుముందు బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మాట్లాడుతూ పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కింద గత ప్రభుత్వం ప్రతి నెలా రూ.270 కోట్లను మంజూరు చేసిందన్నారు. మొత్తంగా రూ. 3300 కోట్లు గ్రామ పంచాయతీలకు ఇచ్చామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ పాలిట భస్మాసూర హస్తంగా మారిందని హరీశ్‌రావు ఆరోపించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిల బకాయిలు ఒకటి తర్వాత మరొకటి పూర్తి చేస్తున్నామన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో క్లారిఫికేషన్ ఉండబోదని, అయినా సభను పక్కదారి పట్టించి, రాజకీయ ఉద్దేశంతో తమ పరపతిని పెంచుకునేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.




## అసెంబ్లీ మీడియా పాయింట్

## లగచర్ల రైతులకు అండగా ఉంటాం

ప్రజాపక్షం/హైదరాబాద్ : కొడంగల్ నియోజక వర్గం లగచర్ల గ్రామ రైతులకు అండగా ఉండి అసెంబ్లీలో పోరాటం చేస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎంఎల్ఎలను కట్టడి చేయడం ద్వారా వైఫల్యాలు బయటకు రాకుండా చూసుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని కెటిఆర్ విమర్శించారు. లగచర్లలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే తాము చూస్తూ ఊరుకోమని అన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేంత వరకు రైతుల సమస్యలపై పోరాడుతూనే ఉంటామన్నారు. ఏ జిల్లాల్లోనైనా రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కుంటే తాము వారి పక్షాన నిలబడతామన్నారు. జైలులో ఉన్న లగచర్ల రైతుకు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం దారుణ చర్య అని అన్నారు. ఎన్నికల సమయంలో రైతు కూలీలకు ఇస్తామని చెప్పిన రూ.12వేల గురించి తాము అసెంబ్లీలో ప్రశ్నించామని, దీంతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బయటకు వచ్చి ప్రకటన చేశారన్నారు.

**ప్రభుత్వం భయపడుతుంది : జగదీశ్‌రెడ్డి**

ప్రజా సమస్యలను చర్చించేందుకు ప్రభుత్వం భయపడుతుందని బిఆర్ఎస్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. స్పీకర్ మొత్తం సిఎంకు అనుకూలంగా పనిచేస్తున్నారన్నారు. తమ పార్టీ సీనియర్ సభ్యులకు మైకు ఇవ్వడం లేదని విమర్శించారు. కేవలం అధికార పార్టీకే అవకాశం ఇస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంగా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడం తమ బాధ్యత అని తెలిపారు.

**గీత వృత్తిని నిర్వీర్యం చేసే కుట్ర : వివేకానంద గౌడ్**

గీత కార్మికుల ఇళ్లపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నారని, గీత వృత్తిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని, గీత వృత్తిని కాపాడుకుంటామని బిఆర్ఎస్ ఎంఎల్ఎ వివేకానందగౌడ్ ఆరోపించారు. ఎక్కడ చూసినా డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుతున్నాయన్నారు. మద్యాన్ని ప్రోత్సహించి..రేట్లు పెంచే ఆలోచన చేస్తున్నారన్నారు. ఆయా కేసుల్లో బిఆర్ఎస్ పార్టీ వాళ్ళను ఇరికించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రతి పట్టణంలో బెల్ట్ షాపుల బెడద పెరిగిపోయిందన్నారు.

**విద్యాశాఖపై చర్చ పెట్టాలి : సబితా ఇంద్రారెడ్డి**

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. విద్యాశాఖపై చర్చ పెట్టాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్ద సబితారెడ్డి మాట్లాడుతూ.. గత సంవత్సరం నుంచి గురుకులాలు, హాస్టళ్లలో ఏం జరుగుతుందో చూస్తున్నామన్నారు. గతంలో 'మన ఊరు..మన బడి' ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో ఎన్నో మార్పులు చేశామన్నారు. ఈ సంవత్సరంలో 1900 స్కూళ్లు జీరో ఎన్‌రోల్‌మెంట్ అయినట్లు చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 6వేల స్కూళ్ళు మూత పడుతున్నాయన్నారు.

**యూ ట్యూబ్‌ల ద్వారా విషప్రచారం : ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి**

బిఆర్ఎస్ నేతలు తాము అధికారంలో చేసిన మంచి పనులు చెప్పుకోడానికి ఏమీ లేకపోవడంతో మార్ఫింగ్ చేసి..యూ ట్యూబ్‌ల ద్వారా ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంఎల్ఏ నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ చేసిన పాపాలను సరిద్దికుంటూ వస్తున్నామన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రకటనలు చేస్తున్న బిఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అంసెంబ్లీని వేదికగా మార్చుకున్నారన్నారు. గతంలో బిఆర్ఎస్ చేసిన అప్పులు చుస్తే వారి పనీతీరు తెలుస్తుందన్నారు.

**రైతులకు రూ.500 బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం**
**కాంగ్రెస్ ఎంఎల్ఏ నాగరాజు**

కాంగ్రెస్ మెనిఫెస్టోలో పేర్కొన్నట్లు రైతులకు రూ.500లు బోనస్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని కాంగ్రెస్ ఎంఎల్ఏ నాగరాజు అన్నారు. అధికారుల తప్పిదాల వల్లే ప్రభుత్వాలకు చెడ్డపేరు వస్తుందన్నారు. ప్రభుత్వం రైతులకు అన్యాయం జరిగే విధంగా ప్రభుత్వం ఎప్పుడు వ్యవహరించదని స్పష్టం చేశారు. అల్లు అర్జున్ విషయంలో ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. బాధిత కుటుంబం దగ్గరికి ఒక్క హీరో పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. ఆ తల్లి చనిపోవడం దురదృష్టకరం అన్నారు.

## అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

ప్రజాపక్షం/హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాలో భాగంగా సభ ప్రారంభమైన మొదలైన తర్వాత సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల అంశం సభలో చర్చకు వచ్చింది. ఈ అంశంపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది. అయితే మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలకు పెండింగ్ బిల్లులు చెలించడంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రానందుకు నిరసనగా అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ ఎంఎల్ఎలు వాకౌట్ చేశారు.

## ఇన్నర్ లాబీలోకి 'నో ఎంట్రీ' అంటూ బోర్డులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : శాసనసభలో సోమవారం నుంచి పలు ఆంక్షలు విధించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ ఇన్నర్ లాబీలోకి మాజీ ప్రజాప్రతినిధుల ప్రవేశంపై నిషేధం విధించారు. మాజీ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలకు ఇన్నర్ లాబీలోకి నో ఎంట్రీ అంటూ బోర్డులు వెలిశాయి. అలాగే మీడియాపై కూడా పలు ఆంక్షలు విధించారు.

## లగచర్ల ఘటనపై దద్దరిల్లిన శాసనమండలి సభ మంగళవారానికి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్ : లగచర్ల ఘటనపై సోమవారం శాసనమండలి దద్దరిల్లింది. లగచర్ల రైతులకు బేడీల అంశంపై బిఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానం ఇవ్వగా శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తిరస్కరించారు. అయితే భోజన విరామం తర్వాత తిరిగి సభ ప్రారంభకాగా, షెడ్యూల్ ప్రకారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ రాష్ట్ర టూరిజం పాలసీపై స్వల్పకాలిక చర్చకు ఉపక్రమించారు. అయితే బిఆర్ఎస్ సభ్యులు మాత్రం ముందుగా లగచర్ల ఘటనపై చర్చించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సభ్యులు మాత్రం లగచర్ల ఘటనపై చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టడంతో చైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. బిఆర్ఎస్ సభ్యులు ఛైర్మన్ కార్యాలయం ముందు కొద్ది సేపు బిఆర్ఎస్ ఎంఎల్‌సిలు ధర్నాచేశారు.

**సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చాం: కెటిఆర్**

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్థిక విషయాల్లో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని,ఆర్థిక విషయంలో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. శాసనసభను తప్పుదోవ పట్టిస్తున్నారని, తాము సభ హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చామని తెలిపారు. అసెంబ్లీ లాబీ వద్ద ఆయన సోమవారం జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

## ఉపాధ్యాయుల డిఎల బకాయిలను తక్షణమే చెల్లించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : శాసనమండలిలో సోమవారం పలువురు సభ్యులు వివిధ సమస్యలకు సంబంధించి ప్రత్యేక ప్రస్తావనలు చేశారు. ఇందులో భాగంగా శాసనమండలి ఛైర్మన్ ద్వారా పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఎ.నర్సిరెడ్డి ఉపాధ్యాయులకు సంబంధించి డిఎల బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరాగా, సర్వశిక్షాభియాన్‌లో కంట్రాక్టర్ల విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వక్ఫ్‌భూములను పరిరక్షించాలని మిర్జా రహమత్ బేగ్, అర్టిజన్లకు లైన్‌మెన్లుగా పదోన్నతులను కల్పించాలని చింతపండు నవీన్, అశావర్కర్లు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని నవీన్‌కుమార్ కురమయ్య, మాజీ సర్పంచుల బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని తాత మధుసూదన్, విదేశాల్లో చదువుకుంటున్న బ్రహ్మణ విద్యార్థులకు విదేశీ విద్య రుణం కింద స్కాలర్‌షిప్‌లను చెల్లించాలని ఎస్.వాణిదేవిలు ప్రత్యేక ప్రస్తావనల ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన అంశాలను నోట్ చేసుకున్నామని వీటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## పలువురు మాజీ ఎమ్మెల్యేల మృతికి అసెంబ్లీ సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈనెల 9న వాయిదా పడిన శాసనసభ, శాసనమండలి సమావేశాలు సోమవారం తిరిగి ప్రారంభమయ్యాయి. శాసన సభ ప్రారంభంకాగానే ప్రశ్నోత్తరాలు జరిగాయి. అనంతరం ఇటీవల మృతి చెందిన మాజీ ఎంఎల్ఎలు కొమిరెడ్డి జ్యోతి, ఊకే అబ్బయ్య, రామచంద్రా రెడ్డిలకు సభ సంతాపం తెలిపింది. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. శాసనసభలో క్రీడా విశ్వవిద్యాలయ బిల్లు, విశ్వ విద్యాలయాల సవరణ బిల్లులను రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. అనంతరం సభలో పర్యాటక విధానంపై చేపట్టిన స్వల్పకాలిక చర్చలో బిఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సభలో ప్లకార్డులను ప్రదర్శించవద్దని, నినాదాలు చేయవద్దని, మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పదే పదే చెప్పినా బిఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం బిఆర్ఎస్ సభ్యులు శాసనసభ ప్రవేశ ద్వారం వద్ద కొద్ది సేపు బైఠాయించారు. కాగా అంతకుముందు సర్పంచ్‌లకు చెందిన బకాయిల బిల్లులలపై జరిగన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి బాధ్యతారహితంగా సమాధానం చెప్పారని నిరసిస్తూ బిఆర్ఎస్ సభ నుంచి వాకౌట్ చేసింది.

## 18న టిపిసిసి ఆధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్'

ప్రజాపక్షం / హైదరాబాద్: అమెరికాలో గౌతమ్ ఆదానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలు దేశ వ్యాపార, ఆర్థిక రంగాలలో పరువును దెబ్బతీసాయని నిరసన వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. మణిపూర్‌లో వరసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై ప్రధాని మోదీ ఇప్పటివరకు అక్కడకు వెల్లకపోవడంలాంటి అంశాలపై ఎఐసిసి ఇచ్చిన పిలుపు మేరకు చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిపిసిసి ప్రకటించింది. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద భారీ జన సమీకరణతో రాజ్‌భవన్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌ఏసిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొంటారని టిపిసిసి తెలియజేసింది. ఆదానిపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మానిపులేషన్ లాంటి అంశాలలో ఆదానిపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయని టిపిసిసి ఒక ప్రకటనలో తెలియజేసింది.

## కాలుష్య వ్యర్థాలు రాకుండా చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యవసాయ భూముల్లో కాలుష్య వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. వ్యవసాయ భూముల్లో కాలుష్య వ్యర్థాలపై మరోసారి నివేదికను తెప్పిస్తామన్నారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు అనిరుధ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీధర్ బాబు సమాధానమిస్తూ అరబిందో కంపెనీ వ్యర్థాల విషయంలో మరోసారి వ్యవసాయ శాఖ నుంచి నివేదికను తెప్పిస్తామని, పిసిబి నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు వ్యర్థాలను వెదజల్లినా, ఇతర ఇబ్బందులు కలిగిన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమల నుంచి వ్యర్థాల విసర్జన జరగడంలేదని పిసిబి తన 2023 నివేదికలో వివరించినట్లు మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. అంతకుముందు అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ 2017లో వ్యవసాయ శాఖ ఎస్ఇజెడ్ ప్రాంతంలో వ్యవసాయం చేయలేమని నివేదిక ఇచ్చిందని, అరబిందో కంపెనీ నుంచి కాలుష్య నీటిని విడిచారని తెలిపారు. కాలుష్యం వెదజల్లుతుందని చెప్పినప్పటికీ కాలుష్య నియంత్రణ బోర్డ్ చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఈ విషయంపై తాము అక్టోబర్ 7న ఫిర్యాదు చేస్తే, అకోబర్ 26న నోటీసులు ఇచ్చారని, ఈ నెల 11న రైతులను పిలిచి పిసిబి అధికారులు మాట్లాడారని, మూడు గంటల పాటు రైతులను కూర్చొబెట్టి, చివరకు సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించిన విషయాన్ని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు.

## యూనిట్లు ఏర్పాటుచేయని వారి నుంచి స్థలాలు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పరిశ్రమలకు ఇచ్చిన ఉద్దేశం ప్రకారం యూనిట్‌లను ఏర్పాటుచేయని వారి నుంచి స్థలాలు స్వధీనం చేసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ పరిశ్రమలకు భూములు కేటాయించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. సుమారు 35 ప్రదేశాలలో స్థలాలలో 13,741 ఎకరాల భూమిని గుర్తించిందని, ఇందులో 2,338 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా, 7,638 ఎకరాలు అస్సైన్డ్ భూమి, 3765 ఎకరాల పట్టా భూమిని సేకరించామన్నారు. ప్రదేశాలలో రెవెన్యూ అధికారుల నుండి భూమిని భౌతికంగా స్వాధీనం చేసుకున్న తరువాత, లేఔట్‌ను తయారు చేసి, అవసరమైన అనుమతులన్నింటిని పొందిన తరువాత పారిశ్రామిక పార్కు ఏర్పాటు నిమిత్తం అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూములు ఇచ్చిన అవసరాలకు వినియోగిస్తున్నారో లేదో అనే విషయంపై కమిటీ ఏర్పాటు చేశామని, ప్రతి కంపెనీని పరిశీలిస్తామన్నారు. యూనిట్లు స్థాపించని వారి నుండి భూమి స్వాధీనం చేసుకుంటామన్నారు. అంతకు ముందు వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ టిజిఐఐసి కేటాయించిన భూములపై కొంత మంది రుణాలు తీసుకుని, యూనిట్లు ఏర్పాటు చేయడంలేదన్నారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని, అధికారులు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

# జిహెచ్ఎంసి కైవసమే కాంగ్రెస్ కార్యకర్తల టార్గెట్

టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవడమే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ముందున్న టార్గెట్ అని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమీక్ష సమావేశానికి తరలిరావడం శుభ పరిణామం అని అన్నారు. కార్యకర్తల కృషి వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో కార్యకర్తల పాత్ర కీలకంగా ఉండాలని కోరారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో భూ బాకసురులు రెచ్చిపోయారని, వందల చెరువులు కబ్జాకు గురయ్యాయన్నారు. కేసిఆర్ హయంలో జరిగిన సకలజనుల సర్వే రిపోర్టు ఏమైంది? అని ప్రశ్నించారు. ఎఐసిసి ఇంచార్జ్ దీపాదాస్ మున్షి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ ఎంతో బలంగా ఉండేది.. ఇప్పుడు పార్టీకి మళ్ళీ పూర్వ వైభవం తేవాలన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తేనే గ్రేటర్ హైదరాబాద్ లో మనం బలంగా అవుతామన్నారు.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న మన పార్టీ గ్రేటర్ లో కూడా పట్టు సాధించాలన్నారు. నాయకులు మీద మీద పని చేస్తే ఫలితాలు రావు.. గట్టిగా పని చేయాలి..డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతి మీటింగ్ లో యువత, మహిళలు భాగస్వాములు అయ్యేలా చూడాలని సూచించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..క్షేత్ర స్థాయి లో పని చేసిన నాయకులకే పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో బలమైన నాయకులకే టికెట్స్ ఇస్తాం అని ప్రకటించారు.గ్రేటర్ ఎన్నికలు చాలా.ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.డివిజన్ లలో ప్రజల మధ్య ఉండి వారితో మేమకమైన నాయకులకు టికిట్స్ లభిస్తాయని స్పష్టం చేశారు.

హైదరాబాద్ లో కుల సంఘాల కార్యకర్తలతో సన్నిహితంగా ఉండాలని సూచించారు.హైదరాబాద్ లో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలంటే సరైన నాయకులను సిపరసు చేయాలన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇచార్జ్ విష్ణు నాథ్ , మాజీ టిపిసిసి అధ్యక్షులు వి.హనుమంతు రావు, మేయర్ విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్,మాజీ ఎంపీ అజారుద్దీన్, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, తదితరులు

## 12 మంది అడిషనల్ ఎస్‌పిలకు ఎస్‌పిలుగా పదోన్నతి

ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న 12 మంది అదనపు ఎస్‌పి(నాన్‌క్యాడర్)లకు ఎస్‌పిలుగా పదోన్నతి కల్పిస్తూ సోమవారం రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు కల్పిస్తూ వారికి పోస్టింగ్‌లను కూడా ఖరారు చేశారు.పదోన్నతి పొందిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.

| పేరు | ఎఎస్‌పిగా ప్రస్తుత స్థానం | పదోన్నతి (ఎస్‌పి) పోస్టింగ్ |
|---|---|---|
| కె.గుణశేఖర్ | జోగులాంబ గద్వాల జిల్లా | మేడ్చల్ ట్రాఫిక్ డిసిపి |
| జి.నర్సింహ్మారెడ్డి | సైబరాబాద్ క్రైమ్స్ | రాచకొండ ఎస్‌బి డిసిపి |
| ఎస్.మల్లారెడ్డి | సిద్దిపేట జిల్లా | రాచకొండ ట్రాఫిక్ డిసిపి |
| మద్దిపాటి శ్రీనివాసరావు | హైదరాబాద్ సిటిసి | సిఐడి |
| పి.శోభన్‌కుమార్ | సైబరాబాద్ ఎస్‌ఒటి–2 | సైబరాబాద్ ఎస్‌ఒటి డిసిపి |
| టి.సాయిమనోహర్ | మాదాపూర్ ట్రాఫిక్ | మాదాపూర్ ట్రాఫిక్ డిసిపి |
| డి.రమేష్ | ఇంటెలిజెన్స్ | ఇంటెలిజెన్స్ |
| జె.చెన్నయ్య | మహబూబ్‌నగర్ జిల్లా క్రైమ్స్ | హైదరాబాద్ ఐసిసిసి |
| పి.విజయ్‌కుమార్ | రాజేంద్రనగర్ (సైబరాబాద్) | సిఐడి |
| పి.కరుణాకర్ | రాచకొండ ఎస్‌బి డిసిపి | డిజిపి కార్యాలయం |
| కె.మనోహర్ | రాచకొండ ట్రాఫిక్ | రాచకొండ ట్రాఫిక్ డిసిపి |
| డి.శ్రీనివాస్ | మాదాపూర్ ఎస్‌ఒటి | మేడ్చల్ ఎస్‌ఒటి డిసిపి |

## మధ్యప్రదేశ్ టూ.. హైదరాబాద్

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్

ప్రజాపక్షం/హైదరాబాద్: మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు నాన్‌డ్యూటీ పెయిట్ లిక్కర్‌ను తరలిస్తున్న ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు రంగంలోకి దిగి ఆరుగురు సభ్యులతో కూడిన ఒక ముఠాను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.రెండున్నర లక్షల విలువ చేసే 154 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, ఒక బైకు ఆరు సెల్‌ఫోన్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. చెంగిచెర్ల ప్రాంతంలో ఎన్‌డిపిఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వచ్చిందని సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సూపర్డెంట్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో తన బృందాలు తనిఖీలు నిర్వహించాయి. మధ్యప్రదేశ్ నుంచి అక్రమంగా దిగుమతి చేసుకున్నటువంటి మద్యాన్ని హైదరాబాదులో ఎక్కువ ధరలకు ఈ ముఠా అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నాయని విచారణలో తేలింది. అరెస్ట్ అయిన వారిలో తరుణ్ వర్మ,రవీందర్ గౌడ్, విన్నీ, కే సురేందర్ రెడ్డి ,క్రాంతి ,నాగరాజులు ఉన్నారు. ఎన్ డి పి ఎల్ మద్యంను పట్టుకున్నటువంటి ఎస్టిఎఫ్ టీం బృందాన్ని ఎక్సైజ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చేవూరి హరికిరణ్, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలా సన్ రెడ్డి అభినందించారు.

## ఆధ్యాత్మిక పర్యాటకం, ఎకో-టూరిజం, వెల్‌నెస్ టూరిజానికి అధిక ప్రాధాన్యత

మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆధ్యాత్మిక పర్యాటకం, ఎకోటూరిజం, వెల్‌నెస్ టూరిజానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ, తెలంగాణ పర్యాటక విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు బాలూ నాయక్, చిక్కుడు వంశీ కృష్ణ, జాటోత్ రామ్‌చందర్ నాయక్, జైవీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ కొత్త పాలసీ పూర్తయ్యే దశలో ఉందని తెలిపారు. హైదరాబాద్ దగ్గరలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్న కొత్త జూలాజికల్ పార్కు ప్రతిపాదన దశలో ఉనందని, ఏర్పాటు చేసే ప్రదేశం ఇంకా ఖరారు కాలేదన్నారు. అంతకు ముందుకు బాలు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రాంతాలు పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. దేవచర్లలో 365 రోజులు శివునిపై నీరు పడుతుందని, సలేశ్వరం క్షేత్రం, గిరిదుర్గం అద్భుతంగా ఉంటాయన్నారు. వీటిని అభివృద్ధి చేయాలన్నారు. జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, ఫైవ్ స్టార్ హోటల్, కన్వేన్షన్ సెంటర్, మినీ జూపార్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. రాంచందర్ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పర్యాటక ప్రాంతాలు నిరాదరణకు గురయ్యాయన్నారు. గత సిఎం కాళ్లు మొక్కించుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ఓరుగల్లును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు.

ఫోకస్

# యువతరంగం

## రిచర్డ్ బ్రాన్సన్



ఓటములే పాఠాలుగా ఎదగాలన్న హితోక్తిని అక్షరాలా పాటించాడు రిచర్డ్ బ్రాన్సన్. కోట్లకు పడగలెత్తిన 'వర్జిన్ గ్రూప్' సంస్థలకు అధినేతగా అందరికీ సుపరచితుడైన బ్రాన్సర్ ఎన్నో కష్టాలు.. నష్టాలు.. అవహేళనలను ఎదుర్కొన్నాడు. ఎన్ని సమస్యలు ఎదురైనా తమ ప్రయత్నాలను మాత్రం వీడలేదు. అందుకే, ఈ బ్రిటిష్ వ్యాపారవేత్త వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నెలకొల్పగలిగాడు. 1950, జులై 18న జన్మించిన బ్రాన్సన్ కేవలం 16 ఏళ్ల వయసులో, తన స్వగ్రామంలోనే 'స్టూడెంట్' అనే సంగీత పత్రికను ప్రారంభించాడు. కానీ, అది అనుకున్న విధంగా విజయవంతంకాలేదు. 17 సంవత్సరాల వయసులో 'క్రిస్మస్ ట్రీ' వ్యాపారాన్ని చేపట్టి, అందులోనూ విఫలమయ్యాడు. 18 ఏళ్ల వయసులో పెంపుడు పక్షుల విక్రేతగా మారాడు. కానీ, అందులోనూ రాణించలేకపోయాడు. 19 ఏళ్ల వయసులో, పాఠశాల గది నుంచే 'మెయిల్ ఆర్డర్ రికార్డ్' వ్యాపారానిన మొదలు పెట్టాడు. ఈ ప్రయత్నం కొంత వరకూ ఫలించింది. అతని పాటల ఆల్బమ్స్ ద్వారా రాయల్టీ వచ్చింది. కానీ, ఈ విజయంతో బ్రాన్సన్ తృప్తిపడలేదు. 20 సంవత్సరాల వయసులో అతను తన అభిమాన సంగీత దర్శకుడు, గాయకుడు మైక్ ఓల్డ్‌ఫీల్డ్‌కు సాయం చేయాలని నిర్ణయించాడు. కానీ, బ్రాన్సన్ చేసిన ప్రతిపాదనలపై పెట్టుబడిదారులు ఎవరూ ఆసక్తి ప్రదర్శించలేదు. సుమారు ఏడాది పాటు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో, తన 21వ ఏట, తానే స్వయంగా రికార్డు థియేటర్‌ను ప్రారంభించాడు. మైక్ ఓల్డ్‌ఫీల్డ్ స్వరపరచిన పాటలను, ఆయన మ్యూజిక్‌ను సొంత లేబుల్‌తో మార్కెట్‌లోకి తీసుకొచ్చాడు. గతంలో ఎవరూ వినని సరికొత్త సంగీతం అనే అభిప్రాయం ధ్వనించేలా తన కంపెనీకి 'వర్జిన్' అని నామకరణం చేశాడు. ఆ తర్వాత వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. 33 ఏళ్ల యవసు ఉన్నప్పుడు బ్రాన్సర్ వెళ్లాల్సిన విమానం ఒకటి రద్దయింది. ఎంతో మంది ప్రయాణికులు అక్కడే నిలిచిపోయారు. ఏమి చేయాలో కూడా వారికి అర్థం కాలేదు. ఆ క్షణమే, బ్రాన్సన్ తన గమ్యానికి వెళ్లేందుకు ఓ ప్రైవేటు విమానాన్ని బుక్ చేసుకున్నాడు. అందులోని సీట్లు అమ్ముతున్నట్టు ప్రకటించాడు. నిమిషాల్లోనే విమానం టికెట్లు అమ్ముడయ్యాయి. బ్రాన్సన్‌కు లాభాన్ని సంపాదించిపెట్టాయి. అతని ఆలోచన, వ్యాపార దక్షతను అంచనా వేయడానికి ఇదో ఉదాహరణ మాత్రమే. మరుసటి సంవత్సరమే అతను సొంతంగా ఒక విమానాన్ని కొన్నాడు. 'వర్జిన్ ఎయిర్' పేరుతో విమానయాన సేవలను మొదలుపెట్టాడు. 50 ఏళ్ల వయసుకే, క్వీన్ ఎలిజబెత్ II నుంచి అత్యంత ప్రతిష్టాత్మకమైన 'నైట్' బిరుదును అందుకున్నాడు. 54 ఏళ్ల వయసులో అతను తన సొంత 'వర్జిన్ గెలాక్టిక్ స్పేస్‌షిప్'లో అంతరిక్షయానం చేశాడు. ఇప్పుడు అతని వయసు 74 సంవత్సరాలు. అయినప్పటికీ వ్యాపార లావాదేవీలన్నీ తానే స్వయంగా చూసుకుంటాడు. విశ్రాంతి తీసుకోవాలనుకున్నప్పుడు, తాను సొంతంగా కొనుక్కున్న ప్రైవేటు ద్వీపానికి వెళ్లిపోతాడు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా జీవితంలో ఏ విధంగా ముందడుగు వేయాలో బ్రాన్సన్ జీవితం మనకు వివరిస్తుంది. ప్రతి చిన్న పరాజయానికి కుంగిపోయుతున్న నేటి యువత బ్రాన్సన్‌ను ఆదర్శంగా తీసుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..




# సివిల్స్... అంత ఈజీ కాదు..

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, (సిఎస్ఇ) అనేది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్), ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్), ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) సహా భారత ప్రభుత్వం పలు భారతీయ సివిల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)చే భారతదేశంలో నిర్వహించబడే దేశవ్యాప్త పోటీ పరీక్ష. ఈ పరీక్షను భారతదేశంలో అత్యంత క్లిష్ట పరీక్షగా పరిగణిస్తారు.ఈ పరీక్షకు 9,00,000 కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటారు. అర్హులు రేటు 0.1–0.3 శాతం, ప్రపంచంలో అతి తక్కువ విజయవంత రేటు కలిగిన పరీక్షలలో ఇది ఒకటి. ఈ పరీక్షను రెండు దశల్లో నిర్వహిస్తారు ఒకటి ప్రాథమిక పరీక్ష, రెండు ఆబ్జెక్టివ్ రకం పేపర్లను (సాధారణ అధ్యయనాలు, ఆప్టిట్యూడ్ టెస్ట్) కలిగి ఉంటుంది. మెయిన్ పరీక్ష వ్యక్తిత్వ పరీక్ష (ఇంటర్వ్యూ) ననుసరించి సంప్రదాయ (వ్యాసం) రకం తొమ్మిది పేపర్లను కలిగి ఉంటుంది. ఈ పరీక్ష తుది ఫలితాలు వెల్లడించేందుకు ప్రాథమిక పరీక్ష నోటిఫికేషన్ నుండి మొత్తం ప్రక్రియ పూర్తవడానికి సుమారు ఒక సంవత్సరం పడుతుంది. యుపిఎస్‌సి నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షే అత్యున్నతమైనది. ఈ పరీక్ష ద్వారా జిల్లా పరిపాలనాధికారిగానే కాక.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిసహా రాష్ట్రానికి ప్రధాన అధికారిగా సేవలు అందించే అవకాశం ఉంటుంది. అందుకే ప్రజా సేవ చేయాలనుకునే వారందరూ ఐఎఎస్ అవ్వాలని భావిస్తుంటారు. అందుకు సన్నద్ధం అవుతుంటారు. అయితే, యుపిఎస్‌సి పరీక్ష రాస్తే ఐఎఎస్ ఆఫీసర్లు అయిపోవచ్చు అని చాలామంది భావిస్తుంటారు. కానీ, యుపిఎస్‌సి పరీక్ష ఒక్క ఐఎఎస్ కోసమే కాదు.. చాలా విభాగాలకు సంబంధించి అధికారుల నియామకానికి సంబంధించినది కూడా. అంటే.. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ వంటి పోస్టులకు కూడా యుపిఎస్‌సినే పరీక్ష నిర్వహిస్తోంది. అయితే, యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తరువాత వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ పోస్టులను కేటాయిస్తారు. కాగా, ఈ పరీక్షలో పాస్ అయిన వారంతా ఐఎఎస్ లు అవుతారని జనాలు అభిప్రాయపడుతున్నారు. కానీ, అది వాస్తవం కాదు. సివిల్ సర్వీస్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా పోస్టింగ్స్‌ను కేటాయిస్తారు. అందులో ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ వంటి పోస్టులు ఉంటాయి.

### ఐఎఎస్ అంటే ఏంటి?

భారత ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగానికి సంబంధించింది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో టాప్ ర్యాంక్ పొందిన అభ్యర్థులను ఐఎఎస్‌గా ఎంపిక చేస్తారు. ఇది అడ్మినిస్ట్రేటివ్ సేవలకు సంబంధించింది. ఐఎఎస్ అధికారులు కేబినెట్ సెక్రటరీలు, సెక్రటరీలు కూడా నియామకం అవుతారు. ఇవి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలలో వీరిని నియమిస్తారు. జిల్లాల కలెక్టర్లుగా, ఆయా శాఖల కార్యదర్శులుగా, ప్రధాన కార్యదర్శులుగా నియామకం అవుతారు.

### ఐపిఎస్ అంటే ఏంటి?

ఇండియన్ పోలీస్ సర్వీస్. ఈ ఉద్యోగానికి ఎంపికైన వారు రాష్ట్ర, భారత కేంద్ర సాయుధ పోలీసు దళాల్లో విధులు నిర్వర్తిస్తారు. ఐపిఎస్ అధికారుల కేడర్ను నియంత్రించడానికి హోం మంత్రిత్వ శాఖకు అధికారం ఉంటుంది. ఐపిఎస్ అధికారి ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రమాదాలు, నేరాలను నివారించడం, ట్రాఫిక్ నియంత్రణ తదితర వ్యవహారాలను చూస్తారు. ఒక ఐపిఎస్ అధికారి కేంద్ర ప్రభుత్వంలో సిబిఐ, ఐబి, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (ఆర్ఎడబ్ల్యు/ రా) డైరెకర్‌గా కూడా నియమితులవుతారు.

### ఐఎఫ్ఎస్ అంటే ఏంటి?

ఇండియన్ ఫారెన్ సర్వీసెస్. ఈ అధికారులు విదేశీ వ్యవహారాలకు సంబంధించి విధులు నిర్వహిస్తారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో సేవలు అందిస్తారు. యుపిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులైన వీరికి.. మూడేళ్లపాటు శిక్షణ ఉంటుంది. వీరిని దౌత్యాధికారులుగా నియమిస్తారు. విదేశాలతో జరిగే దౌత్యపరమైన విషయాలలో వీరు కీలక పాత్ర పోషిస్తారు.

### ఐఆర్ఎస్ అంటే ఏంటి?

ఐఆర్ఎస్.. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ తరువాత సివిల్ సర్వీసెస్. ఈ పోస్టులో అధికారిగా.. ప్రత్యక్ష పన్ను (ఆదాయం, కార్పొరేట్, సంపద) మరియు పరోక్ష పన్ను (సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అండ్ కస్టమ్స్ డ్యూటీ) పన్నులు, పరిపాలన, పాలసీ మేకింగ్ పూర్తి అవగాహన ఉండాలి. ఇది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ ఫైనాన్స్ మినిస్ట్రీ కింద పనిచేస్తుంది.

### పోస్ట్ ఎంపిక ఎలా ఉంటుంది..

యుపిఎస్‌సి సివిల్స్ ఫలితాల తర్వాత ఒక అప్లికేషన్ ఫామ్ నింపాల్సి ఉంటుంది. ఇందులో మీకు సంబంధించిన సమాచారం, జాబ్ ఆప్షన్స్ వంటివి ఇవ్వాలి. దీని ఆధారంగా ఇంటర్వ్యూ చేస్తారు అధికారులు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా ర్యాంక్ కేటాయిస్తారు. దాని ప్రకారం ఉద్యోగానికి ఎంపిక చేస్తారు.



# దిగజారుతున్న ప్రతిభ!

మన దేశంలో ప్రతిభ దిగజారుతున్నదా? సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక సమర్థులంతా ఇతర దేశాలకు వలస వెళ్లడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందా?... ఈ రెండు ప్రశ్నలకు అవును అనే సమాధానం చెప్పక తప్పదు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఐఎండి) 'ప్రపంచ ర్యాంకింగ్స్ 2024'లో భారత్ 58వ స్థానానికి పడిపోవడమే ఇందుకు ఉదాహరణ. గత ఏడాది 52వ స్థానంలో ఉన్న భారత్, ఈసారి మరింత పతనాన్ని చవిచూసింది. స్విట్జర్లాండ్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నది. ఆర్థిక వ్యవస్థల ప్రాతిపదికన ఎంపిక చేసిన మొత్తం 67 దేశాల సూచీలో భారత్ 40.47 పాయింట్ల స్కోరుకే పరిమితమైంది. ఇదేదో ఆషామాషీ సంస్థ ప్రకటించిన సూచీ అనుకుంటే పొరపాటే. దేశం వెలిగిపోతున్నదని, అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నదని వాదించేవారు ఐఎండిని తేలికగా తీసుకునే అవకాశం లేకపోలేదు. అయితే, ఇది తేలిగ్గా తీసివేయాల్సిన విషయం కాదు. ఎందుకంటే, ఐఎండికి 75 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. స్థిరమైన, సమగ్రమైన విశ్లేషణలకు ఈ సంస్థ ప్రసిద్ధి చెందింది. ఈ సంస్థ ఇచ్చే ర్యాంకింగ్స్‌ను ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలు ఆమోదిస్తాయి. తదనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకొని, భవిష్యత్ కార్యక్రమాలను చేపడతాయి. కాగా, మన దేశం క్రమంగా వెనుకబడడానికి దోహదపడుతున్న అంశాలు చాలానే ఉన్నాయి. అయితే, కేంద్ర ప్రభుత్వ విధానాలను ముందుగా ప్రస్తావించుకోవాలి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీతో పదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారు చేసింది ఏమీ లేదన్నది వాస్తవం. ప్రైవేటుకు పట్టంకట్టడంతో, ఉద్యోగావకావాలు పలుచబడ్డాయి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించాలనే లక్ష్యంతో పనిచేసే ప్రైవేటు కంపెనీలు లేదా కార్యాలయాలు శ్రమ దోపిడీకి పాల్పడడం సర్వసాధారణం. ఈ పరిస్థితుల్లో ఉద్యోగాల వేటలో విదేశాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతున్నది. పెట్టుబడుల నుంచి ప్రభుత్వ విధానాల వరకూ ప్రతి ఒక్క అంశం మేధో సంపత్తిపై ప్రభావం చూపుతుంది. జీవన నాణ్యత, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, విద్యావిధానం, శిక్షం, చట్టబద్ధమైన కనీస వేతనం తదితర కారణాలతోనూ మన దేశం టాలెంట్ ఇండెక్స్‌లో వెనుకబడింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను గమనించి, తగిన చర్యలు తీసుకోకపోతే, మేధోపతనం మరింత వేగంగా కొనసాగడం ఖాయం.



# వీరుల త్యాగాల చరిత్ర సిపిఐది

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 వసంతాల ఉత్సవాలు విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పార్టీ శ్రేణులను కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భువనగిరి నియోజకవర్గ సమితి సమావేశం గోడల నాగభూషణం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదా శ్రీరాములు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరంలోకి అడుగుపెడుతున్నదని తెలిపారు. దేశంలో 100 సంవత్సరాల ఉద్యమ పార్టీగా సిపిఐ ఖ్యాతి పొందిందని, స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో అనేకమంది ప్రాణ త్యాగాలు చేసిన వీర చరిత్ర గలది భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలియజేశారు. దేశ స్వాతంత్ర్యం కొరకు ఫ్యూడల్ సంస్థానాల విముక్తి కొరకు తాడిత పీడత జనావళి కొరకు వేలాది మంది ప్రాణాలను కోల్పోయిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. మహోజ్వల చరిత్ర కలిగిన భారత్‌ను కాపాడుకోవడంలో అహర్నిశలు కృషి చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ మద్దతు ఇవ్వవలసిందిగా కోరారు. సిపిఐ 100 వసంతాల ఉత్సవాలు ప్రారంభ సందర్భంగా నల్లగొండ పట్టణంలో జరిగే బహిరంగ సభకు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్, బోడ సుదర్శన్, మండల కార్యదర్శిలు మరిపెల్లి రాములు, పోలేపాక యాదయ్య, గోడల నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపక్షాన అలుపెరగని పోరాటాలు

మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

భారత కమ్యూనిస్టుపార్టీలో చేరికలు



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని పికె మల్లేపల్లి గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు సమక్షంలో సోమావారం సిపిఐలో చేరారు. సిపిఐలో చేరిన గనిపల్లి విజయ్, అయితపాక కిరణ్, మింటు, పోలె ప్రవీణ్, పోలె శివ కుటుంబాలకు యాదగిరిరావు సిపిఐ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం యాదగిరిరావు మాట్లాడుతూ సిపిఐ అవతరించిన వందేళ్ళ కాలంలో జరిపిన వీరోచిత పోరాట ఘట్టాలను, సాధించిన విజయాలను మరోసారి స్మరించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకోవాల్సిన అవసరం, బాధ్యత ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నా సమసమాజ నిర్మాణం కోసమే పని చేస్తుందన్నారు. ప్రభుత్వాలపై అలుపెరగని పోరాటాలతో ప్రజలపక్షం వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, మల్లోజు శేఖరాచారి, అయితపాల సైదులు, గనిపల్లి జితెందర్, మిడిదొడ్డి రామకృష్ణ, యాదయ్య, చెన్నయ్య, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం

రైతు భరోసా తక్షణం అమలు చేయాలి

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్

జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం ధర్నాలు







**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతు రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని రెండు లక్షల లోపు రుణాలున్న రైతుల్లో ఎక్కువ మందికి మాఫీ జరగలేదని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది రైతులుంటే అందులో 50శాతం మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని; రెండు లక్షల లోపు ఉన్న రైతుల్లో కూడా వివిధ కారణాలతో మాఫీని నిలుపుదల చేశారని ఆయన తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఖమ్మంజిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఖమ్మం రూరల్, అర్బన్ మండల కేంద్రాల వద్ద జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న హేమంతరావు మాట్లాడుతూ పాసుపుస్తకాలు లేవని, కుటుంబ సభ్యుల సంఖ్య సరిపోలేదని రుణమాఫీని నిలుపుదల చేశారని, మరణించిన రైతులకు సంబంధించి రుణమాఫీ జరగలేదన్నారు. నాల్గవ దఫా మూడువేల కోట్ల రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా రైతుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం ఊరిస్తుందని, అమలుకు వాయిదాలు పెడుతుందని ఆరోపించారు. ఏడాది కాలంగా రైతు భరోసా లేదని నవంబర్, డిసెంబర్ అంటూ వాయిదాలు వేసి ఇప్పుడు సంక్రాంతి అంటున్నారని రైతు భరోసాను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతు బీమా అమలు చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తుందని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారని ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న రైతాంగ పోరాటంపై బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీ చార్జీలు చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నూతన సాగు చట్టాలను దొడ్డిదారిన అమలు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని, రైతాంగ ఉద్యమాలకు సంబంధించి నమోదైన కేసులన్నింటిని తక్షణమే ఎత్తివేయాలని, అమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతులను తక్షణం ఉపసంహరింపజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 28 నుండి అమలు చేయనున్న ఆర్థిక చేయూత పథకాన్ని భూమి లేని ప్రతి పేదవానికి అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ పేదలందరికీ ఈపథకాన్ని వర్తింపజేయాలన్నారు. ఖమ్మం రూరల్, అర్బన్ తహసీల్దార్లకు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఖమ్మం రూరల్ మండల కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళనలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం నాయకులు మిడికంటి చిన్నవెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, పాసంగుల చందర్‌రావు, బానోత్ రాంకోటి, మిడికంటి పెద్ద వెంకటరెడ్డి, మామిడి సుదర్శన్, వెన్నం భాస్కర్, శ్రీనాథరెడ్డి, వెంపటి రాము పాల్గొనగా అర్బన్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎస్‌కె సైదా, పోటు పూర్ణచందర్‌రావు,జ్వాలా నర్సింహారావు, ప్రతానపు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** అర్హులైన రైతులకు రుణమాఫీ అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రైతు సంఘం పిలుపు మేరకు రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, పగడాల మల్లేష్, శాఖమూరి శ్రీనివాసరావు, రైతు సంఘం మండలాధ్యక్షులు బాగం ప్రసాద్, చీనా, జామ్లా, లక్ష్మా, మంగ్యా, సురభి శ్రీను, నాగా, రామలింగం పాల్గొన్నారు.

# అర్హులందరికీ పట్టాలు, పక్కా గృహాలు

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** అర్హులైన పేద ప్రజలందరికీ పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. సిపిఐ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భాంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ పైడిపల్లి శివారు ఎస్సారెస్పీ భూములలో సర్వేనెంబర్ 791, 782, 786, 355, 357, 298 గల భూములలో గత మూడు సంవత్సరాల క్రితం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భూపోరాటం చేసి ఇండ్లు లేని నిరుపేదలందరినీ సేకరించి గుడిసెలు వేయించామని, అందులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ వెనకబడిన కులాలు నివాసం ఉంటున్నారని, గతంలో కలెక్టర్‌కు, ఎమ్మార్వోకు ఇండ్ల పట్టాలు ఇచ్చి పక్క గృహాలు కట్టించాలని వినతిపత్రాల ద్వారా నివాసం వుంటున్న వారి జాబిత ఇవ్వడం జరిగిందన్నారు. ఇటీవల పోలీసులు సమాచానం లేకుండా అర్థరాత్రి సమయంలో డోజర్లతో గుడిసెలను కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే స్థలాలలో అర్హులైన పేద ప్రజలందరికీ పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని, ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఎస్కె బాష్మియా, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి యాదగిరి, వరంగల్ మండల కార్యదర్శి బుస రవీందర్, శాఖ కార్యదర్శి జన్ను రవి, నాయకులు గన్నారం రమేష్ , మస్కా సుధీర్ ,మల్లన్న, జన్ను శంకర్, హరిబాబు, పైడి కుమార్, రవిరాకుల ప్రసంగి, ప్రవీణ్, ఎ.కె పాషా, కందిరవి, మొగిలితో పెద్ద ఎత్తున గుడిసెవాసులు పాల్గొన్నారు.



# భారీపరిశ్రమలతో యువతకు ఉపాధి



సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్

**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ మహానగరంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యవతకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం మునగాల ఐలయ్య అధ్యక్షతన సిపిఐ కాజీపేట మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత పెద్ద నగరంగా వరంగల్ వేగంగా విస్తరిస్తున్నదని, ఈ ప్రాంత ప్రజలకు పరిశ్రమలు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం భారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ నుండి వరంగల్ మహానగరం వరకు పారిశ్రామిక కారిడార్‌ని ఏర్పాటు చేస్తామని చెప్పి నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైల్వే, రోడ్డు రవాణా సౌకర్యాలు ఉండటంతో పాటు మరో పక్క మామునూరు ఎయిర్‌పోర్ట్ ఉందని, భారీ పరిశ్రమలకు ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉన్నందున ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని బిక్షపతి కోరారు. కేంద్రంలో కొనసాగుతున్న ఎన్‌డిఏ ప్రభుత్వం నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటే విధంగా ఉన్నా అదుపు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని, బ్లాక్ మార్కెటు సృష్టిస్తున్న బడా వ్యాపారులనుపై చర్య తీసుకోవాలని నిత్యావసరాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలఅన్నారు. జమిలి ఎన్నికల విధానంతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునగాల బిక్షపతి, సహాయ కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, నాయకులు బొట్టు బిక్షపతి, మంద సుమన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సెబీ చైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోవడంలో నిర్మలా సీతారామన్ విఫలం

• స్కాంలో భాగమైన బచ్ .. 'అదానీ'పై ఎలా దర్యాప్తు చేస్తారు • స్టాక్ మార్కెట్‌పై 11 మంది ఆధారపడ్డారు
• అందులో మధ్యతరగతి ప్రజలే ఎక్కువ • వారిని రక్షించాల్సిన బాధ్యత సెబీదే
• అదానీ వ్యవహారమంతటిపై జెపిసి దర్యాప్తు • లోక్‌సభలో కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ :** సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్ మీద పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విఫలమయ్యారని కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ విమర్శించింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీసడమే కాకుండా ఆర్థిక పాలన వ్యవస్థను కూడా ప్రమాదంలో పడేసినట్లయిందని పేర్కొంది. స్టాక్ అవకతవకల్లో అదానీ గ్రూప్ పేరు ఉందని, ఆ కుంభకోణంలో బచ్ భాగమైనప్పుడు ఆమె ఎలా దర్యాప్తు చేయగలరని ప్రశ్నించారు. మొత్తం వ్యవహారంపై జెపిసి విచారణ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లోక్‌సభలో సోమవారం నాడు అనుబంధ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అదానీ అంశాన్ని కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ లేవనెత్తారు. దేశంలో, 11 కోట్ల మంది ప్రజలు స్టాక్ మార్కెట్లపై ఆధారపడి ఉన్నారని, వారిలో ఎక్కువ మంది మధ్యతరగతి వర్గాలకు చెందినవారని ఆయన అన్నారు. భారతీయ మధ్య తరగతి ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును రక్షించే బాధ్యత సెబీకి ఉందని ఆయన అన్నారు. సెబీలో ఏదైనా లోపం లేదా తప్పు జరిగితే అది ప్రభుత్వంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందన్నారు. నిష్కళంకమైన సమగ్రత, నైతిక ప్రమాణాలు కలిగిన వ్యక్తులను ఇలాంటి కీలకమైన నియంత్రణ సంస్థలకు నియమించేలా చూసుకో



వడం ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రత్యక్ష బాధ్యత అని వేణుగోపాల్ అన్నారు. సెబీ చైర్‌పర్సన్‌పై అనేక తీవ్రమైన ఆరోపణలు వెలువడ్డాయని, అవి నైతిక , నియంత్రణ ప్రమాణాలను తీవ్ర ఉల్లంఘనలకు సంబంధించినవని ఆయన అన్నారు. ఇంతటి కీలక అంశంపై మాట్లాడుతున్న సమయం లో కేంద్ర ఆర్థిక మంత్రి సభలో లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు.

**ఇది అదానీ ప్రభుత్వం**

ఇది 'అదానీ ద్వారా, అదానీ కోసం , అదానీ యొక్క ప్రభుత్వం' అని కె.సి.వేణుగోపాల్ ఆరోపించారు. 2017–2024 మధ్య బచ్ సెబీ అధికారిగా పనిచేస్తూ ఐసిఐసిఐ బ్యాంకు నుండి రూ.16.4 కోట్లకు పైగా అందుకున్నారని వేణుగోపాల్ అన్నారు.'ఇది ఆమె సెబీ నుండి వచ్చిన జీతం కంటే ఐదు రెట్లు ఎక్కువ, ఇది స్పష్టమైన విరుద్ధమైన ప్రయోజనాలను రుజువు చేస్తుందని' ఆయన అన్నారు. సెబీ దర్యాప్తులో ఉన్న సంస్థకు సంబంధిత సంస్థల నుండి ఆమె అద్దె ఆదాయాన్ని పొందిందని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న వేణుగోపాల్ ఆరోపించారు. ప్రచురించని కీలకమైన సమాచారాన్ని కలిగి ఉండే సెబీ చైర్‌పర్సన్ రూ. 36.9 కోట్ల విలువైన సెక్యూరిటీలలో వ్యాపారం చేశారని, ఇది సెబీ నీతి నియమావళిని ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని విమర్శించారు. 2017–21 మధ్య సింగపూర్, అమెరికాలో ఆస్తులను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఆమె విఫలమయ్యారని వేణుగోపాల్ అన్నారు. ఈ ఆరోపణలు ఉన్నప్పటికీ ఆర్థిక మంత్రి స్వతంత్ర విచారణను ప్రారంభించడం లేదా ఎటువంటి క్రమశిక్షణా చర్య తీసుకోవడం లేదని తెలిపారు. సెబీ చైర్‌పర్సన్ సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడాన్ని ఆర్థిక మంత్రి గమనించడం, గుర్తించడం లేదా, ఇందుకు బాధ్యత తీసుకోవడం లేదా? అని వేణుగోపాల్ నిలదీశారు. ఇలాంటి పరిస్థితులలో సెబీ చైర్‌పర్సన్‌ను కొనసాగించడం ద్వారా కార్పొరేట్ గవర్నెన్స్, నియంత్రణ, పారదర్శకత పట్ల భారత దేశ నిబద్ధతకు తప్పుడు సంకేతాన్ని పంపుతుందని మంత్రిత్వ శాఖ విశ్వసిస్తుందా? అని ఆయన అన్నారు. ప్రభుత్వం ఎందుకు ఎలాంటి చర్య తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

# ఆర్థిక మంత్రితో వివాదంతోనే ఆర్‌బిఐని వీడిన శక్తికాంత్ దాస్

ఆర్థిక సంక్షోభ పరిష్కారానికి మన్మోహన్ సింగ్ కావాలి
అనుబంధ పద్దులపై చర్చలో టిఎంసి ఎంపి సౌగత రాయ్

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో 5.4 శాతం తక్కువ ఆర్థిక వృద్ధి రేటును నమోదు కావటాన్ని ప్రతిపక్ష సభ్యులు సోమవారం నాడు ఎత్తి చూపారు. వృద్ధిని పెంచేందుకు, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు, ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని కేంద్ర ఆర్థిక మంత్రిని డిమాండ్ చేశారు. లోక్‌సభలో అనుబంధ పద్దులపై జరిగిన చర్చలో పాల్గొన్న టిఎంసి సభ్యులు సౌగత రాయ్ మాట్లాడుతూ వృద్ధిని పెంచాలా లేదా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలా అనే చిన్న కదలికలో ప్రభుత్వం చిక్కుకుందని, ఆర్థిక వ్యవస్థ సరైన స్థితిలో లేదని అన్నారు.'ఆర్థిక వ్యవస్థలో ఒక సాధారణ సంక్షోభం నెలకొందని, సంక్షోభం అంటే రెండవ త్రైమాసికం కోసం మన వృద్ధి అంచనా 5.4 శాతానికి పడిపోయిందని, ఇది ఆర్థిక వ్యవస్థకు చాలా హానికరమని, తయారీ రంగంలో తీవ్ర మందగమనంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీ రేటును తగ్గించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన డిమాండ్‌ను ఆర్‌బిఐ గవర్నర్ శక్తి కాంత దాస్ పట్టించుకోలేదని, దానికి బదులుగా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారని, చివరకు ఆయన రిజర్వ్ బ్యాంక్ నుంచి వెళ్ళిపోవాల్సి వచ్చిందని ఆయన ఆరోపించారు. 'ఆర్థిక మంత్రి , ఆర్‌బిఐ గవర్నర్ మధ్య వివాదం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును స్థిరంగా ఉంచాలని కోరుకుంది. అయితే ఆర్థిక మంత్రి దానిని తగ్గించాలని, తద్వారా ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ డబ్బు సమకూరుతుందనిఒత్తిడి చేసారు. చివరికి, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ వెళ్లిపోవాల్సి వచ్చింది' అని రే అన్నారు. గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్ల ద్వారా



గ్రాండ్ కోసం మొదటి బ్యాచ్ ద్వారా ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 44,143 కోట్ల అదనపు నికర వ్యయం కోసం లోక్‌సభ అనుమతి కోరింది. ప్రధానంగా వ్యవసాయం, ఎరువులు, రక్షణ మంత్రిత్వ శాఖల ఖర్చు పెరగడంతో అనుబంధ పద్దులను ప్రతిపాదించింది. ఈ అనుబంధ డిమాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 4.9 శాతం లక్ష్యం నుండి ద్రవ్యలోటును పెంచుతుందని,దానిని ఎదుర్కోవడానికి ఏకైక మార్గం మౌలిక సదుపాయాలపై ఖర్చును తగ్గించడమే అని రే అన్నారు. 'అధిక వృద్ధిని కొనసాగించడానికి మీకు మరిన్ని ప్రైవేట్ పెట్టుబడులు అవసరం. మరిన్ని ప్రైవేట్ పెట్టుబడులు ఉండాలంటే, మీరు మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఖర్చు చేయాలి. మీరు మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఖర్చు చేస్తే, ద్రవ్యోల్బణం పెరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం రెండువైపుల దెబ్బలో చిక్కుకుంది' అని రే అన్నారు.భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం కలిగిన వారిని ఎన్‌డిఎ ప్రభుత్వంలో తాను చూడలేదని రే అన్నారు. 'ఈ సమస్యను పరిష్కరించడానికి మన్మోహన్ సింగ్ అవసరం... ఈ ప్రభుత్వం విధానాలు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతోంది. 'ఆమె (సీతారామన్) విదేశీ డిగ్రీ లేకపోవడం గురించి నేను ఇంతకుముందు వ్యాఖ్యానించాను. నేను ఆ వ్యాఖ్యను ఉపసంహరించుకుంటున్నాను. కానీ ఆర్థిక మంత్రి భారతీయ విశ్వవిద్యాలయం నుండి కూడా ఆర్థిక శాస్త్రంలో పిహెచ్‌డి చేసి ఉంటే బాగుండేది. అలాగైతే భారత ఆర్థిక వ్యవస్థ చిక్కుకున్న సమస్యను వృద్ధి లేదా ద్రవ్యోల్బణ నియంత్రణను ఆమె పరిష్కరించగలిగేవారు'అని ఆయన అన్నారు. ఎన్‌సిపి(ఎస్‌పి) సభ్యురాలు సుప్రియా సులే చర్చలో పాల్గొంటూ ముఖ్యంగా ఉద్యోగ సృష్టి, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న దేశీయ వినియోగం, రెండవ త్రైమాసికంలో ఆందోళన కలిగిస్తున్న 5.4 శాతం జిడిపి వృద్ధిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో ఆర్థిక మంత్రి తెలియజేయాలని కోరారు. ఇటీవలి నెలల్లో తగ్గుతున్న ఎగుమతులను పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ మూలధన వ్యయం ఆధారంగా ఆర్థిక వ్యవస్థ నడుస్తోందని మనీష్ తివారీ (కాంగ్రెస్) అన్నారు.యూపీఏ పాలనతో పోలిస్తే మోదీ పాలనలో అన్ని ఆర్థిక పారామితులు క్షీణించాయని డేటాను ఉటంకిస్తూ ఆయన అన్నారు.

# మైనారిటీలపై అకృత్యాలను బంగ్లాదేశ్‌తో చర్చించాలి

**వారికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలబడాలి : ప్రియాంకాగాంధీ**

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న అకృతాలను ప్రభుత్వం పొరుగు దేశం వద్ద లేవనెత్తాలని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ సోమవారం లోక్‌సభలో అన్నారు. జీరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ దాడుల కారణంగా బాధలో ఉన్నవారికి ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. 'బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులు, క్రైస్తవులపై జరుగుతున్న అఘాయిత్యాల సమస్యను ప్రభుత్వం లేవనెత్తాలి. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలబడాలి' అని ఆమె అన్నారు.

**పాక్ లొంగుబాటు ఫోటోను తొలగించడమేంటి?**

భారత్ ముందు పాకిస్థాన్ లొంగిపోతున్న ఫొటోను ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో ఎలా తొలగిస్తారని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. సోమవారం విజయ్ దివస్ జరుపుతున్న వేళ ఫొటో తొలగించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. 1971లో భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో సైనికులు, అమరవీరుల పాత్రను వయనాడ్ ఎంపీ గుర్తు చేసుకున్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న విజయ్ దివస్ జరుపుకుంటారు. ఈ యుద్ధం బంగ్లాదేశ్ విముక్తికి కూడా దారితీసింది.

**పరిహారం పెంచుతారా, లేదా?**

మానవ–జంతు సంఘర్షణ కేసుల్లో పరిహారం అంశంపై వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం లోక్‌సభలో ధ్వజమెత్తారు. ప్రశ్నోత్తరాల సమయంలో సప్లిమెంటరీని ప్రశ్నే వేసిన ఆమె మానవ–జంతు సంఘర్షణకు సంబంధించిన కేసులలో సాధారణ ప్రజలుష రైతులకు పరిహారం పెంచుతారా లేదా అని ప్రశ్నించారు. ఆదివారం తన నియోజకవర్గంలో ఓ వ్యక్తి ఏనుగు దాడికి గురయ్యాడని ఆమె పేర్కొన్నారు. అయితే పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ స్పందిస్తూ ఇది సప్లిమెంటరీ ప్రశ్నకు సంబంధించిన కాదు అని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే కేరళ, కర్ణాటక, తమిళ నాడు సరిహద్దుల్లో ఉన్న వయనాడ్‌లో పరిపాలన, అటవీ శాఖ కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ఈ విషయంలో ప్రభుత్వం చేసిన పనుల కాపీని వయనాడ్ ఎంపికి షేర్ చేస్తామని చెప్పారు.

# 'పాలస్తీనా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు ప్రియాంక




**న్యూఢిల్లీ :** పాలస్తీనా ప్రజలకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం నాడు 'పాలస్తీనా' పేరు ముద్రించిన బ్యాగును వేసుకొని సోమవారం పార్లమెంటుకు వెళ్ళారు. గాజాలో ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా,పాలస్తీనీయులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. పాలస్తీనా అనే పేరు ,పాలస్తీనా చిహ్నాలు, పుచ్చకాయతో సహా చెక్కబడిన హ్యాండ్‌బ్యాగ్‌ను ప్రియాంక వేసుకున్నారు. ఈ హ్యాండ్‌బ్యాగ్‌ను ధరించి ఆమె ఏమి సందేశం పంపాలని భావిస్తున్నారని బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దురాగతాలపై ప్రియంక ఒక్క మాట కూడా మాట్లాడలేదని,కానీ పాలస్తీనా బ్యాగుతో ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకుంటున్నారని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలు హిం దువులు, క్రైస్తవులపై జరుగుతున్న దారుణాల గురించి బిజెపి ప్రభుత్వం ఏదైనా చేయాలని, బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి ఈ దారుణాలను ఆపాలని ప్రియాంక ప్రతిస్పందించారు. న్యూఢిల్లీలోని పాలస్తీనా రాయబార కార్యాలయం ఛార్జ్ డి'అఫైర్స్ (బాధ్యులు) అబెద్ ఎల్రాజెగ్ అబు జాజర్ గత వారం కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుండి ఇటీవల ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ప్రియాంకగాంధీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.జూన్‌లో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును , ఆయన ప్రభుత్వాన్ని ఆటవికమని ఆరోపిస్తూ, గాజాలో ఇజ్రాయెల్ ప్రభుత్వం సామూహిక హననం చేస్తుందని ప్రియాంక అన్నారు.

## అమర జవాన్లకు పలువురు నివాళి



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా తదితరులు యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నేతలు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు. డిసెంబరు 16వ తేదీ దేశ చరిత్రలో మర్చిపోలేని రోజు. 1971 యుద్ధంలో భారత్ – పాకిస్థాన్‌పై విజయం సాధించింది. సరిగ్గా 53 ఏళ్ల క్రితం పాకిస్థాన్ నడ్డివిరిచి పాక్ నుంచి బంగ్లాదేశ్ కు విముక్తి కల్పించడంలో భారత సైన్యం కీలక పాత్ర పోషించింది. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో మొదలైన స్వాతంత్ర్య పోరు భారత్–పాక్ మధ్య యుద్ధానికి దారి తీసింది. భారత సైన్యం పాక్‌ను ఓడించి, బంగ్లాదేశ్ అవతరణకు కారణమైంది. ఆ విజయానికి గుర్తుగా భారత్ ఏటా డిసెంబర్ 16న 'విజయ్ దివస్' ను నిర్వహిస్తుంది. '1971 యుద్ధంలో అలుపెరగని ధైర్యాన్ని ప్రదర్శించి, భారతదేశానికి విజయాన్ని అందించిన మన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్నాను. ఈ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన జవాన్ల కథలు ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తాయి' అని రాష్ట్రపతి ముర్ము అన్నారు. '1971లో భారతదేశ చారిత్రాత్మక విజయానికి దోహదపడిన వీర సైనికుల ధైర్యాన్ని, వారి త్యాగాలను మేము ఎప్పటికీ గౌరవిస్తాము. వారి నిస్వార్థ అంకితభావం, అచంచలమైన సంకల్పం మన దేశాన్ని రక్షించాయి. మనకు కీర్తిని తెచ్చాయి. వారి త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తాయి' అని ప్రధాని మోదీ చెప్పారు. 'సాయుధ బలగాల ధైర్యసాహసాలు, త్యాగాలకు దేశం మొత్తం సెల్యూట్ చేస్తుంది. జవాన్ల త్యాగం, సేవను దేశం ఎన్నటికీ మర్చిపోదు' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# ట్రాక్టర్ల నిరసన ర్యాలీతో రైతుల సమరశంఖం

'బటోగే తో లుటోగే' (విడిపోతే లూరీ అవుతాం) నినాదంతో
ముందుకు సాగాలని ఎస్‌కెఎం నేత టికాయత్ పిలుపు

**కర్నల్ :** కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల ఆందోళన మరింత ఉధృత రూపం దాల్చుతోంది. మరోపక్క పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష 21వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తనాయకుడు రాకేష్ టికాయత్ మంగళవారం రైతు సంఘాలు అన్నీ ఏకమై సంయుక్తంగా పోరాటం నిర్వహించాలని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా రాకేష్ టికాయత్ రైతు గ్రూప్‌లను ఉద్దేశించి 'బటోగే తో లుటోగే' (విడిపోతే లూరీఅవుతాం) అనే నినాదాన్ని ఇచ్చారు. డల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 70ఏళ్ల వయసున్న పంజాబ్ రైతునాయకుడు డల్లేవాల్ క్యాన్సర్ బారినపడ్డారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) న్యాయ హామీ సహా పలు డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్యనున్న ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. కాగా రైతుల నిరసనలకు మద్దతు తెలుపుతూ హర్యానాలోని అంబాలా సహా సోనిపట్, హిసార్ ప్రాంతాలలో రైతులు సోమవారం నాడు ఖనౌరీశంభు సరిహద్దు పాయింట్ల వద్ద ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించారు. పంజాబ్‌కు చెందిన రైతు నాయకుడు సర్వాన్ సింగ్ పంధేర్ శనివారం నాడు మాట్లాడుతూ డిసెంబరు 16న పంజాబ్ మినహా అన్ని రాష్ట్రాలలో ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహించాలని, పంజాబ్‌లో డిసెంబరు 18వ తేదీన మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు 'రైల్ రోకో' నిర్వహించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగానే సోమవారం నాడు రైతులు శంభుఖనౌరీ సరిహద్దు వద్ద ట్రాక్టర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాగా ఇదే సమయంలో టికాయత్ ఖనౌరీ వద్ద ఆమరణ నిరాహారదీక్ష నిర్వహిస్తున్న డల్లేవాల్‌ను గత వారం కలుసుకున్నారు. ఇదిలాఉంటే సోమవారం రాకేష్ టికాయత్ విలేకరులతో మాట్లాడుతూ రైతుల గ్రూపులన్నీ డిమాండ్లకు మద్దతుగా సంఘటితంగా పోరాటం నిర్వహించాలని నొక్కిచెప్పారు. 'బటోగే తో లుటోగే, సబ్‌కో ఇక్కతే రెహ్నా పడేగా' అనే నినాదాన్ని ఇచ్చారు. పంధేర్ ఆదివారం నాడు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చాకు రాసిన లేఖలో రైతుల పలు డిమాండ్లు పరిష్కారం కోసం పంజాబ్‌హర్యానా సరిహద్దు పాయింట్ల వద్ద నిరసన తెలుపుతున్న రైతులతో చేయి కలపాలని కోరినట్లు చెప్పారు. రైతుల పంటలకు ఎంఎస్‌పి సహా న్యాయహామీ ఇవ్వాలనే డిమాండ్ల పరిష్కారం కోసం మద్దతు పలకాలని విజ్ఞప్తి చేసినట్లు పంధేర్ చెప్పారు. శంభు సరిహద్దు వద్ద పంధేర్ ఆదివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ 'ఢిల్లీ ఆందోళన్2లో భాగస్వాములు కానటువంటి సోదరులతో మా చేతులు కలిపి రైతుల ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం. మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు ఉన్నా మర్చిపోయి రైతులు, కార్మికుల కోసం సంఘటితంగా పోరాడతాం' అని చెప్పారు. సంయుక్త కిసాన్ మోర్చా నుంచి మాకు సానుకూల మెసేజ్ వస్తుందని తాము ఆశిస్తున్నామని పంధేర్ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. లేఖ గురించి అడగగా భారతీయ కిసాన్ యూనియన్ అధికార ప్రతినిధి అమిన టికాయత్ మాటడ్లాడుతూ గత ఆరు నుంచి పదినెలల కాలంగా రైతు గ్రూప్‌ల నాయకులకు చెబు



తూనే ఉన్నామని, రైతుల సమస్యల పరిష్కారం కోసం అందరూ సంఘటితమై కూర్చుని చర్చించాలని కోరామన్నారు. ఢిల్లీ చలో అనే పిలుపు వ్యక్తులకు సంబంధించిన సంస్థలు ఇచ్చినది అని, ప్రత్యేకించి పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల లో ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారని, అందుకే అన్ని గ్రూపులకు చెందిన రైతు నాయకులం చేతులు కలిపి రైతుల పోరాటాన్ని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళతామని ధీమా వ్యక్తం చేశారు. కాగా అంబాలానగరంలో రైతులు ట్రాక్టర్ల నిరసన ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హిస్సార్, సమీప ప్రాంతాలకు చెందిన రైతులు రామాయణ్ టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని అక్కడనుంచి ట్రాక్టర్లపై హన్సీకి నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎంనాన్ పొలిటికల్) కిసాన్ మజ్దూర్ మోర్చా(కెఎంఎం)ఇచ్చిన పిలుపులో భాగంగా రైతులు ట్రాక్టర్ల మార్చ్‌ను నిర్వహించారు.

## సిఎం కాగానే మాట ఎందుకు మారిందో..

**ఒమర్ అబ్దుల్లాపై కాంగ్రెస్ ఫైర్**



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత ఒమర్ అబ్దుల్లాపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇవిఎంల విషయంలో తమ అభిప్రాయాన్ని తప్పుపడుతూ ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సిఎం పదవి దక్కగానే ఇవిఎంల విషయంలో ఒమర్ అబ్దుల్లా మాట ఎందుకు మారిందని కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ ప్రశ్నించారు. ఇవిఎంలకు వ్యతిరేకంగా సమాజ్‌వాదీ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన పార్టీ బహిరంగంగా మాట్లాడాయని, తాము కాదని, ఒమర్ అబ్దుల్లా నిజాలు తెలుసుకుని మాట్లాడాలని మాణిక్కం ఠాగూర్ అన్నారు. తాము ఇవిఎంల పనితీరుపై అనుమానం వ్యక్తంచేస్తూ సిడబ్ల్యుసిలో చేసిన తీర్మానాన్ని కేవలం కేంద్ర ఎన్నికల సంఘానికి మాత్రమే ఇచ్చామని తెలిపారు. ప్రతిపక్ష కూటమిలో భాగస్వామి అయి ఉండి, సిఎం కాగానే ఒమర్ అబ్దుల్లా ఎందుకు మాట మార్చారో అని ఠాగూర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీకి కనీసం 10 శాతం సీట్లు కూడా రాకపోవడంతో ఈవీఎంలపై మరోసారి విమర్శలు వెల్లువెత్తాయి.

# ఇవిఎంలకు వ్యతిరేకంగా ఎంవిఎ నిరసన ప్రదర్శన




**నాగ్‌పూర్ :** నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర విధాన్ భవన్ మెట్లపై ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషన్ (ఇవిఎం)ల ఉపయోగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాగ్‌పూర్‌లో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కాగా, శాసనమండలిలో ప్రతిపక్షనేత అంబదాస్ దాన్వే నేతృత్వంలోని ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇవిఎంలు ఉపయోగించడాన్ని వ్యతిరేకించాలన్నారు. 'ఇవిఎం హటావో... దేశ్ బచావో', 'ఇవిఎం హటావో... కానిస్టిట్యూషన్ బచావో', 'ఇవిఎం హటావో... డెమాక్రసీ బచావో' అంటూ నినదించారు. దాన్వేతో పాటు నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ శాసనసభ్యులు విజయ్ వడెట్టివార్, నితిన్ రౌత్, భాయి జగతప్, వికాస్ ఠాక్రే, శివసేన (యుబిటి) నేతలు భాస్కర్ జాధవ్, వరుణ్ దేశాయి, సచిన్ అహిర్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంఎల్‌ఎ జితేంద్ర అహ్వాద్‌లు పాల్గొన్నారు. దాన్వే మీడియాతో మాట్లాడుతూ ఇవిఎంలు ప్రజాస్వామ్యానికి ముప్పు, ఎన్నికల్లో ఇవిఎంల ఉపయోగాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇవిఎంలను తొలగించాలని, బ్యాలట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరుతున్నామని శివసేన (యుబిటి) నేత పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అధికార మహాయుతి ప్రభుత్వాన్ని ఇవిఎం సర్కార్‌గా ప్రతిపక్ష ఎంవిఎ పేర్కొనడాన్ని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఖండించారు. ప్రతీ ఓటు మహారాష్ట్రకే పడ డం వల్లే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ యన వ్యాఖ్యలపై దాన్వే స్పందిస్తూ ప్రతి ఓటు బ్యాలట్ పేపర్‌కే వేయాలన్నారు. కాంగ్రెస్ నేత భాయి జగతప్ మాట్లాడు తూ ఇవిఎంలో వేసిన ప్రతి ఓటు మహాయుతికి వెళ్లిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం ఇవిఎంలను దుర్వినియోగపరిచాయని ఆరోపించారు. ఇవిఎంల ఉపయోగానికి బదులుగా బ్యాలట్ పేపర్ల ఉపయోగంపై కాంగ్రెస్, ఎంవిఎ అవగాహన కల్పిస్తుందన్నారు.

# హిందువులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ



**కోల్‌కతా :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు, పొరుగు దేశంలో హిందూ సన్యాసి చిన్మోయ్ కృష్ణ దాస్‌ను నిర్బంధించడాన్ని నిరసిస్తూ 'బెంగాలీ హిందూ సురక్షా సమితి' ఆధ్వర్యంలో సోమవారం నగరం నడిబొడ్డున వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. గతంలో ఇస్కాన్ బంగ్లాదేశ్‌తో అనుబంధం ఉన్న దాస్‌ను విడుదల చేయాలని, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం హిందువులు, ఇతర మైనారిటీలపై అఘాయిత్యాలను ఆపాలని డిమాండ్ చేస్తూ సీల్దా స్టేషన్ నుంచి రాణి రాష్మోని రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. హిందువులు, ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకుని కొనసాగుతున్న హింసాకాండపై నిరసనకారులు కాషాయ జెండాలు, బ్యానర్‌లను పట్టుకుని ఆందోళనలు చేశారు. హిందువుల భద్రత, రక్షణకు హామీ ఇచ్చేలా తాత్కాలిక ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఈ దాడులకు పాల్పడిన వారిని చట్టానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాస్ అరెస్టు అన్యాయమని, షేక్ హసీనా ప్రభుత్వం పతనం అయినప్పటి నుండి హిందువులు, ఇతర మైనారిటీలు, వారి ప్రార్థనా స్థలాలపై దాడులకు పాల్పడడమే అతను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మైనారిటీలు శాంతి, సామరస్య వాతావరణంలో జీవించేలా బంగ్లాదేశ్‌లో తా త్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'బంగ్లాదేశ్ హిందూ దేర్ ఓపోర్ అక్రోమో న్ బంధో కరో,' (మైనారిటీ హిందువులపై దాడు లు ఆపండి), 'చిన్మోయ్ కృష్ణ దాసర్ ఒబిలోంబే ముక్తి చాయ్' (చిన్మోయ్ దాస్‌ను వెంటనే విడుదల చేయాలి) అని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని నిరసనకారులు పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు.


IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BHUPALPALLY
E.P.No. of 2024
In
O.S.No.188 of 2022
(Old O.S.No.69 of 2015)

Between:

**Gaddam Yadagiri, S/o: Sri Pochaiah,** Age: 55 years, Occ: Singareni Employee, R/o: Q.No.T2-589, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District

...Petitioner / Decree Holder

And

1. **Kampa Mogili,** S/o. Sri Kanukaiah, Age:61 years, Occ: Singareni Employee, R/o: Q.No.T2-947, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District.
2. **Singareni Collieries,** rep. by its General Manager, Bhupalpally, Jayashankar Bhupalpally District.

...Respondents / Judgment Debtor

**NOTICE**

Please take notice that the above petitioner/ decree holder filed the E.P. against the Respondents to direct the Respondent No.2 to deposit the withheld amount of I.A.No.173 OF 2020 in O.S.No.69 OF 2015 (Old) / O.S.No.188 OF 2022 (New), if the Respondent No.1 /Judgement Debtor No.1 having any objection may file his objections before the above mentioned Hon'ble Court on **03-01-2025 at 10-30 A.M.** either personally or through an advocate with due objections. If nobody appears before the Hon'ble Court on the said date, the matter will be heard and decided on merits.

// By Order of the Hon'ble Court//

Sd/- PAGADALA ANANDA RAO
ADVOCATE
Bhupalpally,
Jayashankar Bhupalpally District.

ప్రజాపక్షం
మంగళవారం, డిసెంబరు 17

## రాజ్యాంగానికి ఎటునుంచి ప్రమాదం?

అతిపెద్ద లిఖిత రాజ్యాంగమైన భారత రాజ్యాంగం 75 సంవత్సరాల అస్థిత్వం తదుపరి కూడా మన దేశ ప్రస్థానానికి ఆదేశిక చట్టంగా కొనసాగటం, రాజకీయంగా భిన్న ధోరణలున్న వారు సైతం దాని పరిరక్షణ ఆవశ్యకత గూర్చి ఉగ్గడించటం మన రాజ్యాంగ రచనలో పొదిగిన దార్శనికతలోని గొప్పదనానికి నిదర్శనం. వందల సంవత్సరాల వలస పాలన నుండి స్వేచ్ఛ పొందిన నవభారతదేశం, స్వాతంత్ర్య సిద్ధితోపాటు రెండుగా విభజించబడిన దేశం, అందులో ఒకటి మత ప్రాతిపదికపై పాకిస్థాన్‌గా ఏర్పడగా, పరిశేష భారతదేశ భాగానికి సైతం మెజారిటీ హిందూమతం ప్రాతిపదికగా ఉండాలని తీవ్రమైన ఒత్తిళ్లు ఆందోళనల మధ్య జాతీయోద్యమ లౌకిక ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన జరగటం ఎంత గొప్ప విషయమో ఊహించుకోవలసిందే. తమ ఆకాంక్షకు మహాత్మాగాంధి, జవహర్‌లాల్‌నెహ్రూ వంటి మహానాయకులు అడ్డుపడ్డారన్న దుగ్ధ, ఆక్రోశం హిందూత్వ శక్తుల్లో అప్పటికీ ఇప్పటికీ ఉంది. ప్రస్తుత పాలక బిజెపి సహా హిందూత్వవాదులకు ఆరాధ్యుడైన వి.డి.సావర్కార్ ఆనాడే అన్నాడు – ఈ రాజ్యాంగంలో భారతీయత ఏదీలేదు; వేల ఏళ్లుగా ఈ దేశానికి ఆదర్శంగా పాటించబడుతున్న మనుస్మృతిని తోసిపుచ్చారు అని. ఈనాడు ఆయన వారసులైన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలు మనుస్మృతి భజన చేస్తున్నారు. సమానత్వం, సహోదరత్వం; సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, సమాన అవకాశాలు; భావ ప్రకటన, మతావలంబన స్వేచ్ఛ, దేశ ఐక్యత – సమగ్రతవంటి ఉదాత్త ఆశయాలతో కూడిన భారత రాజ్యాంగం మతవాద, మితవాద శక్తులకు మింగుడు పడదు. లౌకిక వ్యవస్థ కోసం దృఢంగా నిలబడిన, ప్రజాస్వామ్యాన్ని కిందిస్థాయి వరకు తీసుకెళ్లి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసిన, ప్రభుత్వరంగం ఆధిపత్యంతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను నిర్మించిన తొలి భారత ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ప్రభావాన్ని ఈ దేశ ప్రజల మనస్సులనుండి తొలగించనిదే మెజారిటీ మతవాదుల పిడివాదం బలంగా వేళ్లూనదు. అందువల్లనే నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది మొదలు నెహ్రూను కనుమరుగుచేసే ప్రయత్నాలు మనం చూస్తున్నాం. నవంబర్ 14 నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవటం రద్దయింది. నెహ్రూకు పోటీగా వల్లభ్‌భాయి పటేల్‌ను ప్రతిష్టించారు. అందువల్ల మొన్న లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చలో పాల్గొంటూ ప్రధాని నరేంద్రమోదీ తన దాడినంతా నెహ్రూపైన, నెహ్రూ–గాంధి కుటుంబ పాలనపైన ఎక్కుపెట్టారు. అందులో అంతా పునశ్చరణ తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదు. రాజ్యాంగం గొప్ప, ప్రపంచానికే ఆదర్శం అని ఉద్ఘాటనలు తప్ప ఆ రాజ్యాంగంలోని ఆశయాలను ముందుకుగొనిపోవటానికి గత పదేళ్లలో తమ ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పుకోలేదు. ఎందుకంటే, బిజెపి, మోదీ రాజ్యాంగానికి ఎలా తూట్లు పొడుస్తున్నారో రెండేళ్లుగా ఇండియా కూటమి ఎండగడుతున్నప్పటికీ ఎదురుదాడి తప్ప సానుకూల సమాధానం లేదు. 'మీరు ఆచరించేది భారత రాజ్యాంగ శాసనమా లేక మనువు శాసనమా?' అనే ప్రశ్నకు సమాధానం దాటవేశారు. రాజ్యాంగాన్ని 60 సార్లు సవరించారని కాంగ్రెస్‌ను ఎత్తిపొడిచారు. రాజ్యాంగం పిడివాదం కాదని, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవసరాలకనుగుణంగా దాన్ని సవరించే అధికారాన్ని పార్లమెంటుకు రాజ్యాంగమే ఇచ్చినందున అది సజీవ పత్రంగా మనగలుగుతున్నది. అయితే కాంగ్రెస్ పార్టీ తన అధికారంకోసం రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసిన సందర్భాలు, ముఖ్యంగా ఎమర్జెన్సీ విధింపు వంటివి జరగకపోలేదు. ఆ చర్య దుష్ప్రభావాన్ని అది అనుభవించింది. ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీయే ప్రజాస్వామ్యానికి బద్ధురాలై ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ఆదేశించిన విషయం మరిచిపోరాదు. మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ కూటమికి 400 సీట్లు ఇవ్వాలని నరేంద్రమోదీ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాని ఎందుకోసం ఆ మెజారిటీ అవసరమో చెప్పలేదు. రాజ్యాంగం ధ్వంసాన్ని మోదీ కోరుకుంటున్నట్లు ప్రతిపక్ష ఇండియా కూటమి ఆరోపించినా నోరు విప్పలేదు. అప్పుడే కాదు, ఇప్పటికీ ఆ మర్మం చెప్పలేదు. రిజర్వేషన్‌లకు కాంగ్రెస్ వ్యతిరేకమంటూ ఇప్పుడు ఎదురుదాడి చేస్తున్నారు. కులగణనను విచ్ఛిన్నవాదంగా ఖండిస్తున్నారు. షెడ్యూల్డు కులాల ఉపవర్గీకరణను అంగీకరించిన మోదీ, మహారాష్ట్ర ఎన్నికల్లో 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే నినాదమిచ్చారు. జనసంఘ్ కాలం నుంచి ఈ బిజెపివారు ఫ్యూడల్ శక్తులను బలపరిచారు. రాజులు, జమీందార్లకు అండగా నిలిచారు. సామాజిక చైతన్యాన్ని వ్యతిరేకించారు. ఇప్పుడు ఓట్ల అవసరాలకోసం బడుగు బలహీనతరగతుల పట్ల సానుభూతి ప్రకటిస్తున్నారు. అయితే పప్పుబెల్లాలు తప్ప ఆ బడుగుజీవుల ఉద్ధరణకు ఏ ఒక్క మౌలిక కార్యక్రమమైనా ప్రకటించారా?

# వామపక్ష భావజాలాన్ని ఎవరూ అణచలేరు



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

18వ శతాబ్దానికి పూర్వమే మానవ సమాజ పరిణామం క్రమం ఆవిర్భవించింది. సామాజిక మార్పులతో ఆనాడు కుటుంబాలు పండ్లు, జంతువుల మాంసం భుజిస్తున్న తరుణంలో మనుషులలో పరివర్తన ఆరంభం కావడంతో రాయితో రాయిని రాపిడిచేసి అగ్ని గెలికలు పుట్టించడం, ఆ నిప్పులో కట్టెలు వేసి మాంసంను కాల్చుకతినే విధంగా అలవాటయ్యారు. భూమిలో విత్తనంవేసి మొలకెత్తడం చూసి, దాని ద్వారా వచ్చిన ఫలాలను తిని ఆకలి తీర్చుకోవడం నేర్చుకున్నారు. అందులో మాటకారి పెద్ద మనిషిగా చెలామణి అవడంతో ఆదిమ మానవ సమాజం ఆ తర్వాత బలవంతుడు, బలహీనుడిని చిన్నచూపు చూస్తూ పెత్తనం చేయడం, బానిసలుగా చూసే పరిస్థితి రావడం బానిస సమాజం, భూమిని చదును చేసుకొని ఆక్రమించుకొని బానిసలుగా ఉన్నవారిని కూలీలుగా ఉపయోగించుకొని పెద్దరికం మొదలుపెట్టారు. భూస్వామ్య సమాజమంటే ఎవరు ఎంత ఆక్రమించుకుంటే అదంతా వారిదే. అందుకే వేలాది ఎకరాలు, గ్రామాలు, పల్లెలు వారి స్వాధీనంలో ఉండేవి. పెట్టుబడిదారి వ్యవస్థలో యజమాని, కూలి వంటి వర్గాలు ఏర్పడ్డాయి. వర్గాల మధ్య అంతర్గతమైన అణచివేతలు, దోపిడీ కొనసాగింది. రైతులు, కూలీలు చేసిన ఉత్పత్తులను యాజమానులు సంపదగా మలుచుకొని దోపిడికి తెగబడ్డారు. దోపిడిచేసే వర్గం వారు తక్కువ వున్నా దోపిడికి గురయ్యే వర్గాలు సమాజంలో ఎక్కువ వున్నారు. ఈ శ్రమ దోపిడి, మానవ సమాజాన్ని కారల్ మార్క్స్ అధ్యయనం చేసి దోపిడి చేసే వర్గం సమాజంలో తక్కువగా వున్నదని, దోపిడికి గురయ్యేవర్గం ఎక్కువగా వున్నదని చెప్పినాడు. దోపిడికి గురైన వారు ఐక్యంగా ఉండి తిరిగబడినప్పుడు మాత్రమే దోపిడి రహిత సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. దానికి మొదటగా 1848లో మొదటి కమ్యూనిస్టు ప్రణాళికను ప్రవేశపెట్టాడు. మానవకళ్యాణానికి వర్గరహిత సమాజ నిర్మాణానికి కారల్ మార్క్స్ కృషి చేశారు. 1895 అమెరికాలోని షికాగో నగరంలో అణచివేయబడిన కార్మికులు తడిచిన రక్తపు కండువను ఎర్రజెండాగా ఎగురవేసి కార్మికుల హక్కులకై పోరాటం చేశారు. ఈ ఉద్యమం అణచివేత, ఆవేదన, దోపిడి నుండి పుట్టుకొచ్చింది. ప్రపంచ వ్యాపితంగా వామపక్షపార్టీలు విస్తరించాయి. మనుషుల ఆలోచనల నుండి, దోపిడీ రహిత సమాజం కోసం పుట్టుకొచ్చిన సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని ఎవరూ నిర్మూలించలేరు.

భారతదేశం విభిన్నకులాలు, మతాలు, సంస్కృతుల సమ్మేళనం. ఈ భారతదేశంలో వామపక్ష భావజాలానికి స్థానం వున్నది. అయితే విస్తరించడానికి అడ్డంకులున్నప్పటికీ ఎక్కడైతే దోపిడి, అణచివేతలు, మతోన్మాదం రెచ్చిపోతున్నదో అక్కడే వామపక్షాల పోరాటం ఉంటుంది.

### వామపక్షాల నిర్మూలనతో భావజాలం అంతమవుతుందా?

భారతదేశంలో 1925లో కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్థాపించబడింది. అయితే సిద్ధాంతపరమైన విభేదాల వలన కమ్యూనిస్టులు అనేక పార్టీలుగా చీలిపోయారు. దీంతో వామపక్షపార్టీలు చెట్టుకొక్కరు పుట్టకొక్కరు అయ్యారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం 1952లో సాధారణ ఎన్నికలు జరిగాయి. ప్రజలచేత, ప్రజల కొరకు ప్రభుత్వం ఏర్పడాలి. కానీ కుల, మత పార్టీలు పుట్టుకొచ్చాయి. భారతదేశంలో కమ్యూనిస్టులు శ్రమజీవుల పక్షాన, కార్మికుల పక్షాన నిలబడ్డారు. పోరాటం లేనిదే చట్టంలో మార్పులు జరగవని కమ్యూనిస్టులు నమ్మారు. కార్మికులు హక్కులు, రైతుల డిమాండ్లు, నూతన ఆర్థిక విధానాలు అన్నీ కూడా పోరాటాల ఫలితంగా వచ్చాయి. చట్టాలు అములులో సమానత్వం తగ్గిపోయింది. పేదరికం పెరిగిపోయింది. ఉద్యోగ భద్రత లేదు. నిరుద్యోగం పెరిగింది. కమ్యూనిస్టులు వామపక్ష పోరాటాల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్య పద్ధతులలో హక్కులను పొందాలని ప్రయత్నిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీలలో రకరకాల ఆలోచనలతో వున్నాయి. అయితే వామపక్ష పార్టీలలో మావోయిస్టులు తుపాకి గొట్టం ద్వారానే మన హక్కులను సాధించుకుంటామనే ఆలోచనతో పోరాటం చేస్తున్నారు. వారుచేస్తున్న పోరాటం తప్పు కావచ్చు, నిజంగా చెప్పాలంటే కుటుంబాలను, భార్యాపిల్లలను వదలి ప్రాణాలకు తెగించి ఎప్పుడు ఎక్కడ తింటారో, నిద్రిస్తారో తెలియని అగమ్యగోచర పరిస్థితులలో సమాజ శ్రేయస్సు కొరకే పోరాటం చేస్తున్నారు. అణచివేతలు, దోపిడి వర్గాలను అరికట్టాలని లక్ష్యంతో వారు ఆ పంథాను ఎంచుకున్నారు.

నరేంద్రమోడీ, అమిత్‌షాలు వామపక్ష పార్టీలే ప్రధాన బద్ధశత్రువుగా చూస్తున్నారు. వామపక్ష భావాలు కలిగిన వారిపై ఉపా, రాజద్రోహం కేసులు పెడుతూ బెయిల్ రాకుండా సంవత్సరాల తరబడి జైల్లోనే ఉండటం చూస్తున్నాము. అక్రమంగా అరెస్టు చేయడం, గొంతులుఎత్తి మాట్లాడే వారిని గొంతులు నొక్కుతున్నారు. అర్బన్ నక్సలైట్‌లు అని ముద్రవేస్తున్నారు. ఇప్పుడు మావోయిస్టులను ఏరివేత లక్ష్యంగా వందలాదిమంది మావోయిస్టులను బలికొన్నారు. వచ్చే ఏడాదికి నక్సలైట్‌లను నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు ఇస్తున్నారు. దానికి కారణం భారతదేశంలో వామపక్ష పార్టీలు లేకుండా చేయాలనే దుర్బుద్ధి తప్ప మరొకటి కాదు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ ప్రజల మధ్యన చిచ్చుపెట్టే ఆర్‌ఎస్‌ఎస్ ఆడిస్తున్న నాటకంలో బిజెపి పాత్ర వహిస్తున్నది. దేశంలో అపాయకరమైన పరిస్థితి ఏర్పడింది. దానిని ఎదుర్కొవడానికి త్యాగాలతో కూడిన కార్యాచరణ రూపొందించుకోవాలి. అయితే బిజెపికి గట్టి ఎదురు దెబ్బలు తగులుతూనే వున్నాయి. గడిచిన ఎన్నికల్లో ఏక పార్టీ పాలన పోయి, ఇప్పుడు బహుళ పార్టీ పాలన వచ్చింది. ఎన్‌డిఏ కూటమితో అధికారంలో వున్నాయి. ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాలు కూడా ఆలోచన చేయాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు 76 సంవత్సరాల తరువాత కూడా అమలు కావడం లేదంటే పాలకుల నిర్లక్ష్యం, క్రూరత్వానికి నిదర్శనం.

### ఆటుపోట్లు ఉన్నా అజరామరం

పార్లమెంటరీ పంథాలో పనిచేస్తున్న వామపక్షాలు కూడా అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికలు ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. దానితో దేశ ప్రజల జీవన ప్రమాణాలలో మానవాభివృద్ధిలో మార్పులు రావాలి. ప్రజాస్వామ్యంలో ఓట్లు కీలకమైనందున ఓట్లు రాబట్టడానికి అడ్డమైనదారులు త్రొక్కుతు అధికారమే పరమావధిగా ఓటర్లను ప్రభావితం చేసే ప్రలోభాలు డబ్బు, మద్యం, సంక్షేమ పథకాల ఎర చూపి అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. అందుకే ప్రజాసేవకులు కనుమరుగవుతున్నారు. ప్రజాభక్షకులు హంతకుల, గుండాలు, మనభంగాలు చేసేవారు, కార్పోరేట్ సంస్థల అధిపతుల నుండి రియల్‌ఎస్టేట్ వ్యాపారుల వరకు ఎం.పి., ఎం.ఎల్.ఎ.లుగా గెలుస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు గెలవాలి. కాని దోపిడి శక్తులు, వారికి అండగా ఉండే మతోన్మాద శక్తులకు అధికారం హస్తగతం కావడంతో కార్మికులు, కూలీలు, బడుగు బలహీనవర్గాల శ్రమకు తగ్గ ఫలితం రాకపోవడం, సామాజిక న్యాయం నినాదానికే పరిమితం కావడం, స్థిరం కావడం దారుణమైన చర్యగా భావించాలి.

వామపక్ష పార్టీ అనేది ఎక్కడ అణచివేతలు, దోపిడి ఉంటుందో అక్కడ ఉంటుంది. ఉగ్రవాద చర్యలను సామాజిక, ఆర్థిక అంశంగా గుర్తించి పరిష్కరించే బదులుగా శాంతి భద్రతల అంశంగా గుర్తించి ఎన్‌కౌంటర్‌లే ప్రధానమని గతంలో భావించారు. ఇప్పటికీ మోది ప్రభుత్వం, అందులో హోంశాఖ మాత్యులు అమిత్‌షా అమితమైన ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామంటున్నారు. తాత్కాలికంగా అణచివేయబడ్డా అంతరాలు లేని, దోపిడి రహిత సమాజమేర్పడే వరకు దాని ఉనికి ప్రభావం ఉంటూనే ఉంటుంది. ఇలాంటి తరుణంలో మావోయిస్టులు కూడా అంతర్మథనం చేసుకుంటూ ప్రత్యామ్నాయ ఆలోచనలకు పదును పెట్టాలి. ఈ మధ్యకాలంలో పక్కదేశంలో శ్రీలంకలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. ప్రపంచంలోని అనేక దేశాలలో వామపక్ష, ప్రగతిశీల ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ప్రజలు తమ హక్కులు, బ్రతుకుదెరువు గురించి ఆలోచిస్తున్నారు. అందుకు మానవుడు నిరంతర కృషి, మార్పుకు నాంది పలికాలి.

రానున్న కాలంలో మనదేశంలో మోది ప్రభుత్వం ఉక్కుపాదంతో ఉగ్రవాదాన్ని అణిచివేయాల్సిందే, కాని వామపక్ష తీవ్రవాదానికి ప్రజల పునాది ఉన్నదనే విషయాన్ని పాలకులు గుర్తిస్తే మంచిది. ప్రజలు కూడా ప్రజాస్వామ్య ఫలాలు పొందడానికి చైతన్యవంతం కావాలి. పాలకులను ఆలోచింప చేసే విధంగా ప్రజా చైతన్యాన్ని ప్రదర్శించాలి. ఇటీవల ప్రొఫెసర్ సాయిబాబా అకాల మరణం చెందారు. ఇందుకు పాలకులే కారణం. అన్యాయంగా ఉపా కేసులు మోపి 90 శాతం కదలలేని స్థితిలో ఉన్న మేధావిని పదేళ్ళు అండా సెల్‌లో బంధించారు. చివరకు కోర్టు నిర్దోషిగా తేల్చింది. హర్యానా ఎన్నికల్లో ఓట్లకోసం డేరా సచ్చా సౌదా గురువు రాం రహీమ్ సింగ్‌కు బిజెపి ప్రభుత్వం పెరోల్ ఇచ్చింది. కానీ, ప్రొఫెసర్ సాయిబాబా తల్లి చనిపోయినప్పుడు చూసేందుకు పెరోల్ ఇవ్వలేదు. చివరికి ఆయన నిర్దోషి అని తేలింది. ఏమిలాభం? జైలులో పడిన అష్టకష్టాలతో బైటికి వచ్చిన నెలల్లోనే అనారోగ్యంతో అకాల మృత్యువుకు గురయ్యారు. కేవలం వామపక్ష భావజాలం కలిగి ఉన్నారనే ఒకే ఒక్క కారణంతో ఆయనను బంధించి, మానసికంగా హింసించడమే కాకుండా, చివరికి ఆయన మరణానికి కూడా పాలకులు కారణమయ్యారు.

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేర్లతో మావోయిస్టుల అంతానికి పంతంపట్టుకుంది. వారి ఉద్దేశ్యం చత్తీస్ఘడ్ ఇతర అటవీ ప్రాంతాలలో ఆదివాసీల అభిమానాన్ని చూరగొన్న మావోయిస్టులను నిర్మూలించి, పచ్చని అటవీ, వాటిలోని సహజ వనరులు, గనులను తమ వందిమాగధ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే అనే దురాలోచన ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అందుకే మావోయిస్టులను అంతమొందించేందుకు కేంద్రం గట్టి ప్రయత్నాలు సాగిస్తుంది.

### మావోయిస్టులు చేస్తున్న చర్యలు పునరాలోచన చేయాలి

ప్రజాస్వామ్య పద్ధతులలో ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలు తిప్పిగొట్టాలి. కన్నుకు కన్ను చావుకు చావు అనే సిద్ధాంతం నుండి కాకుండా కమ్యూనిస్టులు ఐక్య పోరాటంచేసి అణచివేతలను ఎదుర్కొని వర్గరహిత సమాజాన్ని నిర్మించాలి. దోపిడి, అణచివేతలు ఉన్నతకాలం వామపక్షాల పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. దీనిని నిలవరించడం ఎవరి వల్ల సాధ్యం కాదు. సామాజిక, ఆర్థిక కోణంలో చూడాలి. ఇది బ్రతుకు పోరాటం. సమాజంలో దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిజం ఉంటుందనేది సత్యం. వివిధ పార్టీలుగా చీలిపోయిన కమ్యూనిస్టులు, మావోయిస్టులు, ఇతర వామపక్ష శక్తుల మధ్య అనుసరించే మార్గంపై భిన్నాభిప్రాయాలు వుండవచ్చుతప్పా సమసమాజ స్థాపనే అందరి అంతిమ లక్ష్యం ఒక్కటే. అయితే మితవాద, మతవాద శక్తుల నుండి దేశం తీవ్ర ప్రమాదం ఎదుర్కొంటున్న ఈ దశలో వామపక్ష, ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా వాటిని తిప్పికొట్టాల్సిన తరుణమిదే.

# పంట వ్యర్థాలు కాలిస్తే భూమికి ముప్పే

ఆరుగాలం కష్టపడి పంటలు సాగుచేసే అన్నదాతలు కొన్ని పద్ధతులు పాటించకపోవడం పర్యావరణానికే ముప్పు తెచ్చిపెడుతోంది. అవగాహనాలోపం, ఆనవాయితీగా వస్తున్న పద్ధతులు అవలంబిస్తుండటంతో అన్నదాతలు సరైన దిగుబడి పొందలేకపోతున్నారు. పంటల సాగుకు అధిక రసాయనాలు, ఎరువులు వాడుతూ పెట్టుబడుల భారం మోస్తున్నారే కానీ అనాదిగా వస్తున్న పద్ధతులు మార్చడంలో మాత్రం ఆసక్తి చూపడంలేదు. పంటకాలం పూర్తి అయిన తర్వాత పంట అవశేషాలు, వ్యర్థాలను కాల్చివేస్తూ పర్యావరణానికి, భూమికి విఘాతం కల్గిస్తున్నారు. ప్రతిఏటా పంటకాలం పూర్తయిన వరి, పత్తి, మొక్కజొన్న, కందిలాంటి పంటల వ్యర్థాలను పంట పొలాల్లోనే కాల్చివేస్తున్నారు. ఆ కారణఃగా భూమిసారం దెబ్బ తినడంతో పాటు పర్యావరణానికి హాని కల్గుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్, రబీ పంటలు సాగుచేసే సమయానికంటే ముందే రైతులకు అవగాహన కల్పిస్తున్నా పంట అవశేషాలను కాల్చడం మాత్రం ఆపడంలేదనే విమర్శ లు వినిపిస్తున్నాయి.

**భూసారం..పర్యావరణంపై తీవ్ర ప్రభావం...**

రైతులు పంట సాగుచేసే సమయానికంటే ముందు పొలాలు, చేన్లలోని గత పంట అవశేషాలు, వ్యర్థాలను కాల్చడం అలవాటుగా మారింది. పంట అవశేషాలు, వ్యర్థాలను కాల్చిన తర్వాత పొలాల్లో కాలిన బూడిద మిగులుతుంది. అయితే ఈ సమయంలో నేలతో పాటు పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. పంట వ్యర్థాలను కాల్చిన సమయంలో కార్బన్‌మోనాక్సైడ్, కార్బన్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, అమోనియం వంటి విషవాయువులు గాలిలో కలుస్తాయి. అలాగే భూమిలోని సేంద్రీయ కర్బనం, పోషకాలు క్షీణించిపోయి సారం దెబ్బతింటుంది. ఇలా ప్రతి ఏటా వేలాది ఎకరాల్లో వ్యర్థాలను కాల్చడం మూలంగా పర్యావరణంతో పాటు భూమిపై తీవ్ర ప్రభావం ఉంటుంది.

**ఏటా 293.5లక్షల టన్నుల వ్యర్థాల ఉత్పత్తి...**

తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేస్తున్న ప్రధాన పంట ద్వారా ఏటా సుమారుగా 293.5లక్షల టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులే చెబుతున్నారు. వరిలో 30నుంచి40,పత్తి పంటలో 90నుంచి95శాతం వ్యర్థాలను ప్రతి ఏటా రైతులు కాల్చి బూడిద చేస్తున్నారు.

**వరి, పత్తి కట్టెలతో ఎంతో ప్రయోజనం...**

పంటల సాగుకు ముందు పంట వ్యర్థాలను సక్రమంగా వినియోగించుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. వరి పంట కోత తర్వాత గడ్డిని పొలంలోనే వదిలేసి సింగిల్



సూపర్ ఫాస్పేట్ లేదా వేస్ట్ డి కంపోజర్, పూసా డీ కంపోజర్‌ను చల్లితే 15నుంచి20 రోజుల్లో కుళ్లిపోతుంది. ఆ తర్వాత ఎలాంటి దుక్కి దున్నకుండానే ఆరుతడి పద్ధతిలో విత్తనాలు విత్తుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. అలాగే పత్తి కట్టెను రోటావేటర్, స్టాపర్ లేక మల్టీ క్రాప్ షెడ్డర్‌తో కలియదున్నితే 12.420కిలోల నత్రజని, 1.6కిలోల ఫాస్పరస్, పటాస్, 12.213 కిలోలు ఒక హెక్టార్‌కు అందుతుంది. ఇలా చేయడం ద్వారా ఎరువుల వాడకం తగ్గి భూమి సారవంతంగా తయారై పంట దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**దుక్కిలో కలియదున్నడమే మేలు...**

పంటకాలం ముగిసి మరో పంట సాగుచేసే సమయానికి ముందు పొలాలు, చేన్లలో ఉండే వ్యర్థాలు, పంట అవశేషాలను కాల్చకుండా కలియదున్నితే ఎంతోమేలు అని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంట వ్యర్థాలను కలియదున్నడం ద్వారా భూమిలో కార్బన్ శాతం పెరిగి భూమి సారవంతం అవుతుంది. పత్తి కట్టె, వరి కర్ర, మొక్కజొన్న కొయ్య, కంది కట్టెలాంటి వివిధ పంట వ్యర్థాలను కాల్చకుండా దుక్కిలోనే దున్నితే ఆ వ్యర్థాల ద్వారా అనేక పోషకాలు భూమిలోకి చేరి పంటకు ఎంతో ఉపయోగకరంగా మారుతుంది.

**వ్యర్థాలను కాల్చడం వల్ల నష్టాలే...**

వరి కొయ్యలు, పత్తి కట్టెలను కాల్చడం వల్ల వాతావరణంలో కాలుష్యం పెరుగుతుంది. అంతేకాకుండా ఆ వేడితో భూమి సారం కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్పరస్‌లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు సైతం కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణా లు దెబ్బతింటాయి. మేలుచేసే సూక్ష్మ జీవులు నశించిపోతా యి. సూక్ష్మ జీవులతోపాటు పంట పొలాలపై ఆధారపడి జీవించే జీవరాశులు మృతిచెందే అవకాశాలు కూడా ఉంటాయి. దీంతో ప్రకృతి సమతుల్యత దిబ్బతిని పంట దిగుబడి తగ్గే అవకాశాలు ఉంటాయి. అంతేకాకుండా ఆలస్యంగా కోతకు వచ్చే పంటలకు కూడా ప్రమాదమని చెప్పచ్చు. కల్లా ల్లో ధాన్యం రాశులుఉన్నా ఈ అగ్నికి కాలిపోయే అవకాశాలు ఉంటాయి.

**ఫలితమివ్వని అవగాహన...**

పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం జరిగి పంట దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా ఫలితం దక్కడం లేదు. పంటల సాగు సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను ఒక్కచోటికి చేర్చి పంట వ్యర్థాలు, అవశేషాలు కాల్చవద్దని చెబుతున్నారు. పంట వ్యర్థాలను కాలబెడితే పర్యావరణం దెబ్బతినడంతో పాటు భూమి సారం కోల్పోయి అనుకున్న స్థాయిలో దిగుబడి ఇవ్వదని అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా ఇలాంటివి చేస్తే పంటకు అధిక మోతాదులో రసాయనాలు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దీంతో పంట భూమి పూర్తిగా సాగుకు పనికిరాకుండా పోతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# మరపురాని తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుసేన్



ప్రపంచానికి భారతీయ శాస్త్రీయ తబలా సంగీతా న్ని పరిచయం చేసిన ఘనుడు మన ఉస్తాద్ జాకీర్ హుసేన్. తబలా విద్వాంసుడు, సంగీత నిర్మాత, కంపోజర్, సినీ నటుడు, పర్‌క్యూషనిస్ట్ అయిన ప్రఖ్యాత హిందూస్తానీ తబలా సంగీత విద్వాంసుడు జాకీర్ హుసేన్ తన 73వ ఏట తీవ్ర అనారోగ్యం తో అమెరికాలో కన్నుమూసారనే వార్త ప్రపంచ సంగీత విద్వాంసులు, సంగీతాభిమానులను, ముఖ్యంగా భారతీయులను నివ్వెరపరిచింది. 09 మార్చి 1951న ముంబాయిలో జన్మించిన జాకీర్ హుసేన్ తండ్రి ప్రఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లా రాఖా కావడంతో తన ఏడవ ఏట నుంచే తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ తబలాపై అసామాన్య పట్టు సాధిస్తూ, 12వ ఏటనే ప్రదర్శనలు ఇస్తూ సంగీతకారుల మన్ననలు పొందడం, ప్రపంచానికి తన తబలా సంగీతాన్ని పరిచయం చేయడం జరిగింది.

ముంబయిలోని సెయింట్ మైఖేల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎడ్యుకేషన్, సెయింట్ గ్జేవియర్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. వెల్లింగ్టన్ యూనివర్సిటీ నుంచి సంగీతంలో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రముఖ కథక్ నర్తకి, తన మేనేజర్, గురువైన 'ఆంటోని యా మిన్నెకోలా'ను వివాహమాడి ఇద్దరు కూతుళ్ల జన్మనిచ్చారు.

**బహువిధ సంగీత విద్వాంసుల సమ్మేళనంలో మెరిసిన జాకీర్ హుసేన్ తబలా:**

1970లో అమెరికా పర్యటించి ఏడాదికి 150కి పైగా సంగీత ప్రదర్శనలు ఇస్తూ, వివిధ రకాల సంగీత విద్వాంసులతో కలిసి అబ్బురపరిచే తబలా సంగీత విన్యాసాలను, అనేక రకాల స్టైల్స్ ను, జాజ్, వరల్ మ్యూజిక్‌లను మేళవించి సంగీతాభిమానుల మనసులు దోచుకున్నారు. 1991లో డ్రమ్మర్ మైఖేల్ హార్ట్‌తో కలిసి ప్లానెట్ డ్రమ్ ఆల్బమ్ తీసి గ్రామీ అవార్డుతో పాటు అనేక ఇతర అవార్డులు పొందా రు. 1996 అట్లాంటా ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో తన తబలా సంగీత కళ లో చూపరుల మన్ననలు పొందారు. ఆరు దశాబ్దాలకు పైగా తబలా సంగీతానికి పట్టాభిషేకం చేసిన జాకీర్ హుసేన్ మన భరతమాత ముద్దు బిడ్డ కావడం మన అదృష్టం.

**ఉస్తాద్ జాకీర్ హుసేన్‌ను వరించిన పురస్కారాల పంట:**

ఉస్తాద్ జాకీర్ హుసేన్ సంగీత కృషి, ప్రతిభ ను గుర్తించిన భారత ప్రభుత్వం 1988లో 'పద్మశ్రీ', 2002లో 'పద్మ భూషణ్', 2023లో 'పద్మ విభూషణ్' పురస్కారాలు పొందారు. 1999లో 'యుఎస్ నేషనల్ హెరిటేజ్ ఫెల్లోషిప్' పొందారు. 2024లో నిర్వహించిన 66వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో 5 కెటగిరీల్లో ప్రపంచ ప్రఖ్యాత 'గ్రామీ మ్యూజిక్ అవార్డులు' స్వీకరించిన తొలి భారతీయ సంగీత విద్వాంసుడిగా పేరొందారు. పలు ప్రపంచ ప్రఖ్యాత సమకాలీన సంగీత విద్వాంసులతో కలిసి సంగీత సృజనకు ఊపిరి పోశారు.

2006లో మధ్యప్రదేశ్ ప్రభుత్వ కాళిదాసు సమ్మాన్, 1990లో 'భారత సంగీత నాటక అకాడమీ అవార్డు', 2018లో 'రత్న సదస్య' పురస్కారం, 2019లో 'సంగీత నాటక అకాడమీ ఫెల్లో'గా గుర్తింపు పొందారు. అనేక సినిమాలకు తన సంగీత సహకారం అందిస్తూనే, 2015లో 'సింఫొనీ ఆర్కెస్ట్రా ఆఫ్ ఇండియా'తో మరిచిపోలే ని సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పలు అమెరికన్ యూనివర్సిటీల్లో సంగీత పాఠ్యాంశాలు బోధిస్తూ, రేపటి తరానికి సంగీత సామర్థ్యాలను అవగాహన పరిచారు. 2017 లో ఎస్‌ఎఫ్‌జజ్ వేదికలో 'జీవన సాఫ ల్య పురస్కారం', 2022లో ప్రఖ్యాత 'క్యోటో ప్రైజ్'ను స్వీకరించారు. 2016లో నాటి అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా పిలుపుతో వైట్ హౌజ్‌లో తన ప్రతిభను ప్రదర్శించారు.

అసంఖ్యాక మ్యూజిక్ అల్బమ్స్ సృష్టికర్తగా పేరు తెచ్చుకున్న జాకీర్ హుసేన్ జీవిత విశేషాల ను పొందుపరుస్తూ జకీర్ హుసేన్ : ఎ లైఫ్ఇన్ మ్యూజిక్ అనే పుస్తకాన్ని నసీర్ మున్నీ కబీర్ అనబడే రచయిత రచించారు. ముంబాయి యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన జాకీర్ హుసేన్ సంగీత జీవితం నేటి సంగీతాభిమానులు, యువ సంగీత కళాకారులకు దారిదీపం కావాలని కోరుకుందాం,

# జపాన్ విధానాలు ఆదర్శం...అనుసరణీయం

13 కోట్ల జనాభా కలిగిన దేశం, ప్రపంచ దేశాలకు జీరో నుండి హీరోగా మారడం ఎలాగో నేర్పిన దేశం జపాన్. జపాన్‌లో అవలంభించే వివిధ రకాల విధానాలు హరహచి బూ, కిన్సుగి, లాంటివి ఇతర దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. అలాంటి వాటిలో ఒకటి ఈ 5S పద్ధతి. జపాన్ 5S అనేది ఒక పద్ధతిని పనిస్థలంలో సమయ్ర మరియు స్థలాన్ని ఆదా చేయుటకు, ఉత్పాదకత, సమర్థతను పెంచుటకు, భద్రతను మెరుగుపరచుటకు, నిర్వహణ ఖర్చులను తగ్గించుటకు, నాణ్యతను నిరంతరంగా పెంపొందించుటకు జపనీయులు 5S పద్ధతిని ఏదైనా పరిశ్రమలో లేదా సంస్థలో పని వాతావరణాన్ని మెరుగుపరచడానికి, పర్యావరణ అనుకూలమైన కార్యకలాపాలను అమలు చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఈ పద్ధతి పనిస్థల పరిపాలన దానిని సమర్థవంతంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుంది. ఇది జపాన్‌లో అభివృద్ధిచెంది ప్రపంచవ్యాప్తంగా సంస్థలు దీనిని అనుసరిస్తున్నాయి. 5S పద్ధతిలో ఐదు ముఖ్యమైన దశలు ఉన్నాయి, ఇవి జపనీస్ పదాలతో ప్రారంభమై సమర్థవంతమైన విధానాన్ని అందిస్తాయి.

1. సెరి (Seiri)క్రమబద్ధీకరణ:
అవసరంలేని వస్తువులను తొలగించి, అవసరమైన వాటిని మాత్రమే ఉంచడం. ఇది స్థలాన్ని స్వచ్ఛంగా మరియు నిర్వహణ సులభంగా ఉండేలా చేస్తుంది.

2.సెటో (Seiton): అమరిక
వస్తువులను సరిగ్గా అమరిక చేయడం, అర్థవంతమైన స్థలంలో ఉంచడం. అవసరమైన వస్తువులు తక్షణమే అందుబాటులోకి రావడం అనుమతిస్తుంది.

3.సేసో (Seiso) శుభ్రపరచడం:
పనిస్థలాన్ని క్రమం తప్పకుండా శుభ్రపరచడం. ఇది యంత్రాలు, పరికరాలు, పనివాతావరణాన్ని ఆరోగ్యకరంగా ఉంచుతుంది.

4. సెటేకెత్సు (Seiketsu) ప్రామాణీకరణ:
మొదటి మూడు దశలను కొనసాగించడానికి పద్ధతులను స్థిరపరచడం.

ఇది పని నాణ్యతను స్థిరంగా ఉంచడంలో సహాయపడుతుంది.

5. షిట్సుకె (Shitsuke) క్రమశిక్షణ:
5Sఆచరణను అలవాటు చేసుకుని, దీన్ని నిత్యంగా కొనసాగించడం. క్రమశిక్షణతో పద్ధతులను జాగ్రత్తగా పాటించేందుకు దోహదపడుతుంది.

ఎవి. సుధాకర్ STUTS
9000674747

# నిర్బంధ విద్యకు కాలానుగుణ నిర్ణయాలు అవసరం

లేఖ

విద్యా హక్కు చట్టం 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత, సార్వత్రిక విద్యను అందించలేదని లోక్‌సభలో సమర్పించిన గణాంకాల ద్వారా వివరించడం జరిగినది. 2024–25 మొదటి ఎనిమిది నెలలకు 1.17 మిలియన్లమంది పిల్లలు బడులకు వెళ్లడం లేదు. పథకాలు మరియు విధానాలు ఉన్నప్పటికీ, దేశ విద్యావ్యవస్థలో పిల్లలు చదువులకు దూరంగా ఉంటు ఒక అస్థిరమైన సమస్యగా మిగిలిపోతున్నట్లు వివిధ నివేదికల ద్వారా తెలుస్తుంది

జీవనోపాధికోసం తరచుగా ప్రజలు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్తున్నందువలన చదువులకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నందు వలన దాదాపు 60వేలమంది పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారు. చదువు నేర్చుకోవడంలో నష్టంతో మాత్రమే కాకుండా పేద సంపాదన నైపుణ్యాల వల్ల కూడా బాధపడుతున్నారు ఇది పేదరికం మరియు సామాజిక శక్తి చక్ర బంధా న్ని శాశ్వత పరుస్తున్నది. జాతీయ నమూనా సర్వే నివేదిక ప్రకారం 2017–18లో12.4%మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. గిరిజన కుటుంబాలకు చెందిన బాలికలు ఎక్కడైనా అధ్వాన్నంగా ఉన్నప్పటికీ, దక్షిణాదికంటే ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో ఎక్కువమంది బాలికలు సంపాదించడానికి లేదా ఇంట్లో సహాయం చేయడానికి మిగిలిపోతున్నారు. గృహపని, వ్యవసాయం, తయారీ రంగాలు అత్యంత ప్రజాదరణ పొందిన రంగాల్లో పనిచేస్తూ వచ్చిన సంపాదనతో జీవనయానం సాగిస్తుంటా రు.

పాఠశాలలు చాలాదూరంలో ఉన్నందున లేదా సరైన పారిశుద్ధ్య సౌకర్యాలు లేనందున ఆడపిల్లలు వివాహ చేసుకుంటున్నారు. లేదా ఇంట్లోనే ఉంటున్నారు. దీనికి ప్రధాన కారణం విద్యపట్ల ఆసక్తి లేకపోవటం పేదరికం వెనుకబాటుతనం, సున్నితమైన నిర్వహణ మరియు నిమగ్నమైన బోధన ద్వారా పరిష్కారం చేయాలి.

బాలికలకు అనువైన మౌలిక సదుపాయాలు, సురక్షితమైన ప్రయాణాన్ని కూడా ఏర్పాటు చేయాలి. పిల్లలు పనిచేయకుండా నిరోధించడానికి ఫౌండేషన్ లెర్నింగ్ యొక్క ప్రాముఖ్యత గురిం చి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా సాధ్యమవుతుంది. బాల కార్మికులు లేదా మైనర్ వివాహాలకు వ్యతిరేకంగా లేదా విద్యాహక్కుపై చట్టాలు, పిల్లలను లేదా వారి తల్లిదండ్రులను పాఠశాలలను వదిలివేయకుండా ఆపడానికి సరిపోవు విధానం మారాలి, పరిష్కారాలు కాలానుగుణంగా ఉండాలి.

దండంరాజు రాంచందర్ రావు

# గత మూడు నెలల్లో పెరిగిన రియల్‌ఎస్టేట్

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోలేదు

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు తరలిపోతారనే ప్రచారం ఆపోహ మాత్రమే

అసెంబ్లీ లాబీలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిట్‌చాట్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోలేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన మూడు నెలల నుంచి రియల్ ఎస్టేట్ రంగం పెరిగింది. మూడేళ్లతో పొల్చితే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఆదాయం భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు తరలిపోతారనే ప్రచారం ఆపోహ మాత్రమేనన్నారు. అమరావతిలో సంభవించిన వరద వల్ల అది తొలగిపోయిందని, మళ్ళీ పెట్టుబడిదారులందరు తెలంగాణ బాట పట్టారన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కపై బిఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌కు ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడం అర్ధరహితమన్నారు. కార్పొరేషన్‌లు ఒక్క రూపాయి కూడా స్వంతంగా ఆర్జించే పరిస్థితి లేదన్నారు. కార్పొరేషన్ల పేరుతో చేసే అప్పులు సైతం ప్రభుత్వం ఖాతాలోకి వస్తాయనేది కెటిఆర్ తెలుసుకోవాలన్నారు. రూ.7.20 లక్షల కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అప్పులు ఉన్నాయని శాసనసభలో ఎవరి పాత్ర వారిదేనని, ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడం వాళ్ల హక్కు అని పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తూ బిఆర్ఎస్ చర్చ నుండి తప్పించుకునేందుకే అనవసర రభస చేస్తోందన్నారు. బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ సమావేశాలకు వస్తే ఆయనతో కూర్చుని మాట్లాడాలని వ్యక్తిగత కోరిక ఉందని, అది నేరవేరుతుందో లేదో చూడాలని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ఎలాంటి వ్యతిరేకత లేదని, వైఎస్ఆర్ హాయంలోనూ ఇలానే ప్రచారం జరిగిందని, రెండు మూడు ఏళ్ళల్లో అన్ని సర్దుకుంటాయని మంత్రి చెప్పారు. .అదాని విషయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ పాలసీనే రాష్ట్రంలో అమలు జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇండస్ట్రీ పాలసీలో పెట్టుబడిదారులు ఎవరన్నది ముఖ్యం కాదని, పెట్టుబడులు ఎవరు పెట్టినా తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

# ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

సింగిల్ డిజిట్‌కు చేరిక

అత్యల్పంగా ఆదిలాబాద్‌లో నమోదు

బయటకు రావడానికి జంకుతున్న ప్రజలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. చాలా చోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి మారిపోయిన వాతావరణం తెల్లవారుజామున పొగ మంచు కప్పేసింది. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చర్లపల్లి, తిరుమలగిరిలో 13.6 డిగ్రీలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ ప్రాంతంలోని పోచర 6.4, అర్లి 6.6, చాప్రాల్ 6.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిర్మల్ జిల్లాలోని తాండ్రలో 6.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లాలోని సత్వార్ 6.6, న్యాల్కల్ 6.7, జహీరాబాద్ 6.9, నల్లవెల్లి 6.8 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లాలోని బంట్వారం 6.7, నగరం (టి) 6.8, మన్నెగూడ 6.8, మర్పల్లి 6.8, రంగారెడ్డి జిల్లాలోని చందనవల్లి 6.7, ఎలిమినేడు 6.7, సిద్దిపేట జిల్లా పోతరరెడ్డిపేట 6.9, కామారెడ్డి జిల్లా మెనూర్లో 6.9, జగిత్యాల జిల్లా 7.3, ఆసిఫాబాద్లోని కెరమెరిలో 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### గ్రేటర్ హైదరాబాద్‌లో..

హైదారాబాద్‌లో అత్యల్పంగా మౌలాలి, హెచ్‌సియు ప్రాంతాల్లో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాజేంద్రనగర్ 8.2, బిహెచ్ఈఎల్‌లో 7.4 డిగ్రీలు, శివరాంపల్లిలో 10.3, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్ నగర్ 11.7, బోయిన్‌పల్లి 11.9, గచ్చిబౌలి 9.3, మచ్చబొల్లారంలో 10.2, కత్బుల్లాపూర్ 10.2, వెస్ట్ మారేడ్పల్లిలో 9.9, ఆసిఫ్‌నగర్ 12, బేగంపేట 12, మోండా మార్కెట్ 12.4, నేరేడ్‌మెంట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, చందానగర్ 12.7, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, కూకట్‌పల్లి 13.1, సఫిల్‌గూడ 13.3, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, చాంద్రాయణగుట్ట 13, షేక్‌పేట్ 12.8, హయత్ నగర్ 13.3, ఉప్పల్ 13.4 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. బయటకు వెళ్లే సమయంలో ముదురు రంగు దుస్తులు ధరించాలని తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు వేడి పానియాలు తీసుకోవాలన్నారు. ఆస్తమ రోగులు బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

## సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చాం: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్థిక విషయాల్లో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని,ఆర్థిక విషయంలో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. శాసనసభను తప్పుదోవ పట్టిస్తున్నారని, తాము సభ హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చామని తెలిపారు. అసెంబ్లీ లాబీ వద్ద ఆయన సోమవారం జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గతంలో సిఎం కిరణ్ కుమార్ రెడ్డిపై ఉల్లంఘన నోటీసు ఇస్తే చర్చకు వచ్చిందన్నారు. ప్రోటోకాల్ సమస్యలను స్పీకర్‌కు వివరించామని, అలాగే లగచర్లపై చర్చకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరినట్టు తెలిపారు. ఆర్‌బిఐ నివేదిక ప్రకారం రాష్ట్రంలోని అప్పులు రూ.3.89 లక్షల కోట్లు అని అన్నారు.



## ఎస్‌సిలను ఎబిసిడిగా వర్గీకరించాలి

బిజెహెచ్‌పిఎస్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఎస్‌సిలో ఎబిసిడి వర్గీకరణను వెంటనే అమలు చేసి, సంచార కులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల కోటా పెంచాలని బేడ (బుడగ) జంగం హక్కుల పోరాట సమితి (బిజెహెచ్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్నెం, సీనియర్ నేత కడమంచి సహదేవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మాట్లాడుతూ సంచార కులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌గా బేడ బుడగ జంగాల వ్యక్తిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ భరోసా స్కీం అమలు చేసి, బేడ బుడగ జంగాల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాని డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు కోడిగంటి నర్సింహ్మా, తూర్పాటి శ్రీనివాస్‌లు, చిన్నకోటయ్య, రాములు పాల్గొన్నారు.

## మయొట్టేలో ‘సైక్లోన్ ఛిడో’ వందలమంది మృతి?

**పారిస్ :** ఫ్రాన్స్ వెలుపల హిందూమహాసముద్రంలో ఉండే మెట్రోపాలిటన్ ఫ్రాన్స్‌గా పిలిచే ‘‘మయొట్టే’’ భూభాగంలో భయంకరమైన తుఫాను వచ్చింది. ఈ తుఫానను ‘‘సైక్లోన్ ఛిడో’’గా పిలుస్తున్నారు. ఈ తుఫాను వల్ల వందలమంది మరణించి ఉంటారని భయపడుతున్నారు. గంటకు 225 కి.మీ కంటే ఎక్కువ వేగంతో గాలులు వీచాయి. ఈ మయొట్టేలో తుఫాను ఒక అణుయుద్ధం తరహాలో వచ్చిందని, ఎంతమంది చనిపోయారో చెప్పటం కష్టమని సజీవులు చెబుతున్నారు. ఇప్పటికి మూడు రోజులుగా ప్రజలు నీరు, ఆహారం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.తుఫాను అనంతర పరిస్థితి అణుయుద్ధం తర్వాత వాతావరణంలా ఉందని సజీవులు చెబుతున్నారు. ఇక్కడ జనాభా 3.20 లక్షలమంది ఉంటారు. ఐతే దాదాపు లక్షమంది ప్రజల వలస వచ్చినవారే. .జనాభా లెక్కల్లో లేనివారే. అందువల్ల ఎంతమంది మరణించారనే విషయం ఇప్పుడే చెప్పలేమని సజీవులు చెబుతున్నారు. ఈ సంఖ్య వేలల్లోకి కూడా వెళ్ళినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని కూడా అంటున్నారు. శిథిలాలను వెలికితీసి సజీవులు ఎవరైనా ఉన్నారేమో అని వెతుకుతున్నారు.

# వడ్డీరేటులో 0.25 శాతం కోత?

ఫిబ్రవరిలో ఆర్‌బిఐ రివ్యూ

**న్యూఢిల్లీ :** వచ్చే ఫిబ్రవరిలో రిజర్వుబ్యాంకు నిర్వహించే విధాన నిర్ణయ సమీక్షా సమావేశంలో వడ్డీరేటులో 0.25 శాతం మేరకు కోత విధించే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు అంచనావేస్తున్నారు. రిజర్వ్‌బ్యాంకు వడ్డీరేటు ఇప్పటివరకూ స్థిరంగా కొనసాగుతూ వచ్చింది. శక్తికాంతదాస్ ఆర్‌బిఐ గవర్నర్‌గా కొనసాగినంతకాలం ఆయన ద్రవ్యోల్బణాన్ని భరించగలిగేస్థాయికి తీసుకురావడంపైనే దృష్టిపెట్టి వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు తాజాగా చౌకరకం ఆహార వస్తువులపై టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మూడునెలల కనిష్టానికి అంటే 1.89 శాతానికి క్షీణించింది. ఈ డబ్ల్యుపిఐ ఆధారిత ద్రవ్యోల్బణం ఈ ఏడాది అక్టోబరులో 2.36 శాతంగా ఉండగా, గత ఏడాది నవంబరునెలలో 0.39 శాతంగా నమోదైంది. ఈ ఏడాది ఆగస్టునెలలో 1.25 శాతంగా నమోదైంది.చౌకరకం ఆహార వస్తువులపై నవంబరునెలలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 1.89 శాతంగా నమోదైంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది అక్టోబరునెలలో 13.54 శాతంగా ఉన్న ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం నవంబరునెలలో 8.63 శాతానికి తగ్గింది. ప్రధానంగా కూరగాయల ద్రవ్యోల్బణం క్షీణించడంవల్ల ఆహార వస్తువులపై ద్రవ్యోల్బణం 28.57 శాతానికి తగ్గింది. అంతకు ముందు ఇదే ద్రవ్యోల్బణం అక్టోబరునెలలో 63.04 శాతంగా నమోదైంది. బంగాళాదుంపల ద్రవ్యోల్బణం ఉచ్ఛస్థాయిలో 82.79 శాతం మేరకు కొనసాగగా, అదేసమయంలో ఉల్లిపాయల ద్రవ్యోల్బణం నవంబరులో 2.85 శాతంగా నమోదైంది. కాగా ఇంధనం, విద్యుత్ విభాగానికి సంబంధించి ప్రతి ద్రవ్యోల్బణం (కరెన్సీ తగ్గింపు) నవంబరునెలలో 5.83 శాతంగా నమోదైంది. అంతకుముందునెల అక్టోబరులో ఈ ప్రతిద్రవ్యోల్బణం 5.79 శాతంగా ఉండేది. తయారీ వస్తువులకు సంబంధించి ద్రవ్యోల్బణం నవంబరునెలలో రెండూశాతంగా ఉండగా, అక్టోబరునెలలో 1.50 శాతంగా ఉండేది. బార్క్లేస్‌కు సంబంధించిన పరిశోధనాపత్రం సమాచారం ప్రకారం, ద్రవ్య విధాన కమిటీలో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం భరించగలిగేస్థాయి 2–6 మధ్య ఉంటుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇది నాలుగుశాతం లక్ష్యానికి చేరువగా వస్తుంది. ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో రెపోరేటును (ఫిబ్రవరినెలలో) 25 బిపిఎస్‌కు తగ్గిస్తారని బార్క్లేస్ పరిశోధనాపత్రం అంచనావేస్తున్నది. రిజర్వుబ్యాంకు గవర్నరుగా ఇప్పుడు సంజయ్ మల్హోత్రా కొత్తగా బాధ్యతలు చేపట్టారు. ఈనెల 11న శక్తికాంతదాస్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. అక్టోబరునెలలో ప్రభుత్వం ఆరుగురు సభ్యులుగల ద్రవ్య విధాన కమిటీని పునర్వ్యవస్థీకరించింది. ఐసిఆర్ఏ లిమిటెడ్ సీనియర్ ఎకనామిస్టు రాహుల్ అగర్వాల్ చెప్పిన సమాచారం ప్రకారం, టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం ప్రధానంగా ప్రాథమిక ఆహార వస్తువులపైనే ఆధారపడి ఉంటుంది. ఈ ద్రవ్యోల్బణం మూడు నెలల కనిష్టానికి అంటే 8.6 శాతానికి తగ్గింది. గతనెలలో ఈ ద్రవ్యోల్బణం 13.5 శాతంగా ఉండేది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ ఐసిఆర్ఏ అంచనాప్రకారం, టోకుధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం డిసెంబరులో 2.5 నుండి 3 శాతం వరకూ పెరుగుతుంది.



## తెలంగాణ పోలీసులకు డిజిటల్ ఇంజినీరింగ్ అవార్డ్స

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీసులకు మరో ప్రఖ్యాత అవార్డు లభించింది. గణేష్ నిమజ్జనంబందోబస్తు విజయవంతంగా నిర్వహించినందుకుగాను అమెరికాలోని డల్లాస్ నగరంలో ఎల్ అండ్ టి ఐఎస్‌జి, సిఎన్‌బిసి టివి18 ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ పోలీసులకు డిజిటల్ ఇంజనీరింగ్ అవార్డ్స్‌ను ప్రకటించారు. ఛాలెంజర్ కేటగిరీలో టాప్ సస్టెయినిబిలిటీ ఇన్‌షేటివ్ పురస్కారం దక్కింది.కాగా గణేష్ నిమజ్జనం సందర్భంగా జిఐఎస్, ఎఐ టెక్నాలజీని ప్రయోగించినందుకుగాను ఈ అవార్డును తెలంగాణ పోలీసు శాఖ సొంతం చేసుకుంది. ఈ ఏడాది జరిగిన గణేష్ ఉత్సవాల్లో దాదాపు 1,50,510 విగ్రహాలను నిమజ్జనం చేశారని ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ పరిక్షణుక సమన్వయ పర్చడంలో సాంకేతికతను ఉపయోగించారని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అదనపు డిజిపి వి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవార్డు తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగాన్ని గుర్తించడం గర్వంగా ఉందన్నారు.

# శ్రీధర్‌బాబు పిటిషన్ డిస్మిస్

కేసు విచారణను ఎదుర్కోవాలి

వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపు

హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్ :** కాళేశ్వరం నిర్మాణ సమయంలో పర్యావరణ ప్రజాహిత విచారణను అడ్డుకున్నారనే కేసులో తన పేరును తొలగించాలంటూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం హైకోర్టు కొట్టేసింది. కేసులోని అభియోగాల దృష్ట్యా పోలీసుల విచారణను ఎదుర్కొనాల్సిందేనని చెప్పింది. ఈ మేరకు గతంలో ట్రయల్‌కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. కింది కోర్టు ఉత్తర్వులను సమీక్షించాలంటూ శ్రీధర్‌బాబు వేసిన పిటిషన్‌లో ఉత్తర్వుల జారీకి జస్టిస్ లక్ష్మణ్ నిరాకరించారు. అయితే, ఇదే వ్యవహారంపై శ్రీధర్‌బాబు దాఖలు చేసిన మరో పిటిషన్‌లో కేసు విచారణకు వ్యక్తిగతంగా హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేశారు.పెద్దపల్లిలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై పర్యావరణ ప్రజాహిత విచారణను అడ్డుకున్నందుకు శ్రీధర్‌బాబు సహా 300 మంది కాంగ్రెస్ సభ్యులపై 2017లో బసంతనగర్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కాటారం మండలానికి చెందిన ఇరిగేషన్ ఇంజనీర్, ప్రజాభిప్రాయ సేకరణ ఇంచార్జీ ఫిర్యాదు మేరకు వాళ్లపై ఐపీసీ 147 (అల్లర్లు), 353 (ప్రభుత్వ సేవకుడి విధులను అడ్డుకోవడం) ఇతర సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు తనకు ఎలాంటి సంబంధం లేదని, ఎఫ్ఐఆర్ నుంచి తన పేరును తొలగింపునకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ గతంలో శ్రీధర్‌బాబు ట్రయల్ కోర్టును ఆశ్రయించగా ఎదురుదెబ్బ తగిలింది. ఎఫ్ఐఆర్‌లో తన పేరును తొలగింపునకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ శ్రీధర్‌బాబు పిటిషన్‌ను ట్రయల్‌కోరుట కొట్టివేయడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ కొట్టివేస్తూ సోమవారం తీర్పు వెలువరించారు. గతంలో ఇరుపక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు ఈ నెల 13న తీర్పు రిజర్వు చేసి ఇప్పుడు తీర్పు చెప్పింది. ఇదిలా ఉండగా, ఈ కేసును కొట్టివేయాలంటూ శ్రీధర్‌బాబు వేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మణ్ విచారించి.. శ్రీధర్‌బాబుకు ట్రయల్‌కోర్టు విచారణకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చారు ప్రతివాదులైన పోలీసులకు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున ప్రసాద్‌కు నోటీసులు జారీ చేశారు. విచారణను వచ్చే నెలకు వాయిదా వేశారు.

# పేదలను ఎలా గుర్తిస్తారు?

భూమి లేని పేదలందరి ఖాతాల్లో రూ.6వేలు జమ చేస్తారా

పట్టణ పేదల సంగతేంటి

లబ్ధిదారుల ఎంపిక ప్రాతిపదిక ఏదీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** పేదల ఖాతాల్లో మొదటి విడతగా డిసెంబర్ 28న ఆరువేల రూపా యలు జమ చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన ప్ర కటనపై పేదల నుంచి హర్షం వ్యక్తమవుతుంది. అదే సమయంలో ఆ ప్రకటన విస్తృత చర్చకు దారి తీసింది. ఇంత వరకు ఈ పథకానికి సంబంధించి అర్హులు ఎవరు, అర్హుల ఎంపికకు ప్రాతి పదిక ఏమిటన్నది తేల్చలేదు. భూమి లేని నిరుపేదలు అన్న ప్రకటన సారాంశంపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న భూమి లేని నిరుపేదల ందరి ఖాతాల్లో జమ చేస్తారా లేక తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబాలనులబ్దిదారులుగా ఎంపిక చేస్తారా అన్నది కూడా తేలా ల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో తెల్లరేషన్‌కార్డులలో జరిగిన అవినీతి కారణంగా ఆర్థికంగా బలమైన కుటుంబాలకు కూడా తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. కాబట్టి తెల్లరేషన్‌కార్డుదారు లందరికి ప్రభుత్వంఅందించే రూ.12 వేల ఆర్థిక చేయూత పథకానికి లబ్దిదారులుగా ఎంపిక చేసే అవకాశం లేదు. భూమి లేని నిరుపేదలంటే భూమి లేని వారిలో కూడా సంపన్నులు ఉండి ఉండ వ చ్చు. కా బట్టి 10 రోజుల్లో లబ్దిదారు లను ఎంపిక చేయాల్సిన ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం నిబంధనలను విడుదల చేయాల్సి ఉంది. కొంత మంది ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో భూమి లేదని చెప్పి న వారందరికీ ఎంపిక చేస్తారన్న ప్రచారం జరుగుతుంది. భూమి లేని వారు భూమి లేదని చెప్పినంత మాత్రాన ప్రభుత్వం ధృ వీకరిస్తుందా అన్నది తేలాల్సి ఉంది. మొ త్తంగా డిసెంబర్ 28న ప్రభుత్వం జమ చేయనున్న ఆరువేల రూపాయల నగదు గురించి విస్తృత చర్చ సాగుతుంది.గ్రామీ ణ పేదలకు సంబంధించి భూమి లేని వారని ప్రచారం జరుగు తుండగా ఇదే సమయంలో పట్టణ పేదల సంగతేమిటన్న చర్చ తెరపైకి వచ్చి ంది. గడిచిన దశాబ్ద కాలంలో వ్యవసాయరంగంలో వ చ్చిన ఒడిదుడుకులు పట్టణీకరణ వేగవంతానికి దారితీశాయి. గ్రామీణ పేదలు చి న్న సన్నకారు రైతులు పెద్ద సం ఖ్యలో పట్టణాలకు తరలి వచ్చారు. బజారు కూలీలు మొదలుకుని వివిధ వృత్తుల్లో వివిధ పను లు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరందరూ దాదాపుగా రెక్కాడితే కాని డొక్కాడని స్థితిలో ఉన్నారు.మరి భూమిలేని నిరుపేదలంటూగ్రామీణ పేదలను లెక్క వేస్తు న్న ప్రభు త్వం పట్టణ పేదల ఎంపికకు సం బంధించి ఎటువంటి ప్రాతిపదికను రూపొందిస్తుందన్న దాని కోసం పట్టణ పేదలు ఎదురు చూస్తున్నా రు. భట్టి విక్రమార్క ఆరువే లు ఖాతాల్లో వేస్తామన్న ప్రకటన హర్షణీయంతో పాటు లబ్దిదారులు ఎవరన్న దాని పై వారి వారి స్థాయిల్లో చర్చ సాగు తుంది. మరో 10 రోజుల్లో అమలు కాబోతున్న ఈ పథకానికి సంబంధించి అధికార యంత్రాంగం విడుదల చేయవచ్చునని తెలుస్తుంది.

# పోలవరం... అమరావతి రెండు కళ్లు

అక్టోబరు 2026 నాటికి ప్రాజెక్టు పూర్తి

వచ్చే ఏడాది ఏప్రిల్‌కి 16,400 ఎకరాల భూసేకరణ

ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియ 2026 నాటికి పూర్తి

దశలవారీ లక్ష్యాల కార్యాచరణ విడుదల చేసిన సిఎం

పోలవరం సందర్శించి అధికారులతో సమీక్షించిన చంద్రబాబు

**అమరావతి/ఏలూరు :** పోలవరం ప్రాజెక్టును ఎట్టిపరిస్థితులలోనూ 2026 అక్టోబరు నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. సోమవారం ప్రాజెక్టును సందర్శించిన సీఎం... అధికారులతో సమీక్షించి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన దశలవారీ లక్ష్యాల కార్యాచరణను నిర్దేశించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు రెండు కళ్లు లాంటివన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజల జీవనాడి అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీతో చర్చించామని, నిర్మాణ పనులకు దశల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని 2026 అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. డయాఫ్రమ్ వాల్, ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టవచ్చని నిపుణులు సూచించారన్నారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పనులు స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులను జనవరి 2వ తేదీన చేపట్టనున్నామని, అందుకు అవసరమైన యంత్ర సామాగ్రిని ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారని అన్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు 2026 మార్చి నెల నాటికి పూర్తిచేస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతుండగా, 2025 డిసెంబరు నాటికి పూర్తిచేయవలసిందిగా కోరుతూ లక్ష్యాన్ని నిర్దేశించామని



సీఎం చెప్పారు. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్ 1 పనులు ఫిబ్రవరి 2026 నాటికి, గ్యాప్ 2 పనులు 2027 డిసెంబరు లోగా పూర్తి చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులను కోరుతూ లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రాజెక్టు సివిల్ పనులను 2026 జూన్ నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్‌ను కోల్పోకుండా ఉంటామన్నారు. 2026 నుంచి ప్రాజెక్టులో నీటి నిల్వ ఉండేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను కోరామన్నారు. ప్రాజెక్టు కుడికాల్వ, ఎడమ కాల్వ అనుసంధాన పనులు 2026, జూన్ లోగా పూర్తి చేయాలని, స్పిల్ ఛానల్ పనులు 2026 జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులను అవసరమైన అనుమతులను త్వరితగతిన తీసుకువచ్చేలా ఇంజనీరింగ్ అధికారులు కషి చేయాలని ఆదేశించామన్నారు. 2014 నుంచి 2019 తమ ప్రభుత్వ కాలంలో 72 శాతం పనులు పూర్తి చేశామని, గత ప్రభుత్వం కేవలం 3.84 శాతం మాత్రమే పనులు పూర్తి చేసిందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులో 2,400 కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి తెలియజేసి, మొదటి దశలో 41.15 లెవెల్ నిర్మాణానికి 12,157 కోట్ల రూపాయలు సాధించామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన 7 లక్షల ఇరవై ఏడు వేల ఎకరాలు కొత్త ఆయకట్టుతో పాటు మరో 23 లక్షల ఎకరాలకు స్థిరీకరణ జరుగుతుందన్నారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగా వాట్ల విద్యుత్‌తో పాటు విశాఖపట్నం పారిశ్రామిక అవసరాలకు, ప్రజలకు తాగునీటికి 23 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని వివరించారు. నదుల అనుసంధానంలో భాగంగా ఇప్పటికే కష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని అందించామన్నారు. అదేవిధంగా కష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి మెయిన్ కెనాల్‌కు, గొల్లపల్లి రిజర్వాయర్ వల్ల బనగచర్లకు నీటిని అందించే పరిస్థితి ఏర్పడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఉత్తరాంధ్రకు సంబంధించి వంశధార ప్రాజెక్టుకు అవసరమైన అన్ని కార్యాచరణ ప్రతిపాదన సిద్ధం చేస్తున్నామన్నారు. పోలవరం, వంశధార ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కరువు రహిత ప్రాంతాలుగా రూపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, శాసనసభ్యులు చిర్రి బాలరాజు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, కొలికపూడి శ్రీనివాస రావు, పితాని సత్యనారాయణ, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), బత్తుల బలరామకష్ణ, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగాలని సిఎం ఆదేశం**

పోలవరం ప్రాజెక్టును నిర్దేశించిన గడువు కంటే ముందే పూర్తి చేసేలా నిర్మాణ పనులు శరవేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీనికి ఒక ఐకానిక్ ప్రాజెక్టుగా ప్రత్యేక గుర్తింపు తీసుకుని రావాల్సి అవశ్యకత ఉందని తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతంలోని సమావేశ మందిరంలో మంత్రులు, రాష్ట్ర, జిల్లా స్థాయి, ఇరిగేషన్, మైల్, అనుబంధ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, దిశా నిర్దేశం చేశారు. మెటీరియల్, ట్రెయిల్ రన్, సామాగ్రి తరలింపు అంశాలపై నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆచరణలో పెట్టడానికి అధికారులు, కాంట్రాక్టర్లు కట్టుబడి ఉండాలన్నారు. భూసేకరణకు సంబంధించి ఆచరణ, పర్యవేక్షణ కోసం నిబద్ధత కలిగిన ఒక అధికారిని నియమిస్తామని సీఎం తెలిపారు. 2026 జూన్ నాటికి భూసేకరణకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## కెన్యాలో నీటి కరువు విలయతాండవం

**నైరోబీ :** తూర్పు ఆఫ్రియాదేశం కెనాలో కరువు దారుణస్థితికి చేరుకుంది. కెన్యా ఉత్తర ప్రాంతంలో ఉన్న నదులు, చెరువులు, కుంటలు ఎండిపోయాయి. కరువు విలయతాండవం చేస్తూ ఉండటంతో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. నీరు లేక అల్లాడుతున్నారు. ఇటీవల పేట్రేగిన వ్యతిరేక వాతావరణ పరిస్థితుల కారణంగా ఆ దేశంలో కరువు ఉద్ధృతంగా మారింది. కెనాలో ఎక్కువమంది ప్రజలు పశువుల పెంపకం, వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తూ ఉంటారు. వాతావరణ వ్యతిరేకతవల్ల జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయి. ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రకారం, గడచిన 40 సంవత్సరాలలో ఎన్నడూలేని రీతిలో కెన్యాలో లక్షలాదిమంది ప్రజల జీవన స్థితిగతులు దుర్భరస్థాయికి చేరుకున్నాయి. ప్రధానంగా నీటి కరువు తాండవిస్తున్నది. పిల్లలు, మహిళలు వందల కిలోమీటర్లు మంచినీటికోసం అన్వేషిస్తూ సుదీర్ఘ ప్రయాణాలు చేస్తున్నారు. ఏ మాత్రం పరిశుద్ధంగాలేని నీటిని పిండుకుని తాగి రోగాలబారిన పడుతున్నారు. అజర్‌బైజాన్ నగరం బాకూలో ఇటీవల ముగిసిన కాప్–29 వాతావరణ సదస్సులో ప్రధానంగా కెనాలో తాండవిస్తున్న కరువు గురించే చర్చ జరిగింది. దేశాలు కెన్యాకు ఆర్థిక సహాయం అందించాలని ఐక్యరాజ్యసమితి ప్రధానంగా ప్రతిపాదించింది.



## నైపుణ్యత ఉంటే విజయాలు

హైకోర్టు జడ్జి మాధవీదేవి

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి :** నైపుణ్యత ఉంటే విజయాలు వెతుక్కుంటూ వస్తాయని హైకోర్టు జడ్జి మాధవి అన్నారు. పస్తాపూర్‌లో ని ఎస్వీ కళ్యాణ మండపంలో వికాస సంస్థ ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎక్కడైతే మహిళలు అక్షరాస్యులుగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందుతారో అక్కడ పురోగతి వుంటుందన్నారు. వికాస సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మొదటి దశలో180 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి వారికి ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శుక్ల వర్ధన్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, కొత్తకాపు శిరీష ,సత్యనారాయణ కోశిరెడ్డి, సుభాష్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సరేందర్‌రెడ్డి, బాస్కర్ పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన అటవీశాఖ అధికారి

**ప్రజాపక్షం/ మెట్ పల్లి :** పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం అటవీ శా ఖ రేంజ్ అధికారి అఫీసుద్దీన్ రూ. 4500 లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి పట్టుకున్నట్లు తె లిపారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. రాజన్న సిరిసిల్లా జిల్లా, గంభీరావుపేట్ మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పల్లేపు నరేష్, కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామం లో అటవీ అధికారుల దగ్గర నుండి ఆన్‌లైన్ పర్మిషన్ తీసుకొని మామిడి చెట్లు తీసివేశాడు. వాటిని తరలించేందుకు పర్మిషన్ కోసం కథలాపూర్ మండలం ఇంచార్జ్ రేంజ్ అధికారి అఫీసుద్దీన్, రవాణా చేసేందుకు పర్మిషన్ కావాలని కోరగా పదివేలు రూపాయలు ఇస్తేనే పర్మిషన్ ఇస్తానని రేంజ్ అధికారి అన్నాడు. బాధితుడు పల్లేపు నరేష్ ముందుగా ఐదువేల రూపాయలు రేంజ్ అధికారికి అందజేశాడు. మరో ఐదు వేల రూపాయలు కావాలని డిమాండు చేయడంతో ఎసిబి అధికారులను ఆశ్రయించారు పల్లేపు నరేష్. అఫీసుద్దీన్‌కు నాలుగు వేల ఐదు వందల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడుగా పట్టుబడినట్లు ఎసిబి డిఎస్పీ రమణమూర్తి తెలిపారు.

## కట్టుదిట్టమైన ఏర్పాట్లు మధ్య పరీక్ష




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గ్రూప్–2 పరీక్షల రెండవ రోజు సందర్భంగా ప్రభుత్వ బాయ్స్ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, యంవిఎస్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో పోలీసు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రశాంతమైన సజావుగా పరీక్షా నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా,పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పరీక్షా కేంద్రాల వద్ద ప్రజల రాకపోకలు నియంత్రణ, ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మల్టీ జోన్ 2 ఐజి సత్యనారాయణ, ఐపీఎస్ , గ్రూప్ 2 పరీక్షల రెండవ రోజు సందర్భంగా యన్‌టిఆర్ డిగ్రీ కళాశాల 2 గంటలకు సందర్శిస్తున్నారు.కావునా ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు అందరూ హాజరు కాగలరు.

## రూ.4లక్షల వ్యయంతో కాలువ నిర్మాణం



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పురపాలికలోని 25వ వార్డు వికాస్‌నగర్ కాలనీలో 15వ వార్డు ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షల వ్యయంతో చేపట్టిన కాలువ నిర్మాణం పనులను పుర చైర్ పర్సన్ కోనేటి పుష్పలత స్థానిక కౌన్సిలర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాజీ చైర్ పర్సన్ , కౌన్సిలర్ లక్ష్మి , జ్యోతి, ప్రశాంత్ రెడ్డి, బుక్కామహేశ్, సతీష్, నాయకులు పిట్టల మురళి, కోనేటి నరసింహులు, రాంమోహన్, కాలేబ్, కృష్ణారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాల వద్ద పోలీసు భద్రత

ఏర్పాట్లను పరిశీలించిన మల్టీజోన్– 2 ఐజి సత్యనారాయణ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గ్రూప్ 2 పరీక్షల రెండవ రోజు సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాల నందు పోలీసు భద్రత ఏర్పాట్లను మల్టీజోన్–2 ఐజి సత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌పి డి. జానకి, ఐపిఎస్ ఆధ్వర్యంలో 54 పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులు పరీక్షకు హాజరైతున్నారని,ఎక్కడ కూడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘాను మరింత పటిష్టంగా కొనసాగిస్తున్నారు. మల్టీజోన్2 మొత్తం 9జిల్లాల ఎస్‌పిలు నిన్నటి నుండి ఇప్పటి వరకు పూర్తి స్థాయి నిఘా పెట్టి పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి డి.జానకి, రాములు, ఎఆర్ అదనపు సురేష్‌కుమార్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## అక్రమ అరెస్టులకు నేడు నిరసన

**ప్రజాపక్షం/జడ్చర్ల :** లగచర్ల రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసన తెలియజేయాలని బిఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రేపు ఉదయం 11 గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సిగ్నల్ గడ్డ దగ్గర అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మునిసిపల్ పాలకవర్గం, బిఆర్‌ఎస్ పార్టీ పెద్దలు నాయకులు పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** పట్టణంలోని 9వవార్డు సంజాపూర్‌నందు టియుఎఫ్‌ఐడిసి నిధులద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను పురచైర్మన్ ఎడ్మ సత్యం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత లోపించ కూడదని కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ షబ్బీర్‌అహ్మద్, నాయకులు మాధవరెడ్డి, శాంతమ్మ, వెంకటమ్మ, లక్ష్మి ,బక్కయ్య,భాస్కర్ పాల్గొన్నారు.

## అంబులెన్స్ సౌకర్యం లేక రోగుల అవస్థలు




**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల కేంద్రమైన వీపనగండ్లలో 30 పడకల ఆసుపత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న మధ్యాహ్నం తర్వాత రోగులకు వైద్య సేవలు అందించే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగు లకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు స్థానికులు తెలిపారు. కొండనాలుకకు మందు వస్తే ఉన్న నాలుక పోయి ఒదన్నట్లు ఆసుపత్రికి దాతలు అందించిన అంబులెన్స్‌ను, 30 పడకల ఆసుపత్రికి 108 అంబులెన్స్ మంజూరు అయిం దంటూ దాతలు అందించిన అంబులెన్స్‌ను కూడా అధికారులు ఇతర ప్రాంతాలకు తరలించడంతో ప్రస్తుతం అంబులెన్స్ సౌకర్యం పోవడంతో అత్యవసర సమయాల్లో రోగులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. 24గంటలు పని చేసే ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సమయాల్లో వైద్యులు లేకపోవడంతో రోగులను మెరుగైన వైద్యం కోసం సిబ్బంది ఇతర ప్రాం తాలకు పంపడం జరుగుతుంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలిక కూడా పోయినట్లు కొత్త అంబులెన్స్ వస్తుందని పాత అంబులెన్స్ ను తీసు కువెళ్లదంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక ఆసుపత్రిలో అంబులలెన్స్ సౌకర్యం లేకపోవడంతో గతంలో రోగులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా కోకో కోలలుగా ఉన్నాయి. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు స్పందించి వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫిర్యాదు చేసినా.. చెరువులోకి అరబిందో వ్యర్థాలు

పత్రికల్లో వచ్చినా పట్టించుకోని కాలుష్య మండలి అధికారులు

కలుషిత జలాలను అరికట్టేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల సెజ్‌లోని అరబిందో ఫార్మా కలుషిత జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతుందనే విషయాన్ని తాను ఇదివరకే అసెంబ్లీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చినట్లు అయినా ఆ కంపెనీ కలుషిత నీరు మళ్లీ అలాగే వదులుతున్నారని జానంపల్లి అనిరుద్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంగా కాలుష్యమండలి చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో అనిరుద్‌రెడ్డి పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ముదిరెడ్డి పల్లి చెరువులోకి కాలుష్య జలాలను వదులడంతో పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా? అని వేసిన ప్రశ్నకు ముందుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమాధానం ఇస్తూ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గతంలోనూ, ఇటీవల జరిగిన తనిఖీల్లో అరబిందో తో పాటుగా ఆమ్నెల్, ఏపిఎల్ హెల్త్ కేర్ పరిశ్రమల నుంచి ఎలాంటి వ్యర్థాలు విసర్జించడం లేదని, పరిశ్రమలు వదిలే జలాల కారణంగా భూసారానికి ఎలాంటి నష్టం జరగలేదని తేల్చడం జరిగిందన్నారు. ఆ తర్వాత అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ అరబిందో పరిశ్రమ నుంచి వర్షపు నీటితో పాటు కలుషిత జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదులుతున్న కారణంగా చెరువులో చేపలు మరణిస్తున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని, ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని గత జులై 30 న జరిగిన అసెంబ్లీ సమావేశంలోనూ చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. అయితే తాను సభలో ఈ విషయాన్ని గురించి ఫిర్యాదు చేసిన తర్వాత కూడా అరబిందో పరిశ్రమ ముదిరెడ్డిపల్లి చెరువులోకి కలుషిత జలాలను వదలడం జరిగిందని, ఆగష్టు, అక్టోబరు మాసాల్లో దీనికి సంబంధించి వార్తలు ఆధారాలు, ఫొటోలతో సహా ప్రముఖ మీడియాలోనూ వచ్చాయని ప్రస్తావిస్తూ వాటికి సంబంధించిన క్లిప్పింగ్‌లను స్పీకర్‌కు చూపించారు. అయినా కాలుష్య మండలి అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదని చెప్పారు. ఈ విషయం కాలుష్య మండలికి ఫిర్యాదు చేస్తే వారు వెంటనే వారు పరిశీలించడానికి ఆ నీళ్లు ఆగిపోయి, ఆనవాళ్లన్ని ఎండిపోయిన తర్వాత వచ్చారని విమర్శించారు. మరో సారి కూడా ముదిరెడ్డిపల్లి గ్రామస్తులు కాలుష్య మండలి అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తే వారి ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ్యాలని సలహా ఇచ్చారని అనిరుద్ రెడ్డి వెల్లడించారు. కాలుష్య మండలి పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించడానికి రూపొందించిన నిబంధనల్లో 90 శాతం అమలు చేసినా కలుషిత జలాల సమస్య పరిష్కరమౌతుందన్నారు.అరబిందో కలుషిత జలాల విషయంగా చర్యలు తీసుకోవాలని, నష్టపోతున్న ముదిరాజ్ బిడ్డలకు న్యాయం చేయాలని అనిరుద్‌రెడ్డి కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, అని రుద్ రెడ్డి చెప్పిన విధంగా ఆగస్టు 24, అక్టోబర్ 26 న అరబిందో కలుషిత జలాలపై వచ్చిన వార్తల విషయాన్ని పరిశీలి స్తామని, ఈవిషయంగా వ్యవసాయ శాఖ నుంచి నివేదిక కోరుతామని చెప్పారు. కాలుష్య మండలి నిబంధనలు అమలులో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటేవాటి పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఉద్యమాలకు సన్నద్ధం కావాలి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అస్పృశ్యత అంటరానితనం కులవివక్షదాడులకు వ్యతిరేకంగా డాక్టర్‌బిఆర్ అం బేద్కర్ స్ఫూర్తితో ప్రతిఘటన ఉద్యమాలు చేపట్టాలని వాటికి సిద్ధం కావాలని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్య క్షులు కొమ్ముభరత్ దళితులకు పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్దంలో నేటికి కులవివక్షత అంటరానిత నం అమానుషంగా కొనసాగడం పాలకవర్గాలకు సిగ్గుచేటన్నారు. సొంతగ్రామంలో హనుమాండ్ల గుడిలోకి కాళ్లుమోపే పరిస్థితిలేకపోవడం దారుణమన్నారు. పండుగలు పబ్బాలు ఉత్సవాలలో దళితులు పాల్గొనే పరిస్థితిలేదన్నారు. దళిత యువత ప్రశ్నిస్తేదాడులు కొనసాగుతున్నాయని ఆవే దన వ్యక్తంచేశారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని ఇది అత్యంత శోచనీయమని విమర్శించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ మండలప్రధాన కార్యదర్శి రాము, నాయకులు కృష్ణ, నాగరాజు, రామచంద్రయ్య, లక్ష్మ ణ్, వెంకటయ్య,రాముడు, బహు గుణ, జంగయ్య, పరుషరాముడు, మశన్న, పరమేశ్వర్ పాల్గొన్నారు.

## గ్రూప్–2 పరీక్షల్లో 5032 మంది అభ్యర్థులు గైర్హాజరు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ద్వారా నిర్వహిస్తున్నగ్రూప్2 పరీక్షల్లో రెండోరోజు సోమవారం ఉదయం పేపర్3,మధ్యాహ్నం పేపర్4 నిర్వహించగా గ్రూప్ 2 పరీక్షలు పకడ్బందీగా ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణంలోని సాధనడిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న రెండోరోజు గ్రూప్2 మూడోపేపర్ పరీక్షాకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి అవాంచనీన సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ సందర్భంగా 32 పరీక్షకేంద్రాలవద్ద అధికారులు 144సెక్షన్ అమలు చేశారన్నారు. జిల్లాలోని 32 పరీ క్షకేంద్రాల్లో మొత్తం 9731మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా సోమవారం పేపర్3కు ఉదయం 4699 మంది హాజరయ్యారన్నారు. 5032 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని , 48శాతం హాజరుశాతం నమో దైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 4వపేపర్‌కు 4699మంది అభ్యర్థులు హాజరుకాగా 5032మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

# సిఎం కప్ జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం






రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా పేరు నిలపాలి

చదువుతో పాటు క్రీడలలో పాల్గొనాలి

కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం సి.ఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణంలో స్టేడియం గ్రౌండ్‌లో సి.ఎం.కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు తో పాటు క్రీడలలో పాల్గొనాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు సంపూర్ణ వ్యక్తి త్వానికి దోహదం చేస్తామన్నారు. సిఎంకప్ జిల్లా స్థాయి పోటీలలో విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రాణించి జిల్లా కు పేరు తీసుకురావాలని కోరారు. ఈ నెల 19 వరకు జిల్లా స్థాయి పోటీలు, ఎంపిక నిర్వహిస్తున్నట్లు, 20న ఉమ్మడి జిల్లా కు సంబంధించిన హ్యాండ్ బాల్, వాలీబాల్ పోటీలు మహబూబ్‌నగర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ, నెట్ బాల్ పోటీలను జిల్లాలో నిర్వహించన్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ 36 క్రీడల్లో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబలోని విద్యార్థులను ప్రోత్సహించి వారి ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీసుకు వెళ్లెందుకు ప్రభుత్వ ప్రాధాన్యత నిస్తోందన్నారు. తొలత జిల్లా కలెక్టర్ క్రీడా పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొదటి రోజు కబడ్డీ, ఖో ఖో, నెట్ బాల్, బేస్ బాల్, సాఫ్ట్ బాల్, కిక్ బాక్సింట్, బాక్సెట్ బాల్ 8 క్రీడలలో పోటీలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ ఎస్‌జిఎఫ్ కార్యదర్శి శాంత బాయి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కురుమూర్తి గౌడ్, వైస్ ప్రెసిడెంట్ జాకీర్, నెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విక్రమ్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఖాజా, పిఈటిఎ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇండ్ల సర్వే

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా పగడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామం హరిజన వాడలో కొనసాతున్నఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సర్వే కొనసా గుతోందని ప్రతి రోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్‌లైన్ విధానం ద్వారా పంపించడం జరుగుతుందన్నారు. హరిజన వాడలోనిఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలాజరుగుతుందని ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్, ఇడిఎం విజయ్, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా సింగారంచౌరస్తా వద్ద గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని పక్కనే ఉన్న డిఆర్డిఒ కార్యాలయాన్ని సోమవారం ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిగతా స్టాఫ్ ఎవరెవరు వచ్చారని అడిగి తెలుసున్న కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు.

## డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంతో పాటు ఆత్మకూరులోనూ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాకు మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి వినతి పత్రం అందించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కార్యాలయంలో దామోదర్ రాజనర్సింహ్మాను కలిసి మక్తల్ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు సుమారు 100కు పైగా కిలో మీటర్లు ప్ర యాణించి డయాలసిస్ సేవలు పొందాల్సి వస్తుందని, ఇది డయాలసిస్ రోగులకు చాలా ఇబ్బందిగా మారిందని తెలియజేశారు. వీలైనంత త్వర గా డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు కోసం కావాల్సిన చర్యలను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. త్వరగా డయాలసిస్ సెంటర్లు ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మాకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజావాణికి 21 దరఖాస్తులు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలనుంచి 21 ఫిర్యా దులు వచ్చాయని వెంటనే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశిం చారు. వివిధ శాఖలకు సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదు అందగా మిగిలిన ఫిర్యాదులు రెవెన్యూశాఖకు సంబంధించిన ఫిర్యాదులుగా తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ చెన్నకిష్టయ్య, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని వినతి

**ప్రజాపక్షం/వెల్దండ:** తమకు న్యాయం చేయాలని సోమవారం ప్రజావాణిలో మండలపరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన కుందేళ్ల పద్మ వినతి పత్రం అందజేశారు. కొట్ర గ్రామానికి చెందిన కుందేళ్ల అంజయ్య ఇద్దరు భార్యలు, నలుగురు కుమా ర్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గతకొన్నిరోజులక్రితం కుమారుడైన నవీన్‌కుమార్‌కు మొత్తం భూమి 4ఎకరాల 04 గుంటల గిఫ్టుకింద పేరా ఇచ్చాడు. నవీన్‌కుమార్ అనారోగ్యానికి గురై మృతిచెందాడు. అతని భార్య రాధిక విరసత్‌కింద దరఖాస్తు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రాగా ఈభూమిలో మాకు భాగం ఉందని రాధికపేరుమీద చెయొద్దని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకొన్నట్లు తెలిపారు. దీంతో రాధిక కోర్టుకు వెళ్లారని, అంజయ్య రెండోభార్య పద్మ ఆ భూమి నమ్ముకొని ఉన్నామని ఇద్దరికి సమానభాగం చేయాలని ఈ సమస్యను పరిష్కరించి మమ్మల్ని ఆదుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## రాష్ట్రమంతా ఒకే మెనూ అమలు చేయాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ టౌన్ :** రాష్ట్రమంతటా ఒకే డైట్‌మెనూ అమలు చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సంఘం మురళి అన్నారు. రాష్ట్రప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న అన్నిరకాల రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశా లల్లో సైతం డైట్‌చార్జీలు మెనూ ఒకేలా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌టియు భవనంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తశ్రీధర్‌రావుతో కలిసి వారు మాట్లాడుతూ విద్యార్థులందరిని తారతమ్యాలు లేకుండా ఒకేలా పరిగణించా లన్నారు. సాంఘిక సంక్షేమమైనార్టీ మోడల్ కేజిబివి తదితర హాస్టల్లో ఒకలా వీటికిభిన్నంగా నాన్‌రెసిడెన్షియల్ మెనూ ప్రభుత్వ పాఠశాలల్లో మరోలా వేర్వేరుగా డైట్‌చార్జీలు పాటించడంవల్ల విద్యార్థుల మధ్య అనేక అంతరాలు ఏర్పడి విద్యాప్రమాణాల మీద ప్రభావం చూపుతున్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే పునరాలోచించి అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఒకేవిధంగా మెనూ ఉండేలా చూడాలని ఆయన కోరారు.

## పరీక్షా కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/నారాయణపేట :** జిల్లా కేంద్రంలో రెండో రోజు సోమవారం జరుగుతున్న గ్రూప్–2 పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు.స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రానికి వెళ్లిన ఆమె రెండో రోజు పరీక్షకు ఎంత మంది అభ్యర్థులు హాజరయ్యారని అడిగి తెలుసుకున్నారు. ఆదివారం పరీక్ష కంటే సోమవారం జరిగే పరీక్షకు చాలా మంది అభ్యర్థులు గైర్హాజర్ అయినట్లు అక్కడి అధికారి కలెక్టర్‌కు తెలిపారు. సోమవారం కేవలం 41 శాతమే హాజరయ్యారన్నారు. బయోమెట్రిక్ తదితర విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు.

## కొనసాగుతున్న నిరవధిక సమ్మె




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** విద్యాశాఖ సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 7వరోజు కొనసాగుతుంది. పట్టణంలోని పాతకలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ఈనిరవధిక సమ్మెకు సోమవారం ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు పద్ధతి లేకుండా రెగ్యులర్ చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నా రు. జీవితబీమా, ఆరోగ్యబీమా, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా వర్తింపచేయాలన్నారు. ఎన్నోసంవత్సరాలుగా చాలీ చాలనీ జీతాలో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని అన్నారు. వెంటనే సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్‌చేయక పోతే పెద్ద ఎత్తున అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివ శంకర్, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, ఎఐటియుసి జిల్లా నాయ కులు కపిలవాయి గోపిచారి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

## కొద్ది వారాలలో బీజింగ్‌కు ఎన్‌ఎస్‌ఎ అజిత్‌దోవల్

ప్రత్యేక ప్రతినిధుల చర్చలకు ఆయన నాయకత్వంలో భారతప్రతినిధి బృందం చైనా పయనం

ఐదు సంవత్సరాల విరామం తర్వాత నూతన ఆవిష్కరణకు మార్గం సుగమం

**న్యూఢిల్లీ :** భారత్‌చైనా మైత్రి బలపడే మార్గం సుగమం అవుతోంది. దాదా పు 5సంవత్సరాల విరామం తర్వాత ప్రతేక ప్రతినిధుల చర్చకు ఒక నూతన ఆవిష్కరణ చోటుచేసుకోనుంది. చైనాతో ప్రత్యేక ప్రతినిధుల సంభాషణ ప్రతినిధి బృందానికి భారత్ తరపున జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఎ) అజిత్‌దోవల్ నాయకత్వం వహించబోతున్నారు. సోమవారం ఈ విషయాన్ని అధికారవర్గాలు వెల్లడించాయి. ప్రత్యేక ప్రతినిధుల సంభాషణ చివరి రౌండ్ న్యూఢిల్లీలో 2019 డిసెంబరులో జరిగింది. అక్టోబరు 23న కజాన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా ప్రధాని జీ జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన సమావేశంలో డైలాగ్ మెకానిజంను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నారు. 23 రౌండ్ల ప్రత్యేక ప్రతినిధుల చర్చలకు హాజరయ్యేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ త్వరలోనే చైనాకు వెళుతున్నట్లు సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. డిసెంబరు నెలాఖరులో లేదా జనవరి ప్రారంభంలో ప్రత్యేక ప్రతినిధుల చర్చలు జరుగవచ్చని ఆ అధికార వర్గాలు వెల్లడించాయి. డిసెంబరు 5న జరిగిన దౌత్యపరమైన చర్చల్లో భారత్‌చైనా రాబోయే ఎస్‌ఆర్ సంభాషణకు సిద్ధమయ్యాయి. చర్చలకు భారతదేశ ప్రతినిధి అజిత్‌దోవల్ కాగా, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌వై నాయకత్వం వహించనున్నారు.



## సిపిఐలో చేరికలు

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలో సిపిఐ బలపడుతుందని చెప్పడానికి పార్టీలో చేరికలె నిదర్శనమని మండల కార్యదర్శి జిల్లా యాదగిరి అన్నారు. మండలంలోని సల్గునూరు గ్రామంలో ఆదివారం రాత్రి మండల కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో సభ్యత్వాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు సల్కునూరు గ్రామపంచాయతీ కమ్యూనిస్టు పార్టీ కంచు కొట అన్నారు. గతంలో సిపిఐలో పని చేసిన గొప్ప గొప్ప నాయకులందరూ సల్కునూరు గ్రామం నుంచే నాయకత్వం వహించారని అన్నారు.100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ విజయోత్సవాల సందర్భంగా ఈనెల 30న జరగనున్న భారీ బహిరంగ సభకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కళాకారుల కన్వీనర్ వెన్నెల వెంకన్న, దళిత హక్కుల నాయకులు వల్లంపట్ల వెంకన్న, తోపాటు కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నేడు(మంగళవారం) నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమానికి విద్యార్థి లోకం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి చేస్కున్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి, పెండింగ్‌లో ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్, కాస్మోటిక్ చార్జీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు నాయకులు సూరం విజయ్, వినయ్, మాతంగి విజయ్, వివేక్, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## చిన్నారులను అబ్బురపరిచేలా క్వారి బేబి ఫొటో స్టూడియో



**ప్రజాపక్షం/సూర్యాపేట:** చిన్నారులను అబ్బురపరిచేలా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన క్వారి బేబి పోటో స్టూడియో ఉందని ఫోటో గ్రాఫర్ల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్వారి బేబి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షులు కూకుట్ల లాలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా చిన్నారులు పోటోలు దిగాలంటే తల్లిదండ్రులు, ఫోటోగ్రాఫర్‌ను ఎంతో ఇబ్బంది పెడతారని అలాంటి చిన్నారుల దృష్టిలో ఉంచుకొని వారికి నచ్చే విధంగా కొన్ని సెట్టింగ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ పోటో స్టూడియోను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు రంజిత్ కుమార్, పట్టణ అధ్యక్షులు కొక్కు శేఖర్, ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు రాపర్తి మహేష్ గౌడ్, రవి, నజీర్, సాయి రెడ్డి, పాషా, జానీ, రాములు, నగేష్, వెంకటేష్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో జైలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వరకట్న వేధింపుల కేసులో ఫ్యామిలీ కోర్టు నిందితులు భర్తకు రెండు సంవత్సరాల ఏనిమిది నెలలు అత్తకు ఒక సంవత్సరం జైలు శిక్ష జరిమానా విధించినట్లు జిల్లా జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. బాధితురాలు నకిరేకల్ పట్టణానికి చెందిన ఏలే భావాని, నల్లగొండ పట్టణం శ్రీనగర్ కాలనీకి చెందిన ఏలె హరీష్ తో 2017 లో వివాహం చేసుకోగా వివాహ సమయంలో పెద్దల సమక్షంలో కొంత కట్నం ఇవ్వగా అనంతరం కొన్ని రోజుల తర్వాత నిందితుడు చెడు వ్యసనాలకు అలవాటు పడి అదనపు కట్నం కొరకు మానసికంగా శారీరకంగా వేదించగా నకిరేకల్ పోలీస్ స్టేషన్ నందు నిందితుల పైన కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సిఐ వి బాలగోపాల్ ఛార్జ్ షీట్ కోర్ట్ కి అందజేయగా సోమవారం ఫ్యామిలీ కోర్టు జడ్జి దుర్గా ప్రసాద్ నిందితుడు భర్తకి (2) సంవత్సరాల 8 నెలల జైలు 5000 రూపాయల జరిమానా, అత్తకు 1 జైలు శిక్ష సంవత్సరం 5000 రూపాయలు విధించడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి సాక్షాలను కోర్టుకి అందజేసి నిందితుని శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సిఐ వి బాలగోపాల్,ఎపిపి జవహర్ లాల్, ఎస్‌ఐ రాజశేఖర్ కోర్ట్ కానిస్టేబుల్ సుధాకర్, కోర్టు లైనింగ్ ఆఫీసర్స్ హెడ్ కానిస్టేబుల్ నరేందర్, కానిస్టేబుల్ మల్లికార్జున్‌లను జిల్లా ఎస్‌పి అభినందిచారు.

## ఎడమ కాలువకు 'ఆన్‌ఆఫ్ పద్ధతి' ద్వారా నీటి విడుదల

**ప్రజాపక్షం /నందికొండ:** నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని ఆన్ ఆఫ్ పద్ధతి ప్రకారం విడుదల చేయనున్నట్లు నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీధర్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. రబీ ఆయకట్ట రైతులు అందరూ ఆరుతడి పంటలు వేసుకొని నీటిని వృధా చేయకుండా చివరి భూముల వరకు నీరు అందే విధంగా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఆన్ ఆఫ్ పద్ధతి అనుసరిస్తున్నట్లు అన్నారు. అందుకు రైతులందరూ సహకరించాలని ఆయన కోరారు. క్రింది షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేయటం జరుగుతుందన్నారు.



# వీరచరిత్ర సిపిఐది

### డిసెంబర్ 30న జరుగనున్న బహిరంగ సభను జయప్రదం చేయండి

### సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చండూరు:** స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంలో అనేక మంది ఉరికంబాలు ఎక్కి ప్రాణ త్యాగాలు చేసిన వీరచరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి దక్కిందని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. అలాంటి భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభ నిధి వసూలు కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం చండూరు మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి నిధి వసూలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల పార్టీ కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు , బరిగెల వెంకటేష్ , బండమీది వెంకన్న, చెడుబుద్ధి ఊషయ్య, ఇరిగి సంజీవ పాల్గొన్నారు.

### సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి





**ప్రజాపక్షం/చింతపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని పికె మల్లేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఆ పార్టీ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. పికె మల్లేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి యాదగిరిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 26న దేవరకొండలో రెడ్‌షర్ట్ వాలంటరీ కవాతును విజయవంతం చేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, వేముల బుచ్చయ్య, మల్లోజు శేఖరాచారి, అయితపాక సైదులు, ఘనిపల్లి జితేందర్, మిడిదొడ్డి రామకృష్ణ, మల్లయ్య, పర్వతాలు, శాయిలు, ఎల్లమ్మ, చంద్రకళ, రామచంద్రం, జంగయ్య, కిష్టయ్య, గోపాల్, వెంకటయ్య, శివ, లక్ష్మ మ్మ, లాలయ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/(నల్లగొండ)కనగల్:** భారత కమ్యూనిస్టు పార్టీ100 వసంతాల ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ నల్లగొండ నియోజకవర్గ ఇన్చార్జి పబ్బు వీరస్వామి కోరారు. కనగల్లు మండల కేంద్రంలో మండల కౌన్సిల్ సమావేశం దోటి పాండరి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి 2025 డిసెంబర్ 26 నాటికి 100 సంవత్సరంలోకి అడుగుపెడుతున్నదని తెలిపారు. సిపిఐ 100 వసంతాల ఉత్సవాలు ప్రారంభ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యులు తొరకొప్పుల నాగయ్య, జోగు సురేందర్, నరసింహ, కృష్ణ పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాలి




### సిఎం, కలెక్టరేట్ ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ప్రజల నుండి విన్నపాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం, కలెక్టరేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 79ఫిర్యాదులు అందాయని అందులో అధిక శాతం తహసీల్దార్‌లకు, భూ సమస్యలకు సంబంధించి 22 దరకాస్తులు ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు అందజేసిన దరఖాస్తును అధికారులు పరిశీలించకపోతే అందుకు సంబంధించిన కారణాలను దరఖాస్తుదారునికి లిఖీతపూర్వకంగా ఇవ్వాలన్నారు. ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించిన అధికారులకు కలెక్టర్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిషత్ సిఈఓ వివి అప్పారావు, డిఎఫ్‌ఓ సతీష్ కుమార్, సిపిఓ ఎల్ కిషన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం, డిఈఓ అశోక్, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం సీతారాం నాయక్, డిటిడిఓ శంకర్, డిడబ్ల్యూఓ నరసింహారావు, అధికారులు శ్రీనివా స్ నాయక్, లత, అనసూయ, బాపూజీ పాల్గొన్నారు

# అవసరమైతే నిధులు మంజూరు చేస్తా

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన జాతీయ క్యాన్సర్, మధుమేహ,గుండె నియంత్రణ కేంద్రంలో అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.సోమవారం ఆమె జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న జాతీయ క్యాన్సర్ ,మధుమేహ,గుండె నియంత్రణ కేంద్రాన్ని తనిఖీ చేసి సౌకర్యాలను పరిశీలించారు.ఈ కేంద్రంలో ఫిజీషియన్ తో పాటు, ఆంకాలజిస్ట్,గుండె వైద్య నిపుణులు,అవసరమైన అన్ని మౌలిక వసతులను, స్పెషలిస్టును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇందుకు అవసరమైతే నిధులను మంజూరు చేస్తామని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి లోని క్యాజువాలిటీ,సి టి స్కాన్, ఎస్ఎన్‌సియు, ఎమర్జెన్సీ, ఐసీయు వార్డులను పరిశీలించారు.ఐసియు ,ఎమర్జెన్సీ వార్డుల్లో 24 గంటల సేవలందించే విధంగా వైద్యులు అందుబాటులో ఉండాలని,ఆసుపత్రి ద్వారా మెరుగైనసేవలు అందించే విధంగా చూడాలని చెప్పారు.ఆస్పత్రికి వస్తున్న అవుట్ పేషెంట్ల వివరాలు,ఐసియు ,ఎస్ ఎన్ సియు ద్వారా ఆనందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు . డయాగ్నిస్టిక్, ల్యాబ్ పరీక్షల ను పరిశీలించారు.ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ అరుణకుమారి, డిఎంహెచ్‌ఓ పుట్లశ్రీనివాస్, డిప్యుటీ డి ఎం హెచ్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు ఉన్నారు.



### క్రీడా నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలి

**ప్రజాపక్షం/నల్లగొండ :** సిఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులు మంచి నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సోమవారం ఆమె నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 16 నుండి 21 వరకు నిర్వహించనున్న సిఎం కప్ క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అంతేకాక సిఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ సూచకంగా క్రీడా పథకాన్ని ఎగురవేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడమే సిఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. అందువల్ల క్రీడాకారులు వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి పాల్గొన్నారు.





## సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్ కేర్ సస్పెన్షన్

### ప్రిన్సిపాల్‌కు షోకాజు నోటీసులు: కలెక్టర్

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కేర్ రమేష్ సస్పెండ్ చేయడమే కాకుండా ప్రిన్సిపాల్‌కు జిల్లా కలెక్టర్ షోకాజు నోటీసులు జారీ చేశారు. సోమవారం రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ తనిఖీ చేయగా వంటశాల అపరిశుభ్రంగా ఉండడం, భోజనంలో మెనూ పాటించకపోవడం, వంటశాలో మెనూ బోర్డును ఏర్పాటు చేయకపోవడం, విద్యార్థులకు అందించే గుడ్లు సరిగ్గా లేకపోవడంతో పాటు విద్యార్థుల చేత పని చేయించడం కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ విషయమై ఆగ్రహం చెందిన కలెక్టర్ వెంటనే కేర్ రమేష్‌ను సస్పెండ్ చేయడంతో పాటు సమచారం ఇవ్వకుండా ఇతరులకు బాధ్యతలు అప్పగించకుండా గైర్ హాజరైన ప్రిన్సిపాల్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు, మెనూ పాటించకపోతే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ నెల 15 ఆదివారం రోజు జిల్లా కలెక్టర్ తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌ను సందర్శించి వారికి అందిస్తున్న భోజనాన్ని పరిశీలించగా నాణ్యతా ప్రమాణాలు సరిగ్గా ఉన్న విషయాన్ని గమణించి రోజు ఈ విధంగానే విద్యార్థులకు భోజనం అందించాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి విద్యార్థులకు సరియైన భోదన అంధించాలని తెలిపారు.

ఆదివారం సందర్శించిన కలెక్టర్ ఇక సందర్శనకు రాడు అన్న దీమాతో నిర్లక్ష్యంగా విద్యార్థులకు వండి వార్చడం, పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో రెసిడెన్షియల్ స్కూల్ నిర్వహణలో డొల్లతనం బయటపడింది. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రజల ప్రాణాలు కాపాడండి



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని భువనగిరి గజ్వేల్ ప్రధాన రహదారి, జేతిరంతండా, సంగ్య తండా మధ్య మార్గంలోని కెనాల్ మూల మలుపు వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో ఇద్దరు యువకులు చనిపోవడం జరిగిందని మండి పడుతు రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించి ప్రజలు ప్రయాణికుల ప్రాణాలు కాపాడండి మహా ప్రభో అంటూ చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్ నాయక్ సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. ముల్కపల్లి శివారు మూలమలుపులో అత్యంత భయానక స్థితిలో పరిస్థితి ఉందని, గతంలో రెండు, మూడు లారీలు కాలువలోకి దూసుకెల్లడం జరిగిందని, ఆటోలు స్కూటర్లు, బైకులు పడి కాళ్ళు చేతులు విరిగి ప్రమాదాల బారినపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే రైతుల బావులు, అదేవిధంగా స్కూల్ బస్సులు, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం ఇదని ఇన్ని ప్రమాధాలు జరుగుతున్నా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఇదే రోడ్డుపై అనేకసార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేశాం కానీ ఏలాంటి ఫలితం లేదని అన్నారు. ప్రమాదకరమైన కల్వర్టుల వద్ద పటిష్టమైన గోడలు నిర్మించాలని, బారికేడ్స్, రేడియంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

# పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకూ అప్రమత్తం




### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణ కేంద్రంలోని ది నల్లగొండ పబ్లిక్ పాఠశాల నందు ఏర్పాటు చేసిన గ్రూప్ 2 పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పరిశీలించి మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ 2 పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకి ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా 87 పరీక్ష కేంద్రాల వద్ద దాదాపు 600 మంది సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ అమల్లో ఉన్నందున ఎవరు గుంపులుగా ఉండకుండా చూడాలని, పోలీసు అధికారులకి సిబ్బందికి సూచించారు. అందరు బాధ్యతగా పని చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష పత్రాలు స్ట్రాంగ్ రూముకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు,అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగిందన్నారు.

### పరీక్ష కేంద్రం తనిఖీ :సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం, పట్టణంలో 28 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్2 పరీక్షలు రెండవ రోజు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పేపర్3, 4 పరీక్షలకు గాను 7941 మంది హాజరు కావాల్సి ఉండగా 3010 మంది హాజరై 4931 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాగా పలు పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, రిజనల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, ఎంఈవో బాలునాయక్, ధర్మానాయక్, కృష్ణకాంత్‌నాయక్, శివకుమార్, సీఐ నాగరాజు, ఎస్‌ఐ శోభన్‌బాబు, వీరశేఖర్, సుధీర్, నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



### గ్రూప్2 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** గ్రూప్ 2 పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం గ్రూప్ 2 పరీక్షలు జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలతో పాటు జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు జిల్లాలోని అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయడం అభినందనీయమన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సూర్యాపేట డిఎస్‌పి రవి, పట్ట ణ సిఐ వీర రాఘవులు, రూరల్ సిఐ రాజశేఖర్, బందోబస్తు ఎస్‌ఐలు ఉన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులపై ఆమె సమీక్షించారు. రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ , వ్యవసాయ తదితర శాఖల వద్ద ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్లో ఉన్నాయని, ఈ శాఖల అధికారులు ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని చెప్పారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, ముఖ్యంగా ఫిర్యాదుల పరిష్కారం వేగంగా ఉండాలని అన్నారు. వచ్చే వారం నాటికి అన్ని శాఖలు సాధ్యమైనంత ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం క్రిస్మస్ వేడుకలలో భాగంగా అన్ని నియోజకవర్గాలలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విందు ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించి ఆర్డీవోలు, తహసిల్దారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎవరైనా కొత్తగా దరఖాస్తులు ఇస్తే ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తీసుకోవాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోకూడదని ఆమె కోరారు. కాగా ఈ సోమవారం (50) మంది ఫిర్యాదు దారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డిఆర్‌ఓ అమరేందర్, జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



## గంగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** మార్గదర్శి కాలనీకి చెందిన కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి సతీమణి సత్యమ్మ ఇటీవల మరణించడంతో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం వారి నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. నియోజకవర్గం బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కంచర్ల శేఖర్ నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, జగన్మోహన్ రెడ్డి, జాహిద్, శ్యాం గుప్తా, అనురాధ ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# మహానగరి

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/యాచారం :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి ఆదుకోవాలని మేడిపల్లి సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇండ్లు ఇస్తుందని గ్రామాల్లోని పేదలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామాల్లో అధికారులు నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. కాంగ్రేస్ ప్రభుత్వంపై గ్రామాల్లో పేదలు ఎన్నో ఆశలు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు, రాజకీయ ఒత్తిడులకు గురి కాకుండా నిజమైన అబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.

## ఘనంగా సిపిఐ వంద వసంతాల ఉత్సవాల నిర్వహణ : జంగయ్య



**ప్రజాపక్షం/నార్సింగి:** సిపిఐ వంద వసంతాల ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం శంషాబాద్ మండల కేంద్రంలో సిపిఐ వంద సంవత్సరాల చరిత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ దేశంలో 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో సిపిఐ పార్టీ ఏర్పడిందన్నారు. 100 వసంతాలలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజలకు వివరించడానికి ప్రతి సిపిఐ కార్యకర్త ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో చేవెళ్ల , ఎల్బీనగర్ ప్రాంతాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని మండలా కేంద్రాలలో సభలు ప్రదర్శనలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డి, ఓ యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్‌రెడ్డి, టి.రామకృష్ణ, బాతరాజు నరసింహ, ఎం.ప్రభులింగం, బుద్ధుల గంగయ్య కౌన్సిలర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, ఆర్.యాదగిరి, ఎంఏ రియాజ్, మండల కార్యదర్శులు నర్రగిరి, స్వామి, పిసుధీర్, జిల్లా సమితి సభ్యుడు చందు యాదవ్, జిల్లా నాయకుడు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మూసీ అభివృద్ధికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్ నగర్:** మూసీ అభివృద్ధి పేరుతో పేద, మధ్య తరగతి ఇండ్లు కూలగొడతాము అంటే ఊరుకునేది లేదని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం చైతన్యపురి డివిజన్ పరిధిలోని భవానినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తానన్నారు. అలాగే మూసీనది ప్రక్షాళనలో భాగంగా మూసీ అభివృద్ధికి అండగా ఉంటామన్నారు. మూసీ అభివృద్ధి పేరుతో పేద, మధ్య తరగతి ఇండ్లు కులగొడతాము అంటే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షులు జీ.లక్ష్మినారాయణ, సెక్రటరీ సంతోష్ కుమార్, అదనపు జనరల్ సెక్రటరీ గిరిధర్, కోశాధికారి అశోక్, ఉపదక్షులు తుల్జా ప్రకాష్, జీ.తులసి కృష్ణ గౌడ్, తిరుపతి స్వామి, శ్రీనివాస చారి, మల్లారెడ్డి, ఆదినారాయణ, నర్సింహారెడ్డి, శేషకుమారి, వంశీకృష్ణ, సురేష్, మురళీధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారాకాలనీ సమస్యలు పరిష్కరిస్తా

హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బంజారా కాలనీ సమస్యలు త్వరలోనే పరిష్కారం దిశగా కృషి చేస్తామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని బంజారా కాలనీలో మార్నింగ్ వాక్ నిర్వహించి, కాలనీల్లో పర్యటించి పలు సమస్యలు తెలుసుకన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ స్తంభాలు, విధీ లైట్లు త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయలు కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భాగ్యలత సాయి కాలనీలో శానిటేషన్ అధికారులు పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని, చెత్త కుప్పలు పెరుగుతుంటే కాలనీలు వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ తెలిపారు. పారిశుద్ధ కార్మికులు తక్షణమే చెత్తలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ యాదయ్య, కాలనీ వాసులు మోహన్, భగవాన్, రమేష్, కృష్ణ, బిజెపి నాయకులు బాలు నాయక్, గోవింద చారి తదితరులు పాల్గొన్నారు

## పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** పారిశుద్ధ్యం పట్ల అశ్రద్ధ వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. సోమవారం హయత్ నగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి కార్యాలయంలో పారిశుద్ధ్యంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని అనేక కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని, కాలనీ వాసులు అనేక మార్లు ఫిర్యాదు చేసిన పారిశుద్ధ్య అధికారులు పట్టించుకోకుండా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని అధికారులపై కార్పొరేటర్ మండిపడ్డారు. కాలనీల్లో చెత్త ఎక్కడ వేసిన కుప్పలు అక్కడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో, రోడ్లపై చెత్త కానవస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి డిఇ దామోదర్ రావు, శానిటేషన్ డిఇ నీలిమ, రాంకీ జోనల్ మెడ్ అధికారి వేణు కుమార్, విఓ యాదగిరి, యుబిడి మేనేజర్ మేధ, ఎస్‌ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ యాదయ్య, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శరత్ కుమార్, కామేష్, పవన్‌రెడ్డి, కిషోర్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రమాణాలు కలిగిన పరికరాలు వినియోగం

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐఎస్‌ఐ ప్రమాణాలు కలిగిన వస్తువులను వినియోగించడం ద్వారా పనుల్లో నాణ్యత పెరుగుతుందని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అన్నారు. ఏవైనా వస్తువుల నాణ్యతపై అనుమానాలు ఉంటే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే బ్యూరో ఆఫ్ ఇండియాన్ స్టాండర్డ్స్(బిఐఎస్) వాటి నాణ్యతను తెలియచేస్తుందని తెలిపారు. జలమండలి చేపట్టే పనుల్లో నాణ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జలమండలి అధికారులకు బిఐఎస్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి క్షేత్రస్థాయి ఇంజనీర్ల నుంచి జలమండలి ఉన్నతాధికారుల వరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. జలమండలి సేవలు, పనుల్లో నాణ్యతను మెరుగుపరుచుకునేందుకు ఈ అవగాహన కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జలమండలి చేపట్టే పనుల కోసం ప్రొక్యూర్ చేసే యంత్రాలు, ఎలక్ట్రికల్ సామగ్రి, పైపులు, మాన్ హోల్స్, వాల్వ్‌లు, ఇతర పరికరాలు, పనిముట్లు వంటివి ఐఎస్‌ఐ నాణ్యతా ప్రమాణాల మేరకు ఉన్నాయా, లేదా అనేది ఎలా తెలుసుకోవాలో జలమండలి అధికారులకు బిఐఎస్ అధికారులు అవగాహన కల్పించారు.

## ఆన్‌లైన్‌లో పూడికతీత పనుల నమోదు

జలమండలి ఎండి మయాంక్ మిట్టల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో చేసిన పూడికతీత పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జలమండలి ఇడి మయాంక్ మిట్టల్ అన్నారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఇడి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటిదాకా 14వేల ప్రాంతాల్లో 1,758 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపులైన్‌కు పూడిక పనులు నిర్వహించినట్లు తెలిపారు. అటు 1 లక్షా 40 వేల మ్యాన్ హోళ్లను శుభ్రం చేసినట్లు వెల్లడించారు.ఈ డ్రైవ్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు మంచి పనితీరు కనబర్చాయని ప్రశంసించారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చెయ్యాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే కొనసాగించాలన్నారు. వాటిని నిర్మించుకోవాలని వినియోగదారులకు సూచించారు. నిర్మించని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఇఎన్‌సి డైరెక్టర్ రెవిన్యూ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్లు స్వామి, అమరేందర్‌రెడ్డి, సిజిఎంలు, జిఎంలు, డిజిఎంలు, మేనేజర్లు, బిఐఎస్ అధికారులు పాల్గొన్నారు.

## విశ్వశాంతికి పత్రీజీ ధ్యాన మహాయాగం

దిపిరమిడ్ స్పిరిచువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విశ్వ శాంతిని కాంక్షిస్తూ పత్రీజీ ధ్యాన మహాయాగం3 కార్యక్రమం ఈ నెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నామని ది పిరమిడ్ స్పిరిచువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో విజయ్ భాస్కర్‌రెడ్డితో పాటు ట్రస్టు ప్రతినిధులు ధ్యాన మహాయాగం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వశాంతికి, సకల ప్రాణి కోటి రక్షణకై పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీని పత్రీజీ స్థాపించారని తెలిపారు. ధ్యానానికి సంగీతాన్ని జోడించిన పత్రీజీ ప్రపంచ వ్యాప్తంగా ధ్యాన ప్రచారం చేశారని చెప్పారు. కడ్తాల్ మహేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుండి ధ్యానులు పాల్గొంటారని, వీరికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో పిరమిడ్ మెడిటేషన్ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ బుద్ధ, సేత్ బాలకృష్ణ, మారం శివ ప్రసాద్, నిర్మల, సాంబశివరావు, దూళిపూడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టొద్దు



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ప్రజావాణి ఫిర్యాదులు, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 67 దరఖస్తులు అందాయన్నారు. జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇంటింటి సర్వేను ప్రణాళికా పరంగా నిర్వహించాలని, మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావు లేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ యాప్ లో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా ప్రవేశపెట్టిన డైట్‌ను సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు జరిగేలా అధికారులు పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



### గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతం

జిల్లాలోని శంషాబాద్ శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలతో పాటు వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ జిల్లాలో గ్రూప్–2 ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ వెల్లడించారు.

## సంప్రదాయాల పరిరక్షణకు కృషి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** హిందూ సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రామేశ్వరంలో ఏళ్ళ చరిత్ర కలిగిన శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారు జామున పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనురాధ కుటుంబ సమేతంగా దేవాలయానికి చేరుకొని అభిషేకం, కుంకుమార్చన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం ఫలికారు. ఎంతో విశిష్టత కలిగిన శివలింగానికి అభిషేకం చేయడంతోపాటు పార్వతీమాత వద్ద కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ సంస్కృతిక, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శ్రీ ఉత్తర రాలింగేశ్వర స్వామి దేవాలయానికి ఎంతో చరిత్ర ఉందని, అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వాములు ఎమ్మెల్యేకు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, లింగారెడ్డిగూడ అశోక్, చేగూరి రాఘవేందర్ గౌడ్, రవికుమార్, మాణిక్యం, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## ఎఆర్ కానిస్టేబుల్‌ను సన్మానించిన మిత్రబృందం సభ్యులు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఏఆర్ కానిస్టేబుల్‌గా నియమితులైన అలీంను మిత్ర బృందం సభ్యులు సత్కరించారు. సోమవారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ అలీంను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలీం 2018, 2020 బ్యాచ్‌లో టిజిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహించారు. 2024బ్యాచ్‌లో సైబరాబాద్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైన సందర్భంగా తన మిత్రబృందం సభ్యులు అభినంధించడంతోపాటు సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన పదవులు పొందేందుకు కృషి చేయాలని, భగవంతుడు అయురారోగ్యాలు ప్రసాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డిగూడ మాజీ ఉప సర్పంచ్ నరేందర్‌రెడ్డి, షకీర్ పాషా, నీరటి వాసు, మల్లేష్, వీరేష్ గౌడ్, రవి యాదవ్, యాదయ్య, ఖదీర్, జీ తెలుగు జర్నలిస్టు ఖాజాపాషా (లడ్డూ), రవిగౌడ్, హరీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



## అక్రమ కేసులు ఎత్తివేయాలి

బిఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు కామేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని మీర్‌పేట బిఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లెలగూడ అంబేద్కర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా ఈనెల 17న జిల్లెలగూడ అంబేద్కర్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

## రూ.కోటి 25లక్షల విలువ చేసే డ్రగ్స్ సీజ్

విలేకరుల సమావేశంలో వెల్లడించిన రాచకొండ సిపి సుధీర్‌బాబు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌బి నగర్ జోన్ ఎస్ఓటి పోలీసులు, మీర్‌పేట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో పెద్దమొత్తంలో మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి కోటి 25 లక్షల రూపాయల విలువచేసే 53.5 కిలోల పప్పీస్ట్రా డ్రగ్స్‌ను రాచకొండ పోలీసులు సీజ్ చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... ఈజీ మనీకి అలవాటు పడిన నిందితులు నార్కోటిక్ డ్రగ్స్‌ను విక్రయించాలని ప్లాన్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్, బిష్ణోయ్ మంకీలాల్ దాకా రామ్ అనే ముగ్గురు నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూ అనే వ్యక్తి నుంచి పప్పీస్ట్రా మాదకద్రవ్యాలని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాదులో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న రాచకొండ ఎస్ఓటి, మీర్పేట పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ మాదకద్రవ్యాలను లారీలు, బస్సులు, ట్రైన్ ద్వారా నగరానికి తీసుకువచ్చి కస్ట్యూమర్లకు అమ్ముతున్నారని రాచకొండ సిపి చెప్పారు. 2023లో మంకీలాల్ బిష్ణోయ్‌ను హయత్ నగర్ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసినట్టు సిపి సుధీర్‌బాబు తెలిపారు. ఇతనిపై పిడి యాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు. కాగా ప్రధాన పెడ్లర్‌గా ఉన్న పింటూను పట్టుకోవడం కోసం ముమ్మర ప్రయత్నం చేస్తున్నట్లు సిపి స్పష్టం చేశారు. అంతేకాకుండా నగరంలో స్థానిక రిసీవర్సుగా మరో ముగ్గురు ఉన్నారని,వారిని త్వరలో పట్టుకుంటామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. కాగా ఈ పప్పీస్ట్రాను పాలు వాటర్, ఛాయ్‌లో కలుపుకుని తాగుతారని తెలిపారు. కేసు ఇంకా విచారణలో ఉందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని రాచకొండ సిపి సుధీర్ బాబు పేర్కొన్నారు.

### మోహన్‌బాబు అరెస్టు విషయంలో ఆలస్యం లేదు

సినీనటుడు మోహన్‌బాబు అరెస్టు విషయంలో ఎలాంటి ఆలస్యం లేదని, చట్టప్రకారమే అంతా జరుగుతోందని రాచకొండ సిపి సుధీర్‌బాబు తెలిపారు. మోహన్‌బాబుపై ఇప్పటివరకూ మూడు ఎఫ్ఎస్ఐఆర్‌లు నమోదయ్యాయని, మరికొన్ని ఫిర్యాదులకు సంబంధించి మేము ఎఫ్ఎస్ఐఆర్ నమోదు చేయక ముందే మరొకసారి వచ్చి పూర్తి వివరాలు చెబుతామని అంటున్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. చట్టపరంగా ఎలా ముందుకువెళ్లాలో అలాగే వెళ్తాం. మోహన్ బాబును విచారించే విషయంలో మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇప్పటికే మేం నోటీసులు ఇచ్చాం. డిసెంబరు 24 వరకు సమయం అడిగారు. మోహన్‌బాబు వల్ల జర్నలిస్ట్ రంజిత్ గాయపడ్డారు కాబట్టి, సానుభూతితో పలకరించడానికి వెళ్లి ఉంటారు. అయితే చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోవాలో అలాగే తీసుకుంటాం. మరోవైపు కోర్టు కూడా ఆయనకు సమయం ఇచ్చింది. కోర్టు ఆదేశాలను మేం గౌరవిస్తాం. ఈలోగా మరోసారి మోహన్‌బాబుకు నోటీసు ఇచ్చి, గడువు కన్నా ముందే విచారణ చేపట్టవచ్చా? అని కోర్టును అడుగుతాం.కోర్టు ఇచ్చే సూచనలను బట్టి నడుచుకుంటాం అని సిపి తెలిపారు. మోహన్ బాబు దగ్గర ఉన్న గన్స్ ఎవి రాచకొండ కమిషనరేట్ పరిధిలో లేవు. ఆయన వద్ద ఉన్న గన్ చిత్తూరు జిల్లా చంద్రగిరిలో డిపాజిట్ చేశారు. ఇప్పటికే మంచు విష్ణు, మంచు మనోజ్‌లను పిలిచి మాట్లాడాం. ఇద్దరితోనూ బాండ్ కూడా రాయించుకున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే,కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. 24వ తేదీ తర్వాత నోటీసులపై స్పందించకపోతే మోహన్‌బాబును అరెస్టు చేస్తామని చెప్పారు. మరోవైపు జల్పల్లిలో తన నివాసం వద్ద జరిగిన ఘటనపై మోహన్‌బాబు తాజాగా మరోసారి స్పందించారు. తాను ఉద్దేశపూర్వకంగా మీడియా ప్రతినిధిని కొట్టలేదని వివరణ ఇచ్చారు. జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పారు. ఆదివారం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న జర్నలిస్టును మోహన్‌బాబు, మంచు విష్ణు పరామర్శించారు. ఈ సందర్భంగా అతని కుటుంబసభ్యులకు క్షమాపణ చెప్పారు.

## దివ్యాంగులు పనిచేసే చోట ర్యాంపులు

రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** దివ్యాంగులు పని చోట ర్యాంపులు, కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేస్తామని రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలోజిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ,జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత మాట్లాడుతూ దివ్యాంగులు తమకు కేటాయించిన పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారని,వారు పని చోట ర్యాంపులు, కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి మాట్లాడుతూ సంక్షేమ శాఖ తరపున అమలు అవుతున్న పథకాలను దివ్యంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ అన్ని కార్యాలయాలలో వారికి వసతులు కల్పించాలని, అదే విధంగా సదరం సర్టిఫికేట్ ల జారీలో జాప్యం జరగకుండా చూడాలని పిడి డీఆర్డీఏను కోరడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు బాలరాజు గౌడ్, వికలాంగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

## రూ.15 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/నాగారం:** మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 19,20వ వార్డు ఓల్డ్ విలేజ్‌లో మున్సిపల్ సాధారణ నిధులు 15 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులకు చైర్మన్ శంకుస్థాపన చేశారు.రాజకీయలకు అతీతంగా వార్డులను అభివృద్ధికి పాటుపడతానని చైర్మన్ అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,కౌన్సిలర్లు అన్నంరాజు సుమిత్రా సురేష్,శ్రీనివాస్‌గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సంజీవ స్వామి ఆలయంలో పూజలు

**ప్రజాపక్షం /దోమ:** మండల పరిధిలోని దొంగ ఎన్కెపల్లి గ్రామంలో గల సంజీవ స్వామి దేవాలయంలో సోమవారం పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్వామి వారి కరుణ కటక్షాలతో ప్రజలంతా ఆయురోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరాములు, మాదవరెడ్డి, తౌర్యానాయక్, రామకృష్ణ, రామకృష్ణరెడ్డిలతో పాటు తదితరులు పాల్గోన్నారు.

## ప్రజావాణిలో 69 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పరిష్కారానికి తీసుకొని వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి న్యాయం చేకూర్చాలని జిల్లా అదనపు



కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా లా అధికారి చంద్రావతి, ఇతర విభాగాల అధికారులతో కల్సి అర్జీలను స్వీకరిస్తూ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 69 ఫిర్యాదులను స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తూ వాటి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయటంతో పాటు వాటి వివరాలను సంబంధిత ఫిర్యాదస్తులకు తెలియ చేయాలని, పరిష్కరించలేకపోతే దానికి కారణాలను సైతం తెలియచేయాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం కనపరచవద్దని హెచ్చరించారు.




## కరాటేలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కరాటే పోటీల్లో కుషాయిగూడ, చర్లపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆదివారం హైదరాబాద్ జీడిమెట్ల షాపూర్‌లో జరిగిన నాల్గవ జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించిన చరణ్ సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. వీరిలో అద్వైత్, దివ్యశ్రీజోషి, శ్రీనిష్, వరణి, భువన, సహర్ష్‌రెడ్డిలు బంగారు పతకాలు, బ్రహ్మణి, నిశాంత్, తేజస్, శతాన్వి, వైభవ్‌జోషి, కార్తీకలు వెండి పతకాలు, అరాధ్య, శ్రీహిత, ధృకేఆత్రేయ, కింషక్‌సింగ్‌లు కాంస్య పతకాలు సాధించారని కరాటే మాస్టర్ బుడిగే రమికుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు దూరంపూడి నాగిరెడ్డి శాలువాతో సన్మానించి పతకాలు, సర్టిఫికేట్లను అందించారు.



## స్వచ్ఛందంగా రెండు సిసి కెమెరాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా సర్కిల్ సాకేత్ ట్రాన్‌ఫార్మర్ స్టేషన్ వద్ద ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు రెండు సిసి కెమెరాలు, మైక్‌లను స్వచ్ఛందంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు డి చిన్న నర్సింహ, డి.పెద్ద నర్సింహలు వారి సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. కాప్రా సర్కిల్‌లో 63 కెమెరాలు ఏర్పాటు చేశామని అందులో 5 కెమెరాలు స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేశారని శానిటరీ సూవర్‌వైజర్ సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని సుదర్శన్ శాలువాతో సత్కరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని దాతలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎ సంజీవ, అంజలి, సుబ్రహ్మణ్యం, మిరియాల సాయిలు, రాంకీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జాప్యంచేస్తే ప్రజలకు ఇబ్బందులు : కార్పొరేటర్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పనులు జాప్యంచేస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ వై.పేమ్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని పివిఎన్ నగర్ ప్రాంతంలో రూ.15 లక్షలతో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. మరమ్మత్తు, సిసి రోడ్డు పనుల కారణంగా మూసి వేయాల్సి వచ్చే రహదార్లతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడకుండా త్వరితగతంగా నాణ్యతగా పని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, సంపత్‌రావు, ఉదయ్, వాల పెంటయ్య, నాగేష్, శ్రీనివాస్, మోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 18న జాబ్‌మేళా : ఉపాధి కల్పనాధికారి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాధిక తెలిపారు. హెచ్1 హెఆర్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలో నెల వేతనం రూ.16 నుండి రూ.17 వరకు ఉండే సేల్స్ ఎక్జిక్యూటివ్ పోస్టులకు గాను గతి నుండి డిగ్రీ విద్యార్హతలతో, నెల వేతనం రూ.15 నుండి రూ.25 వరకు ఉండే కామిస్ I,II,III పోస్టులకు గాను హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, నెల వేతనం రూ.15 నుండి రూ.19 వేలు ఉండే టెక్నీషియన్ పోస్టులకు గాను ఐటిఐ ఎలక్ట్రీషియన్ విద్యార్హతలతో అభ్యర్థుల నియామకం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు www.nic.gov.in.portal ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ నెల 18న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటిఐ సంస్థలో ఎంపిక కార్యక్రమం జరుగుతుందన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చూపిస్తాం..

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన గ్రామాలలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది అని చేవెళ్ల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నవాబుపేట్ మండల కేంద్రంలోని మాణిక్య ప్రభు జాతర ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు జెండా ఎగరవేసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతనంగా ఏర్పడిన మండల బిఆర్ఎస్ అధ్యక్షులు అంతమొల్ల దయాకర్ రెడ్డికి, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### పెండింగ్ బిల్లులు పరిష్కరించాలని

## 'మధ్యాహ్న భోజన' కార్మికుల ధర్నా



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందించే నిర్వాహకులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్న డిమాండ్‌తో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సోమవారం నుండి 48 గంట ల ధర్నా కొనసాగిస్తున్నామని, వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జిలను పెంచటంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేసారు.

ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు సుజాత, ఆరుణ, రత్న, ప్రేమలత, విజయ,మమతలు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మెనూ చార్జిలను పెంచుతామంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రోజురోజుకు నిత్యా వసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతున్న మేరకు మెనూ చార్జిలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒక వైపు మెనూ ధరలు పెంచకపోగా పాత మెనూ ధరల మేరకే అదనంగా రాగి జావ, రెండు కోడిగుడ్ల స్థానంలో మూడు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని, తమకు ప్రస్తుతం చెల్లిస్తున్న కోడిగుడ్ల ధరలకు రెండు కూడా రావన్న విషయం అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. అదే విధంగా ఈ పథకం కింద పనిచేసే కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని, వంట గ్యాస్ సిలిండర్‌లను సబ్సిడీపై సరఫరా చేయాలని, మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ లాంటి మరో సంస్థకు అప్పచెప్పరాదని, ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌక ర్యం కల్పించాలని వారు డిమాండ్ చేసారు. ఇకనైనా సమస్య పరిష్కరించకపోతే తుది పోరాటంగా అసెంబ్లీ ముట్టడిస్తామన్నారు.




### కనీస వేతన అమలుకు

## సర్వశిక్ష ఉద్యోగుల డిమాండ్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః** వికారాబాద్ జిల్లాలోని ఉన్న సర్వశిక్షణ ఉద్యోగులు, ఎపిఒలు, సిస్టమ్ అనలిస్టులు, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్స్, డిఎల్‌ఎంటి, మెసెంజర్స్, మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐఈఆర్‌పిఎస్, మెసెంజర్స్, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్లు రీసోర్స్ పర్సన్, కెజిబివి, అర్బన్ రెసిడెన్షియల్స్, స్కూల్స్‌లో స్పెషల్ ఆఫీసర్లు, కంట్రాక్ట్ రిసోర్స్ టీచర్స్, పిఇటిలు, ఎఎన్‌ఎంలు, అకౌంటెంట్స్, క్రాఫ్ట్ అండ్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్స్, కుక్స్, వాచ్‌ఉమెన్స్, స్వీపర్లు, స్కావెంజర్లు, పాఠశాలస్థాయిలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్, భవిత కేంద్రాల్లో ఇంటక్లూజివ్, ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లుగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఒ కార్యాలయం ముందు ఏడు రోజులనుండి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తాము శ్రమదోపిడీకి గురవుతున్నామని ఉద్యోగులు అవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం కూడా అమలు చేయడం లేదని, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రెగ్యులరైజ్ రెగ్యులరైజ్ చేయాలని సమ్మెబాట పట్టారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకమైనప్పటికీ మెరిట్ రోస్టర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ విధానంలోకి నియమితులయ్యామని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల్లో నాలుగోవంతు జీతం మాత్రమే ఇస్తున్నారు. సర్వశిక్షణ ఉద్యోగులు చనిపోతే పట్టించుకునే వారు లేరని అన్నారు. 10లక్షల ఆరోగ్యబీమా కల్పించాలని మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు. టిఎడిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుంది అని తెలిపారు.

## జర్నలిస్ట్ కాలనీలో రోడ్డును మూసివేసిన లత లేక్ వ్యూ అపార్ట్‌మెంట్ వాసులు



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో లత లేక్ వ్యూ అపార్ట్‌మెంట్ వాసులు ఏకంగా రోడ్డును మూసివేశారు. జర్నలిస్ట్ కాలనీలోని లత లేక్ వ్యూ అపార్ట్‌మెంట్ వాసులు ఏకంగా సిమెంటు రోడ్డుని సైతం మూసివేసి రాకపోకలు చేయకుండా యథేచ్ఛగా సిమెంటు దిమ్మెలతో కూడిన కుర్చీలను వేశారు. ఈ విషయంపై జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే సిమెంటు రోడ్డును యథావిధిగా రాకపోకలు సాగించేలా సిమెంట్ కుర్చీలను తొలగించి అపార్ట్‌మెంట్ వాసులపై చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మారుతీసాగర్, వెంకట్, లాలయ్య పాల్గొన్నారు.



## కాసాని కృష్ణ సేవలు చిరస్మరణీయం

### రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వీరేశ్ ముదిరాజ్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిరుపేద ప్రజలకు స్వర్గీయ కాసాని కృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో మాజీ ఎంపిటీసీ స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ 18వ వర్ధంతి సభను స్థానిక కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాచుపల్లిలోని రాజీవ్ గాంధీ నగర్, సాయినగర్, ఇంద్రా నగర్‌లలోని కాసాని కృష్ణ ముదిరాజ్ విగ్రహానికి వీరేశ్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తరువాత బాచుపల్లిలోని బైరన్ చెరువులో నూతనంగా నిర్మించిన మత్స్య పారిశ్రామిక సంఘం భవనంలో



నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ విగ్రహాన్ని కాసాని వీరేశ్, కార్పొరేటర్‌లు ఆగం పాండు, ఆగం రాజు, కొలను వీరేంధర్ రెడ్డి, బాలాజీ నాయక్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీమ్, మాజీ ఎంపిటీసీ నందిగామ సత్యనారాయణలు పాల్గొని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందికి దుప్పట్లను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నాలుగు గ్రామాలకు ఎంపిటీసీగా ఉన్న స్వర్గీయ కాసాని కృష్ణ ముదిరాజ్ నిరుపేద ప్రజల అభివృద్ధికి అనేక విధాలుగా సేవలందించారని అన్నారు. పేద ప్రజల కోసం రాజీవ్ గాంధీ నగర్, సాయినగర్, ఇంద్రానగర్ తదితర బస్తీలు కాసాని కృష్ణ నేతృత్వంలో ఏర్పడ్డాయని గుర్తుచేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొలను సీతారాంరెడ్డి, దూసకంటి వెంకటేశ్, అంజి, నవీన్ ముదిరాజ్, నర్సింహ, చంద్రహాస్, శివ పాల్గొన్నారు.



## ప్రశాంతగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలుః ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః**వికారాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతగా ముగిశాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం అభ్యర్థులు 7213 ఉండగా 3755మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. 3458మంది గైర్హాజరు అయినట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 52 .06శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లాఎస్పి నారాయణరెడ్డి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. అదివారం డెంటల్ కళాశాలలో సెల్‌ఫోన్‌తో అభ్యర్థి పట్టుబడటంతో సోమవారం నాడు పోలీసులు అధికారులు భారీ బందోబస్తుమధ్య పరీక్షలు నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను జిల్లా అధికారులు తనిఖీ చేసి అభ్యర్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు, పరీక్ష కేంద్రాల వద్ద మైలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.

## శిల్పా లేఔట్ రెండవ స్థాయి ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శిల్పా లేఔట్ రెండవ స్థాయి ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి నుండి కొండాపూర్‌కు వెళ్ళే శిల్పా లేఔట్ రెండవ స్థాయి ఫ్లైఓవర్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వీస్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. భూసేకరణలో ప్రభుత్వ పాఠశాల భవనం కొంతమేరకు కోల్పోతున్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిఎస్ఆర్ పద్ధతిలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా దాటి వెళ్లిన సందర్భంలో ప్రమాదం సంభవించకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ నుండి కొండాపూర్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిహెచ్‌ఎంసి నగర వాసులకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు కృషి చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ మాదపాటి దేవానంద్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్.ఈ శంకర్ నాయక్, డిసి ముకుందా రెడ్డి, ఈఈ హరీష్, నామ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి వారి సమస్యలను అడుగుతూ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివ కుమార్ నాయుడు, సుభద్రదేవి, నళిని పద్మావతి, ఎస్.పంకజ, సరోజ, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, వేణు గోపాల్ రెడ్డి, అదనపు చీఫ్ సిటీప్లానర్లు గంగాధర్, ప్రదీప్, విజిలెన్స్ ఎసిపి సుదర్శన్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జలమండలి డి.జి.ఎం.సాయి రమణ, లేక్స్ ఈఈ నారాయణ, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్, యుబిడి డైరెక్టర్ శ్రీనివాస రావు, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్ మూర్తి రాజు, ఎఎంసిలు జీవన్ కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.




### ఖైదీలు, కరెక్షన్ హోమ్ పిల్లల్లో పరివర్తన కోసం

## 'ప్రిజన్ టూ ప్రైడ్','నయీ దిశ - రీడిఫైనింగ్ ది ఫ్యూచర్' ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైదీలు, కరెక్షన్ హోమ్స్‌లో ఉన్న పిల్లల జీవితాలలో మార్పు కోసం 'పరివర్తన్ ప్రిజన్ టూ ప్రైడ్' ఫేజ్ తొమ్మిది, 'నయీ దిశ రీడిఫైనింగ్ ది ఫ్యూచర్' ఫేజ్ ఆరుని ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ ఏఎస్ సాహ్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫేజ్ లో 28 జైళ్లు, 14 కరెక్షన్ హోమ్స్‌లలో ఉన్న 1650 మందికి పైగా వ్యక్తులకు ఇండియన్ ఆయిల్ చేరువకానుందన్నారు. ఇది ఖైదీలకు మరో అవకాశం కల్పించడమేనన్నారు. క్రీడలరూపంలో ప్రయోజనం కల్పించడం ఆనందాన్ని ఇస్తుందన్నారు. 38 నెలల్లో 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 150 ప్రదేశాలకు చేరువయ్యామని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా 7,300 పైగా వ్యక్తుల జీవితాలు ప్రభావితమయ్యాయన్నారు. ఈ ప్రయత్నాలన్నీ 'దేశానికి అగ్రస్థానం' అనే ఇండియన్ ఆయిల్ సిద్ధాంతాన్ని ప్రతిధ్వనింప చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమాలే కాకుండా 'ఉమీద్ ఏ హోప్' ద్వారా పరివర్తన తెస్తున్నామన్నారు. జైలు శాఖ సహకారంతో ప్రస్తుత, ఒకప్పటి ఖైదీలతో ఇంధన స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. న్యూఢిల్లీలోని ఒకానొక ఇండియన్ ఆయిల్ ఫ్యూయల్ స్టేషన్లో గత సంవత్సరం మొట్టమొదటి తీహార్ జైల్ స్టోర్ (టిజె) ప్రారంభించడమనేది అట్టడుగు వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలన్నీ సామాజిక ప్రభావంతో పాటు ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించాయన్నారు.

## ఆయిల్ ట్యాంకర్ బోల్తా తప్పిన పెనుప్రమాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోఇన మెట్టుగూడ వద్ద డిజిల్ ట్యాంకర్ అదుపు తప్పి నడి రోడ్డుపై బోల్తా పడింది. దీంతో



వేలాది లీటర్ల డిజిల్ రోడ్డుపై కిలోమీటర్ వరకు దోర్లింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అగ్నిప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పడంతో పోలీసులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. డీజిల్ ట్యాంకర్ బోల్తా పడటానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ అజాగ్రత్త వల్లే వాహనం బోల్తా కొట్టినట్లు సమాచారం.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసేవారిని శిక్షించాలి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసే వారిపై కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ జాఫర్‌గఢ్ చెరువు పరిధి బఫర్‌జోన్‌లో అక్రమ కట్టడాలు పరిశీలించడానికి వెళ్లిన రెవిన్యూ, ఎఇఇ, ఇతర అధికారులపై స్థానిక నోవా కాలేజీ యాజమాన్యం దుండగుల చేత దాడికి పాల్పడిందని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి, దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఇకపై సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో టిజిఒ ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, టిఎన్జీవో ప్రధానకార్యదర్శులు మాజీబ్, టిఐజిఇఎ అధ్యక్షులు శ్రీధర్, ఎటిఎఇఇ అధ్యక్షులు బండి శ్రీనివాస్ తదితర సంఘాల నాయులు పాల్గొన్నారు.

## క్రీడ

# కష్టాల్లో టీమిండియా.. !



**ఆ**స్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్ మూడో రోజు వరుణుడు ఆధిపత్యం చెలాయించాడు. పదే పదే అంతరాయం కలిగించడంతో సోమవారం 33 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. వర్షం కారణంగా ఇరు జట్ల ఆటగాళ్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 51 పరుగులే చేసింది. మరోసారి టీమిండియా టాప్4 బ్యాటర్లు యశస్వి జైస్వాల్(4), శుభ్ మన్ గిల్(1), విరాట్ కోహ్లి(3), రిషభ్ పంత్(9) దారుణంగా విఫలమవ్వగా.. కేఎల్ రాహుల్(33 బ్యాటింగ్)తో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ(0) క్రీజులో ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 2 వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్ ప్యాట్ కమిన్స్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 405/7 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. 445 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓవర్‌నైట్ బ్యాటర్ అలెక్స్ క్యారీ(70) హాఫ్ సెంచరీ సాధించగా.. మిచెల్ స్టార్క్(18) త్వరగానే ఔటయ్యాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను భారత్.. బౌండరీతో మొదలుపెట్టింది. కానీ ఆ మరుసటి బంతికే ఓపెనర్ యశస్వీ జైస్వాల్(4) క్యాచ్ ఔట్ అయ్యాడు. క్రీజులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్(1) స్లిప్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఆదుకుంటాడని భావించిన కోహ్లి.. మరో సారి తన ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీకి వెనుదిరిగాడు. ఈ దశ లో రెండు సార్లు వర్షం అంతరాయం కలిగించింది. ఆట తిరిగి ప్రారంభమవ్వగానే.. కమిన్స్ బౌలింగ్‌లో రిషభ్ పంత్(9) ఔటయ్యాడు. ఓవైపు వరుణుడు.. మరోవైపు వికెట్లు పడుతున్నా.. కేఎల్ రాహుల్ ఏకాగ్రతతో బ్యాటింగ్ చేశాడు. తన కే సాధ్యమైన కవర్ డ్రైవ్‌లతో అలరించాడు. రాహుల్‌తో పాటు క్రీజులో ఉన్న రోహిత్ శర్మ.. ఇతర బ్యాటర్లు నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజాలపైనే భారత్ ఆధార పడి ఉంది. ఫాలో ఆన్ గండం తప్పించుకోవాలంటే భారత్ కనీసం 246 పరుగులు చేయాలి. నాలుగో రోజు పూర్తిగా బ్యాటింగ్ చేస్తేనే.. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోగలదు. లేకుంటే మరో ఘోర పరాజయం తప్పదు.



## టెస్టు హిస్టరీలో చిన్న టార్గెట్‌లు అయినా కాపాడుకున్నాయ్!

**క్రి**కెట్ హిస్టరీ టెస్ట్ ఫార్మాట్‌తోనే మొదలైంది. దాదాపు 150 సంవత్సరాల సుదీర్ఘ టెస్ట్ క్రికెట్ చరిత్రలో అద్భుతమైన పోరాటాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా నాలుగో ఇన్నింగ్స్‌లో టీమ్‌లు అతి తక్కువ స్కోర్‌ఉ కాపాడుకున్న థ్రిల్లింగ్ మూమెంట్స్ చాలానే ఉన్నాయి. ఇప్పటి వరకు టెస్ట్ క్రికెట్‌లో 150 కంటే తక్కువ స్కోర్‌ని ఆయా టీమ్‌లు 19 సార్లు కాపాడుకున్నాయి. వీటిలో కేవలం రెండు సార్లు మాత్రమే ఒక జట్టు 100 కంటే తక్కువ లక్ష్యాన్ని కాపాడుకుంది. ఈ రెండు అరుదైన రికార్డులు 118 సంవత్సరాల నుంచి చెక్కు చెదరకుండా ఉన్నాయి. అయితే పురుషుల టెస్ట్ క్రికెట్ చరిత్రలో తక్కువ స్కోర్‌ని కాపాడుకున్న ఐదు మ్యాచ్‌లు ఏంటో మీకు తెలుసా?

*** 85 పరుగులు- ఆస్ట్రేలియా x ఇంగ్లాండ (1882) :** ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ క్రికెట్ చరిత్రలో చాలా పాపులర్. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 63 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లాండ బౌలర్ ఫ్రెడరిక్ స్పోఫోర్త్ ఏడు వికెట్లతో చెలరేగాడు. తర్వాత ఇంగ్లాండ 101 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా కేవలం 122 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్‌కు 85 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లాండ 512తో శుభారంభం చేసింది. కానీ, ఆసీస్ బౌలర్ స్పోఫోర్త్ మరో మ్యాజిక్ స్పెల్ అందించాడు. ఏడు వికెట్లు తీసి ఇంగ్లాండను 77 పరుగులకు ఆలౌట్ చేశాడు. ఫలితంగా ఆస్ట్రేలియా ఏడు పరుగుల తేడాతో గెలిచింది. టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత స్వల్ప లక్ష్యం కాపాడుకున్న జట్టుగా ఆసీస్ రికార్డు సృష్టించింది.

*** 99 పరుగులు- వెస్టిండీస్ x జింబాబ్వే (2000) :** పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జరిగిన సిరీస్‌లోని మొదటి టెస్టులో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 187, రెండో ఇన్నింగ్స్‌లో 147 పరుగులు చేసింది. జింబాబ్వేకు విండీస్ 99 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీంతో మ్యాచ్‌పై విండీస్‌కు ఏ మాత్రం ఆశల్లేవ్! అయితే నాలుగో ఇన్నింగ్స్‌లో జింబాబ్వే బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. గ్రాంట్ ఫ్లవర్ (126 బంతుల్లో 26 పరుగులు) తప్పా, ఇతర బ్యాటర్లెవరకూ రెండంకెల స్కోర్‌కు చేరుకోలేదు. 63 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో వెస్టిండీస్ 35 పరుగుల తేడాతో గెలిచింది.

*** 107 పరుగులు- భారత్ x ఆస్ట్రేలియా (2004) :** 2004లో ముంబయిలో ఆసీస్‌తో జరిగిన టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 104 పరుగులకే ఆలౌటైంది. ఆస్ట్రేలియా 99 పరుగుల ఆధిక్యం సాధించింది. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ ముందు 107 పరుగుల స్వల్ప లక్ష్యం ఉంది. కానీ భారత స్పిన్నర్లు హర్భజన్ సింగ్, మురళీ కార్తిక్, అనిల్ కుంబ్లే ఆసీస్‌ని ముప్పతిప్పలు పెట్టారు. ఆస్ట్రేలియాను 93 పరుగులకే ఆలౌట్ చేశారు. ఫలితంగా భారత్ 13 పరుగుల తేడాతో విజయం అందుకుంది.

*** 111 పరుగులు- ఇంగ్లాండ x ఆస్ట్రేలియా (1887) :** సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 45 పరుగులకే ఆలౌటైంది. ఆస్ట్రేలియా 119 పరుగులు చేయగలిగింది. కీలకమైన 74 పరుగుల ఆధిక్యాన్ని పొందింది. అయితే ఇంగ్లాండ రెండో ఇన్నింగ్స్‌లో 184 పరుగులు చేసి, ఆస్ట్రేలియాకు 111 లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆస్ట్రేలియా ఓ దశలో 584తో లక్ష్యన్ని అందుకునేలా కనిపించింది. ఇంగ్లాండ బౌలర్ బిల్లీ బరన్స్ అసాధారణమైన బౌలింగ్‌తో ఆరు వికెట్లు పడగొట్టి, ఆస్ట్రేలియాను 97 పరుగులకే ఆలౌట్ చేశాడు. దీంతో ఇంగ్లాండ 13 పరుగుల తేడాతో విజయం సాధించింది.

*** 111 పరుగులు- ఇంగ్లాండ x ఆస్ట్రేలియా (1896) :** ఓవల్‌లో ఇంగ్లాండ తొలి ఇన్నింగ్స్‌లో 26 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని పొందింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 84 పరుగులకే ఆలౌటైంది. మొత్తానికి నాలుగో ఇన్నింగ్స్‌లో ఆసీస్ ముందు 111 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. అయితే ఆస్ట్రేలియా అనూహ్యంగా 44 పరుగులకే కుప్పకూలింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో వారి మూడో అత్యల్ప స్కోరు. ఫలితంగా ఇంగ్లాండ 66 పరుగులతో అద్భుతమైన విజయాన్ని అందుకుంది.

## రీల్




## నూతన సంవత్సర కానుకగా విశ్వక్ సేన్ 'లైలా' ట్రీట్

**మా**స్ కా దాస్ విశ్వక్ సేన్ రీసెంట్ మూవీ 'మెకానిక్ రాకీ' బాక్సాఫీస్ దగ్గర డీసెంట్ హిట్‌గా నిలిచింది. ఇక ప్రస్తుతం తన నెక్స్ట్ చిత్రాలతో బిజీగా మారాడు ఈ మాస్ హీరో. ఇప్పటికే 'లైలా' అనే ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన విశ్వక్, ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. అయితే, ఈ సినిమా నుండి ఓ అప్డేట్‌ను మేకర్స్ తాజాగా రివీల్ చేశారు. 'లైలా' మూవీకి సంబంధించిన ఫస్ట్ ట్రీట్‌ను నూతన సంవత్సర కానుకగా రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్ తో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై అంచనాలు క్రియేట్ కాగా.. ఇప్పు డు ఈ న్యూ ఇయర్ ట్రీట్ ఏమై ఉంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, ఈ చిత్ర టీజర్‌ను ఆ రోజున రిలీజ్ చేస్తారనే టాక్ వినిపి స్తోంది. ఇక ఈ సినిమాలో విశ్వక్ సేన్ తొలిసారి లేడీ గెటప్‌లో కనిపించనున్నాడు. ఈ చిత్రాన్ని రామ్ నారాయణ్ డైరెక్ట్ చేస్తుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

## 'కన్నప్ప' నుంచి మోహన్ లాల్ ఫస్ట్ లుక్



**మం**చు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా చిత్రం కన్నప్ప. ఈ చిత్రం కోసం విష్ణు కఠినంగా కష్టపడుతున్నాడు. పైగా ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి స్టార్లు కూడా నటిస్తున్నారు. ఏప్రిల్ 25, 2025న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఐతే, సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్‌లో భాగంగా మేకర్స్ ప్రతి సోమవారం తమ సినిమాలోని క్యారెక్టర్ లను రివీల్ చేస్తూ పోస్టర్‌లను విడుదల చేస్తూ వస్తున్నారు. ఈరోజు, మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్‌లాల్ పాత్రను రివీల్ ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఐకానిక్ కిరాత – మాస్టర్ ఆఫ్ ది పాశుపతాస్త్రం, విక్టర్ ఓవర్ ది విక్టోరియస్, ది లెజెండరీ గార్డియన్ ఆఫ్ ది ఫారెస్ట్‌గా ఈ సినిమాలో మోహన్ లాల్ నటిస్తున్నాడు. మోహన్ లాల్ ఇంటెన్స్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రీతి ముకుందన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామాకి మహాభారత్ సీరియల్‌ని డైరెక్ట్ చేసిన ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## సస్పెన్స్‌తో 'డెకాయిట్' పోస్టర్..




**టా**లీవుడ్‌లో వరుస సినిమాలతో బ్లాక్‌బస్టర్ హిట్స్ అందుకుంటున్న యంగ్ హీరో అడివి శేష్ ప్రస్తుతం పలు సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే 'గూఢచారి' చిత్రానికి సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్న అడివి శేష్, 'డెకాయిట్' అనే మరో క్రైమ్ థ్రిల్లర్ చిత్రంలో కూడా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమాను షేనియల్ డియో డైరెక్ట్ చేస్తుండగా, తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ అప్డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. 'డెకాయిట్' చిత్రంలో ఓ ప్రేమ కథ కూడా ఉందని.. ఈ సినిమాలో హీరో అడివి శేష్ ఎవరిని ప్రేమిస్తు న్నాడు అనేది చిత్ర యూనిట్ సస్పెన్స్‌గా పెట్టారు. ఈ మేరకు తాజాగా ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. "తనని కాపాడినా.. కానీ ఒదిలేసినాది.. తను ఏంటో.. అసలెవరో.. రేపు తెలుస్తాది.." అంటూ హీరో అడివి శేష్ ఈ చిత్రంలోని హీరోయిన్‌ను పరిచయం చేస్తున్నాడు. ఇక హీరోయిన్ ముఖం రివీల్ కాకుండా కేవలం కళ్ల వరకు కనిపించేలా ఈ కొత్త పోస్టర్ ఉండటంతో అభిమానులు ఈ హీరోయిన్ ఎవరా.. అని ఆసక్తిగా చూస్తున్నారు. కాగా, గతంలో ఈ చిత్రంలో స్టార్ బ్యూటీ శ్రుతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తుందని మేకర్స్ ప్రకటించినా, ఇప్పుడు ఆమె ఈ సినిమా నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా సుప్రియ యార్లగడ్డ ప్రొడ్యూస్ చేస్తున్నారు. మరి 'డెకాయిట్' కొత్త పోస్టర్‌లో కనిపిస్తున్న హీరోయిన్ ఎవరో మీరు గెస్ చేయగలరా..?

# అన్ని ప్రాంతాలలో ఎర్రజెండా ఆవిష్కరించాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ టి.నరసింహ్మా**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ తెలిపారు. భారత కమ్యునిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం మామిడి చెట్ల వెంకటస్వామి అధ్యక్షతన హైదరాబాద్‌లో సోమవారం జరిగింది.ఈ సమావేశానికి ఈ.టి నరసింహ ముఖ్య అతిథిగా విచ్చేసిన మాట్లాడారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పార్టీ చేసిన పోరాటాలను,త్యాగాలను ,సాధించిన విజయాలు ప్రజలకు వివరించడానికి సెమినార్లను, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలను నిర్వహించాలని, తద్వారా నూతన ఆలోచనలు కలిగిన యువతను ఆకట్టుకుని, సిపిఐ బలోపేతానికి కృషి చేయాల్సిన బాధ్యత తమపైన ఉన్నదని తెలిపారు.

**మతం ముసుగులో ఫాసిస్టు పాలన చేస్తున్న బిజెపి భావజాలాన్ని ఓడించాలి: చాయా దేవి**

అనేక అబద్దాల తో ప్రజలను మోసం చేసి, అధికారం లోకి వచ్చిన బిజెపిప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. చాయాదేవి విమర్శించారు. కొద్ది మంది కార్పొరేట్ దోపిడి దారులకు బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కట్టబెడుతున్నారని, ప్రశ్నించిన గొంతులను నొక్కుతూ,అక్రమ కేసులను నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. తమ సంస్కృతి మాత్రమే గొప్పదని,ఇతరుల మతాల తో మనకు ప్రమాదం పొంచి ఉందని మైండ్ గేమ్ ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి ఫాసిస్ట్ ఆలోచన కలిగిన బిజెపి ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం లో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్,పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్,మామిడి చెట్ల వెంకటస్వామి, సలీం ఖాన్,మహమ్మద్ సలీం, ఉమర్ ఖాన్ లు పాల్గొన్నారు.

## కౌశిక్‌రెడ్డికి ఫోన్ ఇచ్చేయండి: హైకోర్టు

**హైదరాబాద్:**మాసబ్‌ట్యాంక్ పోలీసులు ఈ నెల 5న తీసుకున్న ఫోన్‌ను తిరిగి ఇప్పించాలంటూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేసిన పిటిషన్‌లో హైకోర్టు సోమవారం సానుకూల ఉత్తర్వులను జారీ చేసింది. పోలీసులు స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌ను తిరిగి కౌశిక్‌రెడ్డికి తక్షణమే ఇవ్వాలంది. ఈ మేరకు జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎందుకు ఫోన్ స్వాధీనం చేసుకున్నదీ చెప్పలేదని, ఇంట్లోకి దౌర్జనంగా పోలీసులు వచ్చి ఫోన్ తీసేసుకున్నారని పిటిషనర్ వాదన. మరో కేసు విచారణలో భాగంగా పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారని, ఎఫ్ఎస్ఎల్ పరీక్షలకు ఫోన్ పంపాల్సివుందని, ప్రభుత్వంపై కుట్ర చేశారనే అభియోగాలు పిటిషనర్‌పై ఉన్నాయని పోలీసుల వాదన. వాదనల తర్వాత హైకోర్టు, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న తీరు చట్ట నిబంధనలకు లోబడి లేదని చెప్పింది. తక్షణమే ఐఫోన్‌ను పిటిషనర్‌కు ఇచ్చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.. ఒకవేళ కేసు దర్యాప్తునకు ఫోన్ అవసరమని భావిస్తే.. చట్ట నిబంధనల మేరకు స్వాధీనం చేసుకోవచ్చునని పోలీసులకు చెప్పింది.

## నెహ్రూ లేఖ... మోదీ వక్రీకరణ

(మొదటి పేజీ తరువాయి)

కోట్లమందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందనీ, రైతులకు గిట్టుబాటు ధరలు ఇచ్చి వారి ఆదాయాలను రెట్టింపు చేస్తామని వాగ్దానం చేసిందనీ, ఈ వాగ్దానాలన్నీ బూటకాలుగా మిగిలిపోయాయనీ విమర్శించారు. 1947–52 మధ్యకాలంలో ఎన్నికైన ప్రభుత్వం లేదని, కాంగ్రెస్‌పార్టీ అక్రమంగా రాజ్యాంగాన్ని సవరించిందని మోదీ తన ప్రసంగంలో చెప్పడాన్ని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. దేశంలో షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు తెగలకు రిజర్వేషన్లు ఇవ్వడంకోసం రాజ్యాంగానికి మొదటి సవరణ జరిగిందని, విద్య, ఉద్యోగితలకు సంబంధించిన లోపాలని సరిదిద్ది జమిందారీవ్యవస్థను రద్దు చేసిందని ఖర్గే చెప్పారు. రాజ్యాంగసభ సభ్యులలలో ఒకరుగా ఉన్న ఆనాటి జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన శ్యాంప్రసాద్ ముఖర్జీ కూడా రాజ్యాంగ సవరణ సందర్భంలో ఉన్నారన్నారు. రాజ్యాంగసభలో ఎవరెవరు సభ్యులుగా ఉన్నారన్న విషయాన్ని కూడా మోదీ తప్పుతప్పుగా చెప్పారని, ఎంపిక చేసిన వారి పేర్లు మాత్రమే రాజ్యాంగసభ సభ్యులుగా ఆయన చెప్పారని ఖర్గే విమర్శించారు. రిజర్వేషన్లకు సంబంధిం చి మద్రాసు రాష్ట్రం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయాన్ని తాను ఈ సభ దృష్టికి తీసుకురాదలిచానని ఆయన గుర్తుచేశారు.

**సమాఖ్యవ్యవస్థను బలహీనపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం**

కేంద్ర ప్రభుత్వం దేశ సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తోందని రాజ్యసభలో ప్రతిపక్షాలు విమర్శించాయి. 75 సంవత్సరాల రాజ్యాంగ సుదీర్ఘ ప్రస్తానంపై రాజ్యసభలో సోమవారం ప్రారంభమైన చర్చలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రంలోని బిజెపి బలహీనపరుస్తోందని, దేశంలో ఈనాడు ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకుని ఉన్నాయ ని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. బిజెడి అటు ఎన్‌డిఎలో, ఇటు ఇండియా కూటమి రెంటిలోనూ భాగస్వామిగా లేనప్పటికీ ఆ పార్టీకి చెందిన ఎంపి దేవాశిశ్ సమంతరే కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. రాజ్యాంగానికి రక్షణగా ఉండాల్సిన వ్యవస్థలను పెంపుడు వ్యవస్థలుగా మార్చేశారని విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సాకేత్ గోఖలే మాట్లాడుతూ, ఎన్‌డిఎ పాలనలో ప్రజలకు న్యాయం కరవైందని అన్నారు. రాజ్యాంగాన్ని బిజెపి నాశనం చేసిందన్నారు. దేశం లో సామాజిక న్యాయం లేదన్నారు. ఇడి, సిబిఐలను ఉపయోగించి అవినీతి పరులను బెదిరించి బిజెపి వాషింగ్ మెషీన్‌లో తిప్పి వారిని పవిత్రులుగా మార్చేస్తున్నారని విమర్శించారు. డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ, దేశ సమాఖ్యవ్యవస్థను బిజెపి నాశనం చేసిందన్నారు.

## కొత్త రేషన్ కార్డులు జారీ

(మొదటి పేజీ తరువాయి)

సమాధానమిస్తూ ప్రభుత్వ అంచనా ప్రకారం కొత్తగా 10 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉందని సభకు వివరించారు. దీంతో మరో 40 లక్షల మంది లబ్ది పొందే అవకాశం ఉందని, ఈ సంఖ్య మొత్తం 3.20 కోట్లకు చేరనుందని తెలిపారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 4 కోట్ల మంది జనాభా ఉంటే ఇందులో 3.20 కోట్ల మంది ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యంపైనే అధారపడి ఉన్నారని అంటే రాష్ట్రం 80 శాతం పేదరికం ఉన్నట్లే కాదా ? మరి రాష్ట్రం ఏరకంగా అభివృద్ధి చెందిందో చెప్పాలని ఎంఎల్‌సి ఎ.నర్సిరెడ్డి కోరారు. అదేవిధంగా గోదాముల్లో నుంచి వచ్చే క్వింటాల్ బియ్యంలో 5 నుంచి 6 కెజీల వరకు తరుగుదల ఉంటుందని రేషన్ డీల్లరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్ని గోదాముల వద్ద వేబ్రిడ్జిలను ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరించాలని సభ్యులు తక్కళ్లపల్లి రవీందర్ రావు కోరారు. అయితే ఇందుకు సంబంధించి తప్పకుండ చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. మరో సభ్యులు సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తండాలు, గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని మంత్రి దృష్టికి తీసుకురాగా, ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు ప్రతి నెల ఇస్తామన్న రూ.5వేల గౌరవ వేతనం ఎప్పటీ నుంచి అమలు చేస్తారని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీందర్ రావు అడిగిన మరో ప్రశ్నకు ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉందని త్వరలో తుది నిర్ణయంతీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు.

## భారత్–శ్రీలంకల బంధం మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

అనుసంధానత, సహకారానికి భౌతిక, డిజిటల్, విద్యుత్ అనుసంధానత మూల స్థంభాలని పేర్కొన్నారు. విద్యుత్ గ్రిడ్ అనుసంధానతకు పనులు జరుగుతాయని, అలాగే శ్రీలంక దేశ విద్యుత్ కేంద్రాలకు ద్రవరూప సహజ వాయువును భారత్ సరఫరా చేస్తుందని, బహుళ ఉత్పత్తి పెట్రోలియం పైపులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇరు దేశాల మధ్య అనుసంధానాన్ని పెంచేందుకు రామేశ్వరం, తలైమనార్‌ల మధ్య పడవ(ఫెర్రీ) సర్వీసులను ప్రారంభిస్తామని ప్రకటించారు. తమ భద్రత ప్రయోజనాలు పరస్పర అనుసంధానమైనవని ఇరువురం అంగీకారానికి వచ్చాయమని, త్వరలోనే రక్షణ సహకార ఒప్పందాన్ని పరిపూర్తి చేస్తామని, హైడ్రోగ్రఫీ(సముద్రపటాల) సహకారానికి సంబంధించి కూడా ఒప్పందం ఉంటుందన్నారు. ఇరుదేశాల మధ్య జాలరుల అంశం కూడా చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. జాలరుల జీవనోపాధికి సంబంధించిన అంశాలను కూడా చర్చించామని, దీనిపై మాన్వత్వ వైఖరితో సాగాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. తమిళుల ఆకాంక్షలను శ్రీలంక ప్రభుత్వం నెరవేరుస్తుందని భారతదేశం ఆశిస్తుందన్నారు. భారతదేశం ఇప్పటి వరకు శ్రీలంకకు 500 కోట్ల అమెరికా డాలర్ల విలువైన రుణాలు, ఆర్థిక సహాయం అందించినట్లు ప్రధాని వెల్లడించారు. శ్రీలంకలోని 25 జిల్లాలక తమ సహకారం ఉందని, భాగస్వామ్య దేశాల ప్రాధాన్యత ఆధారంగా ప్రాజెక్టుల ఎంపిక ఉంటుందన్నారు.

## 'నేడు' లోక్‌సభ ముందుకు 'జమిలి ఎన్నికల బిల్లు'

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేయవచ్చు. రాజ్యాంగం (129వ) సవరణ బిల్లులోని సెక్షన్ 2 సబ్ క్లాజ్ ప్రకారం...ప్రజల సభకు సాధారణ ఎన్నికలతో పాటు ఏదైనా శాసనసభకు ఎన్నికలు నిర్వహించలేమని ఎన్నికల సంఘం (ఇసి) అభిప్రాయపడితే అది చేయవచ్చు. ఆ శాసనసభకు ఎన్నికలను తర్వాత తేదీలో నిర్వహించవచ్చని ఉత్తర్వు ద్వారా ప్రకటించాలని రాష్ట్రపతికి సిఫారసు చేయవచ్చు. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీకి ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా రాజ్యాంగంలో కొత్త ఆర్టికల్‌ను జొప్పించి మూడు ఆర్టికల్‌లనూ సవరించాలని బిల్లు కోరుతోంది. బిల్లు కొత్త ఆర్టికల్ 82(ఎ).. ప్రజలసభ (లోక్‌సభ),అన్ని శాసనసభలకు ఏకకాల ఎన్నికలు ఆర్టికల్ 83(పార్లమెంట్‌సభల వ్యవధి), ఆర్టికల్ 172(రాష్ట్ర శాసనసభల వ్యవధి), ఆర్టికల్‌ను సవరించాలని ప్రతిపాదించింది. ఆర్టికల్ 327 (శాసనసభలకు ఎన్నికలకు సంబంధించి సదుపా యాలు కల్పించడానికి పార్లమెంట్ అధికారం)ఇది అమలులోకి వచ్చిన తర్వాత, సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశం జరిగే తేదీపై రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాలి. ఆ నోటిఫికేషన్ తేదీని అపాయింటెడ్ డేట్ అంటారు. ఆ నిర్ణీత తేదీ నుంచి లోక్‌సభ పదవీకాలం ఐదు సంవత్సరాలపాటు ఉంటుంది. అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం, నియమిత తేదీ తర్వాత గడువు ముగిసేలోపు శాసనసభలకు ఎన్నికల ద్వారా ఏర్పడుతుంది. లోక్‌సభ పూర్తి పదవీకాలం ముగియడంతో ప్రజలసభ పూర్తి కాలం ముగుస్తుంది. ఆతర్వాత ప్రజల సభకు అన్ని సాధారణ ఎన్నికలు, అన్ని శాసనసభలకు ఏకకాలంలో నిర్వహించబడతాయి.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com